

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వరంగల్

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 40

శుక్రవారం | 9-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి మ.2.57 తదుపరి త్రయోదశి; నక్షత్రం: హస్త రా.12.09 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.6.34-8.22; దుర్ముహూర్తం: ఉ.8.22-9.13, మ.12.37-1.28; అమృతఘడియలు: సా.5.23-7.11; రాహుకాలం: ఉ.10.30-మ.12.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సిద్ధమా?

నిరంతరం
అప్రమత్తంగా ఉండండి

ఎప్పుడు ఎక్కడ ఏమి జరిగినా సమాచారం క్షణాల్లో తెలిసిపోవాలి

ప్రజల భద్రత ముఖ్యం.. జాగ్రత్త

తప్పుడు సమాచారాన్ని అడ్డుకోండి

సైనిక స్థావరాల భద్రతకు చర్యలు తీసుకోండి

కీలక శాఖల కార్యదర్శులకు మోదీ నిర్దేశం

13

100 మందిని హతమార్చాం

అఖిలపక్షంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

పాక్‌కు చావుదెబ్బ!

కరాచీ, ఓమ్రారా పోర్టులపై భారత్ భీకర దాడి.. రంగంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

దాని వెంట 26 యుద్ధ నౌకలు.. బ్రహ్మోస్ క్షిపణులతో మెరుపుదాడులు?

పాక్‌కు చెందిన 10-12 నౌకలు ధ్వంసం.. 1971 పునరావృతం?

గోడ దెబ్బ.. చెంప దెబ్బ.. ఒకేసారి గట్టిగా.. ఘాటుగా తగిలితే! పాకిస్థాన్ పరిస్థితి ఇపుడు ఇదే! పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలనే భారత సైన్యం ధ్వంసం చేసింది! పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగానే దాడులు చేశామని స్పష్టం చేసింది! అయినా.. పాకిస్థాన్ కయ్యానికి సై అంది! సమరానికే సిద్ధమంది! యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతూ.. మన సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై గురి పెట్టింది! బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే.. భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడికి విఫల యత్నం చేసింది! ఆ దాడులను మన 'సుదర్శన చక్రం' (ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్) తుత్తునియలు చేసింది! ప్రతిగా.. లాహోర్ సహా పాకిస్థాన్‌కు చెందిన తొమ్మిది ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై భారత్ భీకర దాడులు చేసింది. దాంతో, మరింత రెచ్చిపోయిన పాకిస్థాన్.. డ్రోన్లు, రాకెట్ల వర్షం కురిపిస్తోంది! భారత్ వాటన్నిటినీ గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేస్తోంది! వెరసి, సరిహద్దు గ్రామాల్లో ఇపుడు యుద్ధ వాతావరణం నెలకొంది! దీంతో, అటు పాకిస్థాన్, ఇటు భారత్‌తో అమెరికా సంప్రదింపులు జరిపింది. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచించింది! ఆ చర్చలు విఫలమైన మరు క్షణంలోనే పాకిస్థాన్‌కు చావు దెబ్బ తప్పలేదు! అటు క్వెట్టాను బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకుంది. దాంతో, అక్కడి నుంచి పాక్ ఆర్మీ పలాయనం చిత్తగిస్తోంది! ఆ వెంటనే.. కరాచీ పోర్టుపై భారత నావికా దళం భీకర దాడి చేసింది! అరేబియా సముద్రంలో ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్ గ్రూపు నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించింది! ఇరు దేశాల మధ్య ఇక.. సమరమే!!

న్యూఢిల్లీ, మే 8: యుద్ధం మొదలైంది! పాకిస్థాన్ వాణిజ్యానికి అత్యంత కీలకమైన కరాచీ పోర్టుపై భారత నావికా దళం భీకర దాడి చేసింది. అరేబియా సముద్రంలోని ఐఎన్ఎస్ విక్రాంత్ బ్యాటిల్ గ్రూప్ నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించింది. ఈ దెబ్బకు పోర్టు మంటల్లో చిక్కుకుంది. అక్కడి 10-12 భారీ నౌకలు ధ్వంసమయ్యాయి. 1971 తర్వాత కరాచీ పోర్టుపై భారత్ దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వార్తా కథనాలు వెలువడ్డాయి. దీనికి సంబంధించి అటు పాక్, ఇటు భారత సైనిక వర్గాల నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. కానీ, నావికా దళంలోని ఉన్నతస్థాయి వర్గాలను ఉటంకిస్తూ పలు టీవీ చానళ్లు, వెబ్‌సైట్లు కథనాలను ప్రసారం చేశాయి. అలాగే, పాకిస్థాన్‌లోని కీలక నావికా స్థావరాలపైనా భారతీయ నావికా దళం దాడులు చేసినట్లు సమాచారం. ఓవైపు.. అత్యంత కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన భారతీయ వైమానిక దళం.. ఆ తర్వాత పాకిస్థాన్ రాకెట్, డ్రోన్ దాడులనూ సమర్థంగా అడ్డుకుంటోంది. తాజాగా, భారత నావికా దళం కూడా రంగంలోకి

మిగతా 11వ పేజీలో...





పాక్ చేజారిన క్వెట్టా నగరం?

బలూచ్ లిబరేషన్ ఆర్మీ చేతికి?

భారత్‌తో యుద్ధమే అదనుగా రెచ్చిపోయిన బలూచ్ వేర్పాటువాదులు

పాక్ ఆర్మీపై భీకర దాడులు

క్వెట్టా వదిలి పరారవుతున్న పాక్ సైన్యం



బలూచ్ లిబరేషన్ ఆర్మీ నేత బషీర్ జైబ్

యుద్ధ బీభత్సం!

బుధవారం అర్ధరాత్రి నుంచి భారత్‌పై పాక్ దాడులు

క్షిపణులు, డ్రోన్లతో 15 నగరాలపై గురి

సైనిక స్థావరాలను ధ్వంసం చేసే ప్రయత్నం

తిప్పికొట్టిన భారత గగనతల రక్షణ వ్యవస్థ

ఎస్400, ఇతర వ్యవస్థలతో పాక్ క్షిపణుల కూల్చివేత

పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని

డ్రోన్లు, క్షిపణులతో ప్రతీకార దాడికి దిగిన భారత్

లాహోర్, కరాచీ, రావల్పిండి సహా 9 నగరాలపై గురి

సియాల్‌కోట్, లాహోర్‌లో ఎయిర్ డిఫెన్స్ ధ్వంసం!

రెచ్చిపోయిన పాక్.. సరిహద్దుల్లో డ్రోన్లు, రాకెట్ల వర్షం

జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లో పేలుళ్లు, సైరన్లు

అమృత్‌సర్ సహా పలు నగరాల్లో కమ్ముకున్న చీకట్లు


పహల్గాం దాడితో ఉద్రిక్తతలకు తెరలేపింది పాకే!

భారత్ దాడులు కేవలం ప్రతిస్పందన మాత్రమే

ఉగ్రవాదులకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలా?: విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

జమ్ము, శ్రీనగర్, చండీగఢ్, మే 8: భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం! సైరన్లు మోగుతున్నాయి! సరిహద్దు ప్రాంతాల్లో చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి! ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడిని జీర్ణించుకోలేని పాకిస్థాన్.. సరిహద్దు ప్రాంతాలపై రాకెట్లు, డ్రోన్ల వర్షం కురిపిస్తోంది. భారత్‌కు చెందిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు వీటిని సమర్థంగా, సంపూర్ణంగా అడ్డుకుంటున్నాయి. పఠాన్‌కోట్, జమ్ము నగరం, ఉధంపూర్‌లో మూడు పాక్ డ్రోన్లను భారత గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. జమ్ము యూనివర్సిటీ వద్ద రెండు డ్రోన్లను కూల్చివేశాయి. అలాగే.. సట్వారీలోని జమ్ము విమానాశ్రయం సహా సరిహద్దు ప్రాంతాలే లక్ష్యంగా గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పాకిస్థాన్ ఎనిమిది క్షిపణి దాడులు చేసింది. వీటిని భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకున్నాయని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. హమాస్ ఉగ్ర సంస్థ తరహాలో 'చవకబారు' రాకెట్లను ప్రయోగిస్తోందని, సట్వారీ (జమ్ము విమానాశ్రయం), సాంబ, ఆర్ఎస్ పుర, అర్నియా తదితర

మిగతా 11వ పేజీలో...



3 పాక్ విమానాల కూల్చివేత

రెండు జేఎఫ్17 విమానాలు కూలిపోయాయి.. పాక్ అంగీకారం

ఎఫ్ 16ను కూడా కూల్చిన భారత్.. ప్రముఖ మీడియా సంస్థల కథనాలు

భారత్ చేత చిక్కిన జేఎఫ్17 పైలట్.. పలు డ్రోన్లు కూడా కూల్చివేత



న్యూఢిల్లీ, మే 8: ఉద్రిక్తతల వేళ భారత సైన్యం దీటుగా స్పందిస్తోంది. సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులకు యత్నించిన పాకిస్థాన్‌కు గట్టిగా బదులిస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన రెండు జేఎఫ్-17 ఫైటర్ జెట్ విమానాలను, ఒక ఎఫ్-16 జెట్ విమానాన్ని గగనతల రక్షణ వ్యవస్థతో కూల్చేసింది. రాజస్థాన్‌లోని లాఠీ ప్రాంతంలో కూల్చేసిన జేఎఫ్-17 ఫైటర్ జెట్ పైలట్‌ను భారత సైన్యం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తమ దేశానికి చెందిన రెండు జేఎఫ్-17 ఫైటర్ జెట్ విమానాలను భారత్ కూల్చేసిందని పాక్ సైన్యం కూడా అంగీకరించింది. పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ డైరక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ఈ విషయాన్ని నిర్ధారిస్తూ ప్రకటన చేశారు. పాక్‌కు చెందిన అనేక డ్రోన్లను కూడా భారత్ కూల్చివేసినట్లు సమాచారం.

పాక్ క్షిపణులపై సుదర్శన చక్రం

ఎస్400లతో అడ్డుకున్న భారత్

12

ఏపీకి అమరావతే శాశ్వత రాజధాని!

విభజన చట్టంలో చేర్చాలని కేంద్రానికి వినతి

సెక్షన్-5 సవరణకు అభ్యర్థన

తీర్మానానికి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం

3

అందమైన భామలూ..!

మిస్ వరల్డ్‌కు సర్వం సిద్ధం



గచ్చిబౌలి స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి

రేపటి నుంచి పోటీలు ప్రారంభం

9

ఇప్పటిదాకా 109 మంది అందగత్తెల రాక

సామాన్యులకూ పోటీలు చూసే అవకాశం

అందంతో కీర్తి.. మహిళల్లో స్ఫూర్తి

మిస్ వరల్డ్ విజేతలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నారు

ఆఫ్రికాలోని పేద దేశాల్లోనూ గణనీయమైన మార్పులు

రాష్ట్రాన్ని కొత్తగా ప్రపంచానికి పరిచయం చేయబోతున్నాం

ఈసారి 'హ్యూమానిటేరియన్ అవార్డ్' సోనూసూద్‌కు

9

'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్ చైర్‌పర్సన్, సీఈవో జూలియా

ఉగ్రమూకలకు నూకలు చెల్లినట్లే!



సంఘీభావ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్, సీఎస్ తదితరులు

భారత్‌వైపు కన్నెతి చూస్తే.. బతికే అర్హత లేనట్లే

మా ఆడబిడ్డల నుదుటి సిందూరం తీసినవారికి 'ఆపరేషన్ సిందూర్'తో సమాధానం చెబుతాం

జవాన్లకు స్ఫూర్తినిచ్చేందుకే ర్యాలీ: సీఎం రేవంత్

ఆక్రమించుకున్నవారికే హైడ్రా అంటే భయం

14

ప్రభుత్వం ముందుకెళ్లకుండా కుట్రలు

హైడ్రా పీఎస్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి



ఫాంహౌస్‌లో పడుకొని ప్రేలాపనలా?

ఏడాదిలో ఆరోగ్యశాఖకు 11,487 కోట్లు వెచ్చించాం: భట్టి

450 కోట్లతో రాష్ట్రంలో 90 ట్రామా సెంటర్లు: దామోదర

3

పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తాం: తుమ్మల

ఖమ్మానికి మణిహారంలా ప్రభుత్వ వైద్య కాలేజీ: పొంగులేటి

గ్రూప్-1 పేపర్లు దిద్దిన వెల్డర్!

మూల్యాంకనం చేసినట్లు పేపర్‌పై సంతకం

ఏపీపీఎస్సీ సిబ్బంది మెడకు 'పునఃపరిశీలన'

రీచెక్ చేయకుండానే సంతకం పెట్టి, స్టాంపు

ఐదుగురిని జైలుకు పంపనున్న పోలీసులు

9

దండకారణ్యంలో మందుపాతర

ముగ్గురు రాష్ట్ర గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మృతి

ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారంటూ ప్రచారం

13

నూతన పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

చరిత్రలో తొలిసారి ఓ అమెరికన్ ఎన్నిక

ఆ న్యాయమూర్తిని అభిశంసించండి!

జస్టిస్ యశ్వంత్ వర్మపై ఇన్‌హౌస్ ప్రొసీజర్!

రాష్ట్రపతి, ప్రధానికి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి లేఖ

జడ్జి ఇంట్లో డబ్బు కట్టలు నిజమేనన్న కమిటీ

13

కమిటీ నివేదికను లేఖకు జతచేసిన చీఫ్ జస్టిస్ ఖన్నా

కేంద్రానికి ఆర్‌బీఐ
బంపర్ బొనాంజా!

- ఈసారి రూ.3.50 లక్షల కోట్ల వరకు డివిడెండ్ అందించే అవకాశం
- కోటక్ మహీంద్రా బ్యాంక్ అంచనా



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి బంపర్ బొనాంజా ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్రానికి ఆర్‌బీఐ రూ.3.5 లక్షల కోట్ల వరకు డివిడెండ్ చెల్లించే అవకాశం ఉందని కోటక్ మహీంద్రా బ్యాంక్ అంచనా వేయగా.. ఈ మొత్తం రూ.3 లక్షల కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ భావిస్తోంది. ఈసారి ఆర్‌బీఐ నుంచి రూ.2.56 లక్షల కోట్ల డివిడెండ్ లభించవచ్చన్న ప్రభుత్వ బడ్జెట్ అంచనా కంటే అధికమిది. అంతక్రితం ఆర్థిక సంవత్సరానికి (2023-24) గాను ఆర్‌బీఐ అందరి అంచనాలకు మించి రూ.2.1 లక్షల కోట్ల మిగులు నిధులను కేంద్రానికి బదిలీ చేసింది. ఈసారి నిధుల బదిలీ గతసారితో పోలిస్తే కనీసం 50 శాతం మేర పెరగవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఫారెక్స్ మార్కెట్ కార్యకలాపాల ద్వారా కమీషన్లు, విదేశీ కరెన్సీ ఆస్తులు, ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీ ఆదాయం, కరెన్సీ ముద్రణ రుసుము రూపంలో ఆర్‌బీఐకి ఆదాయం సమకూరుతుంది. అందులో నుంచి అవసరమైన కేటాయింపులు జరిపిన అనంతరం మిగిలిన నిధులను ఆర్‌బీఐ కేంద్రానికి డివిడెండ్ రూపంలో బదిలీ చేస్తుంది. ఈనెలాఖరుకల్లా ఆర్‌బీఐ డివిడెండ్‌ను ప్రకటించనుంది.

వృద్ధి మందగమనం నేపథ్యంలో ఈ ఏడాది పన్ను వసూళ్లు బడ్జెట్ లక్ష్యం కంటే తగ్గడంతో పాటు మార్కెట్ ఒడుదుడుకుల కారణంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా కేంద్రం అనుకున్న మేరకు నిధులు సమీకరించలేకపోవచ్చు. ఆ ఆదాయ లోటును ఆర్‌బీఐ డివిడెండ్ భర్తీ చేయనుంది. ఈసారి స్థూల పన్ను వసూళ్లు బడ్జెట్ అంచనా కంటే రూ.లక్ష కోట్లు, డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయం రూ.40,000 కోట్ల మేర తగ్గవచ్చని కోటక్ బ్యాంక్ ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్రవ్య లోటును లక్ష్యం మేరకు (జీడీపీలో 4.4 శాతానికి) కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ బంపర్ చెల్లింపులు తోడ్పడనున్నాయని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కు చెందిన గౌర సేన్ గుప్తా పేర్కొన్నారు.

రూ.5 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ 412 పాయింట్లు పతనం

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిన నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 411.97 పాయింట్లు కోల్పోయి 80,334.81 వద్దకు జారుకుంది. ఆరంభంలో స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం వరకు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణకు దిగటంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ చివర్లో సెన్సెక్స్ 759 పాయింట్లు పతనమై 80,000 దిగువకు పడిపోయినప్పటికీ.. వెంటనే తేరుకుంది. నిఫ్టీ విషయానికొస్తే, ఇంట్రాడేలో 264.2 పాయింట్ల వరకు క్షీణించిన సూచీ.. చివరికి 140.60 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.418.50 లక్షల కోట్లకు (4.93 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 నష్టపోయాయి.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 81 పైసల నష్టంతో రూ.85.58 వద్ద ముగిసింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. రూపాయికి రెండున్నర ఏళ్లకు పైగా కాలంలో ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	134
వరంగల్	135	గుంటూరు	132
కరీంనగర్	135	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	107
కర్నూలు	135	నెల్లూరు	112
విశాఖపట్నం	131	అనంతపురం	112
గోదావరి	134		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,600 ▲	91,300 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	98,000 ▼
విశాఖపట్నం	1,00,340 ▼	91,300 ▲	1,11,000 ▲
రాజమండ్రి	99,020 ▲	89,850 ▼	99,300 ▼
ప్రొద్దుటూరు	97,500 ▼	89,700 ▼	97,400 ▼
ముంబై	97,030 ▼	88,880 ▼	95,225 ▼

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 9 మే 2025



బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

కెనరా బ్యాంక్ లాభం రూ. 5,070 కోట్లు

క్యూ4లో 28 శాతం వృద్ధి

రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.4 డివిడెండ్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,070.19 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.3,951.76 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.37,429.90 కోట్ల నుంచి రూ.40,256.19 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో ప్రొవిజనింగ్స్ తగ్గటం, కీలకేతర ఆదాయాలు పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 33 శాతం వృద్ధితో రూ.3,757.23 కోట్ల నుంచి రూ.5,002.66 కోట్లకు పెరిగింది. స్టాండ్‌ఎలోన్ ఆదాయం కూడా రూ.34,025.18 కోట్ల నుంచి రూ.37,352.80 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలంలో బ్యాంక్ రుణ వృద్ధి రేటు 11 శాతం పెరిగినప్పటికీ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 1.44 శాతం తగ్గుదలతో రూ.9,442 కోట్లుగా నమోదైందని కెనరా బ్యాంక్ పేర్కొంది. దీంతో నికర వడ్డీ మార్జిన్ 0.25 శాతం తగ్గి 2.80 శాతానికి చేరుకుందని తెలిపింది. మరోవైపు మార్చి త్రైమాసికంలో వడ్డీయేతర ఆదాయం 21.74 శాతం వృద్ధితో రూ.6,351 కోట్లుగా నమోదైంది. రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి రికవరీలు 30 శాతం పెరుగుదలతో రూ.2,471 కోట్లకు చేరుకోవటం ఇందుకు కారణమని బ్యాంక్ పేర్కొంది. ఇదే సమయంలో ట్రెజరీ ఆదాయం కూడా 15 శాతం వృద్ధితో రూ.995 కోట్లకు చేరుకున్నాయి. మరోవైపు మొండి బకాయిల (ఎన్‌పీఏ) కోసం చేసిన కేటాయింపులు కూడా రూ.2,483 కోట్ల నుంచి రూ.1,831 కోట్లకు తగ్గినట్లు తెలిపింది. మార్చి త్రైమాసికంలో బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు 4.23 శాతం నుంచి 2.94 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 1.27 శాతం నుంచి 0.70 శాతానికి తగ్గాయి. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.17,539.62 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.15,278.57 కోట్లుగా ఉంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 200 శాతం (రూ.4) డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ఈ ఏడాది రుణ వృద్ధి లక్ష్యం 11 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 10-11 శాతం రుణ వృద్ధి రేటును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఇదే సమయంలో డిపాజిట్ వృద్ధి రేటును కూడా 9 శాతానికి పైగా, ఎన్ఐఎం 2.75-2.8 శాతం మధ్యన కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్యాంక్ క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) 16.39 శాతంగా ఉందని ఆయన చెప్పారు.

రూ.25 లక్షల కోట్లకు గ్లోబల్ వ్యాపారం

మార్చి ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 11.32 శాతం వృద్ధితో రూ.25,30,215 కోట్లకు చేరుకుంది. గ్లోబల్ డిపాజిట్లు రూ.14,56,883 కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ డిపాజిట్లు 9.56 శాతం పెరిగి రూ.13,31,137 కోట్లుగా ఉన్నాయి. బ్యాంక్ రిటైల్ రుణ పోర్టుఫోలియో 42.80 శాతం వృద్ధితో రూ.2,23,366 కోట్లకు, గృహ రుణ విభాగం 13.57 శాతం వృద్ధి చెంది రూ.1,06,167 కోట్లకు చేరుకున్నట్లు కెనరా బ్యాంక్ తెలిపింది.

బ్యాంకులు పారాహుషార్

సైబర్ సెక్యూరిటీ కట్టుదిట్టం

న్యూఢిల్లీ: భారత-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యాంకులు కూడా అప్రమత్తమయ్యాయి. తమ వెబ్‌సైట్లు, సర్వర్ల మీద పాక్ సైబర్ కేటుగాళ్ల (హ్యాకర్లు) దాడి చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయి. వీటికి తోడు పాక్ సరిహద్దులకు సమీపంలో ఉన్న శాఖల్లో భద్రతను మరింత పటిష్ఠం చేశాయి. అలాగే ఆ ప్రాంతాల్లోని ఏటీఎంలను నగదుతో నింపేశాయి. 'మా సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేశాం. ఎలాంటి సైబర్ దాడి జరిగినా వెంటనే స్పందించేందుకు 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేశాం. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర చెప్పారు.

ఎక్స్ఛేంజీలూ అప్రమత్తం: స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ కూడా తమ సైబర్ భద్రతా చర్యలను ముమ్మరం చేశాయి. విదేశాల నుంచి ఎవరూ తమ వెబ్‌సైట్లను ఓపెన్ చేయకుండా చర్యలు చేపట్టాయి. బీఎస్ఈ అయితే మార్కెట్ పార్టిసిపెంట్స్ అందరూ తమ వ్యవస్థను ఎవరూ హ్యాక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

కియా నుంచి కారెన్స్ క్లావిస్



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా.. తన పాపులర్ కారు కారెన్స్‌లో ప్రీమియం వెర్షన్ 'కారెన్స్ క్లావిస్'ను గురువారం ఆవిష్కరించింది. భారత్ నుంచే అంతర్జాతీయ మార్కెట్లోకి ఈ కారును విడుదల చేసినట్లు కియా ఇండియా హెడ్ హర్దీప్ సింగ్ బ్రార్ వెల్లడించారు. దేశీయ మార్కెట్లో ఎంపీవీ, ఎస్‌యూవీ 7 సీట్ల విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త మోడల్‌ను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రీమియం ఫీచర్లు, మూడు వరుసల్లో సీటింగ్ సహా మరికొన్ని ప్రత్యేకమైన ఫీచర్లతో కారెన్స్ క్లావిస్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్స్‌తో పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో ఈ కారు అందుబాటులో ఉండనుంది. ఈ కారు బుకింగ్స్‌ను కియా ఇప్పటికే ప్రారంభించగా ధరను మాత్రం నెలాఖరులో ప్రకటించనుంది. కారెన్స్ విడుదల చేసిన మూడేళ్లలోనే 2 లక్షల యూనిట్లను విక్రయించినట్లు కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగు లీ తెలిపారు.

వెల్స్ ఫార్గో చెన్నై జీసీసీ మూసివేత

చెన్నై: అమెరికా ఆర్థిక సేవల కంపెనీ వెల్స్ ఫార్గో చెన్నైలోని తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను మూసివేయనుంది. భారత కార్యకలాపాల దశల వారీ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ కేంద్రాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) చివరి త్రైమాసికానికల్లా పూర్తిగా మూసివేయాలని కంపెనీ నిర్ణయించింది. అందులో పనిచేస్తున్న సిబ్బందిని బెంగళూరు లేదా హైదరాబాద్‌లోని తన కార్యాలయాలకు బదిలీ కావాలని కోరింది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని వెల్స్ ఫార్గో కార్యాలయాల్లో దాదాపు 10,000 మంది పనిచేస్తున్నారు. అందులో ఎంత మంది చెన్నై కార్యాలయంలో పనిచేస్తున్నారన్న విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు.

'ఏఎం గ్రీన్'కు కోల్ ఇండియా క్లీన్ పవర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద సీఐఎల్, ఏఎం గ్రీన్ అమ్మోనియా ఏర్పాటు చేసే అమ్మోనియా ప్లాంట్లకు దశల వారీగా 4,500 మెగావాట్ల పవన, సౌర విద్యుత్ సరఫరా చేస్తుంది. ఇందులో 2,500 నుంచి 3,000 మెగావాట్ల సౌర విద్యుత్, 1,500 నుంచి 2,000 మెగావాట్ల పవన విద్యుత్ ఉంటుంది. సౌర విద్యుత్ ప్లాంట్లను గుజరాత్, రాజస్థాన్‌ల్లో, పవన విద్యుత్ ప్లాంట్లను దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నట్టు సీఐఎల్ తెలిపింది.

ఎల్ అండ్ టీ లాభంలో 25% వృద్ధి

న్యూఢిల్లీ: ఎల్ అండ్ టీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.5,497 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.4,396 కోట్లతో పోల్చితే ఇది 25 శాతం అధికం. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.67,078.68 కోట్ల నుంచి రూ.74,392.28 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.34 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

నేటి మ్యాచ్ — వేదిక లఖ్‌నవూ — లఖ్‌నవూ x బెంగళూరు — రా.7.30 నుంచి



ఐపీఎల్‌పై నీలినీడలు

అర్ధంతరంగా నిలిచె..

ఉద్రిక్తతల నేపథ్యంలో పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ రద్దు

10.1 ఓవర్లపాటు సాగిన ఆట



భద్రతా సిబ్బంది సూచనతో స్టేడియంను వీడుతున్న ప్రేక్షకులు

ధర్మశాల: ఐపీఎల్ చరిత్రలోనే ఎన్నడూ చూడని అరుదైన ఘటన ఇది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మ్యాచ్ భద్రతా కారణాల రీత్యా మధ్యలోనే ఆగింది. గురువారం రాత్రి జమ్మూ, పఠాన్‌కోట్‌లపై పాక్ దాడులకు తెగబడింది. దీంతో ముందు జాగ్రత్తగా ధర్మశాలలో బ్లాక్ అవుట్ ప్రకటించగా, ఇక్కడే జరుగుతున్న మ్యాచ్‌ను కూడా అర్ధంతరంగా రద్దు చేశారు. వాస్తవానికి పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్లపాటు సజావుగానే సాగింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్టేడియంలోని ఓ ఫ్లడ్ లైట్ ఆఫ్ అయ్యింది. మొదట ఏదైనా సమస్య వచ్చిందేమోనని అంతా భావించారు. కానీ కాసేపటికే మరో రెండు ఫ్లడ్‌లైట్లను ఆపేయడంతో స్టేడియంలో చీకటి నెలకొంది. అప్పటికే ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా మైదానం వీడారు. అలాగే స్టేడియంలోని ప్రేక్షకులను కూడా బయటికి వెళ్లాల్సిందిగా అధికారులు కోరారు. ఈ క్రమంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా స్థానిక పోలీసులు, ఆర్మీ సిబ్బంది పర్యవేక్షించారు. మరోవైపు పటిష్ఠ భద్రత మధ్య ఇరు జట్ల ఆటగాళ్లను స్టేడియం నుంచి హోటళ్లకు తరలించారు.

ఈ మ్యాచ్ ఆగే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో 122/1 స్కోరుతో ఉంది. ప్రియాన్ష్ ఆర్య (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 70), ప్రభ్‌సిమ్రన్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 50 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు.

ఓపెనర్ల జోరు: వర్షం కారణంగా ఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. అయితే టాస్ గెలిచిన పంజాబ్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ శ్రేయాస్ నిర్ణయాన్ని ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య వమ్ము చేయలేదు. డీసీ బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ పరుగుల వరద పారించారు. ఆర్య ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచగా.. అటు ప్రభ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. ఇక చమీర ఓవర్‌లో ఆర్య మరింతగా చెలరేగడంతో 6,4,4తో 18 రన్స్ సమకూరాయి. అయితే ఆరో ఓవర్‌లో పేసర్ నటరాజన్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చినా అప్పటికే పవర్‌ప్లేలో 69 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. ఆ తర్వాత ఆర్య ఓ సిక్సర్‌తో 25 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. కుల్దీప్‌ను కూడా వదలకుండా తను పదో ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదగా.. ప్రభ్ ఓ ఫోర్‌తో వరుసగా నాలుగో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పదో ఓవర్‌లోనే స్కోరు 122కి చేరిన వేళ.. పేసర్ నటరాజన్ ఈ ప్రమాదకర జోడీని విడదీశాడు. 11వ ఓవర్‌తో తొలి బంతికే ఆర్యను అవుట్ చేశాడు. ఆ వెంటనే శ్రేయాస్ క్రీజులోకి రావడం.. ఫ్లడ్‌లైట్లను ఆపివేయడం జరిగింది. కాసేపటికే అంపైర్లు, ఆటగాళ్లు మైదానం వీడారు.

సాంకేతిక కారణమన్న బీసీసీఐ

బీసీసీఐ మాత్రం స్టేడియం ఉన్న ప్రాంతంలో విద్యుత్ సమస్య కారణంగా ఓ ఫ్లడ్‌లైట్‌లో లోపం తలెత్తిందని, అందుకే మ్యాచ్‌ను రద్దు చేశామని ప్రకటించింది.



ప్రియాన్ష్ (70)

ప్రభ్‌సిమ్రన్ (50 నాటౌట్)

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) తివారి (బి) నటరాజన్ 70, ప్రభ్‌సిమ్రన్ (నాటౌట్) 50, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 10.1 ఓవర్లలో 122/1; వికెట్ పతనం:** 1-122; **బౌలింగ్:** స్టార్క్ 2-0-23-0, చమీర 2-0-27-0, అక్షర్ 2-0-25-0, నటరాజన్ 1.1-0-4-1, కుల్దీప్ 2-0-29-0, మాధవ్ తివారి 1-0-14-0.

లీగ్ కొనసాగేనా?

పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఐపీఎల్ కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. గురువారం ధర్మశాలలో మ్యాచ్ ఇన్నింగ్స్ మధ్యలోనే ఆగిపోవడం పరిస్థితి తీవ్రతను చాటిచెబుతోంది. అలాగే లీగ్‌లో విదేశీ ఆటగాళ్లు కూడా ఎక్కువగానే ఉన్నారు. వారి భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే వారు తమ ఆందోళనను బీసీసీఐకి తెలియజేశారు. ఇదే విషయమై బోర్డు అత్యవసరంగా సమావేశమైంది. సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ.. మ్యాచ్‌ల కోసం ఆటగాళ్లంతా వివిధ ప్రాంతాలకు ప్రయాణించడం ఏమేరకు క్షేమకరమనేది బోర్డు ఆలోచిస్తోంది. కొన్ని నగరాల్లో విమానాశ్రయాలు మూసివేయడంతో సదరు జట్ల ఆటగాళ్లను మ్యాచ్‌ల వేదికలకు తరలించడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించడం సబబేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. మరి.. బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

ధర్మశాల నుంచి అహ్మదాబాద్‌కు

పంజాబ్, ముంబై మ్యాచ్ వేదిక తరలింపు

ప్రత్యేక రైలులో ఆటగాళ్లను ఢిల్లీ చేరుస్తాం: బీసీసీఐ

పంజాబ్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య వచ్చే ఆదివారం జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ వేదిక మారింది. ధర్మశాలలో నిర్వహించాల్సిన ఆ మ్యాచ్‌ను అహ్మదాబాద్ తరలించినట్టు గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్ గురువారం వెల్లడించాడు. పాకిస్థాన్‌పై భారత సైన్యం దాడుల నేపథ్యంలో ధర్మశాల విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. దాంతో మ్యాచ్‌ను అక్కడనుంచి తరలిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. అహ్మదాబాద్‌లో ఆ మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం జరగనుంది. ఇక..ధర్మశాల విమానాశ్రయాన్ని మూసివేయడంతో పంజాబ్, ఢిల్లీ జట్లు అక్కడ నుంచి.. ఢిల్లీకి ఎలా చేరుకుంటాయన్నది ఉత్కంఠగా మారింది. అయితే, ధర్మశాల నుంచి 85 కిలోమీటర్ల దూరంలోనున్న పఠాన్‌కోట్‌కు శుక్రవారం రోడ్డు మార్గం ద్వారా జట్ల ఆటగాళ్లు, సహాయ సిబ్బంది చేరుకుంటారని బీసీసీఐ వెల్లడించింది. పఠాన్‌కోట్ నుంచి వీళ్లందరినీ ప్రత్యేక రైలులో ఢిల్లీకి తరలిస్తామని తెలిపింది. ఆదివారం ఢిల్లీ వేదికగా గుజరాత్, ఢిల్లీ జట్లు తలపడనున్నాయి.

స్పోర్ట్స్

అలా సమాచారం.. ఇలా నిర్ణయం!



బీసీసీఐకి రోహిత్ షాక్

న్యూఢిల్లీ: నెల రోజుల్లో భారత జట్టు సుదీర్ఘమైన ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌కు ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌లు ఆడడం ద్వారా శ్రీకారం చుట్టనుంది. ఈ సిరీస్‌కు తానే సారథ్యం వహించాలన్న ఆకాంక్షను రోహిత్ శర్మ పలు సందర్భాలలో వ్యక్తంజేశాడు. కానీ బుధవారంనాడు అనూహ్యంగా రోహిత్.. టెస్ట్‌ల నుంచి రిటైరవుతున్నట్టు ప్రకటించి అటు బీసీసీఐకి ఇటు తన అభిమానులకి షాకిచ్చాడు. అయితే, రోహిత్ అనూహ్య నిర్ణయం వెనక పెద్ద తతంగమే నడిచినట్టు జాతీయ మీడియా కథనం. ఆ కథనాల ప్రకారం.. వచ్చేవారం జాతీయ సెలెక్షన్ కమిటీ ఇంగ్లండ్ టూర్‌కు జట్టును ఎంపిక చేయనుంది. అయితే, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కొత్త కెప్టెన్ నేతృత్వంలోనే ఇంగ్లండ్‌తో తలపడాలని పట్టుదలగా ఉన్నాడు. ఈ సమాచారం ఎలాగోలా రోహిత్ చెవిన పడింది. అంతే.. అప్పటికప్పుడే టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పాలనుకున్న రోహిత్ ఈ విషయాన్ని బీసీసీఐకి ఈ-మెయిల్ ద్వారా చేరవేశాడు. దీంతో ఇంత అనూహ్యంగా నిర్ణయం ఎందుకు తీసుకున్నాడంటూ బోర్డు పెద్దలు కూడా షాక్ తిన్నారు. బోర్డుకు ఈమెయిల్ చేసిన కొద్దిసేపటికే సోషల్‌మీడియా ద్వారా తన వీడ్కోలు నిర్ణయాన్ని రోహిత్ వెల్లడించాడు. కాగా..అదే సమయంలో ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఉన్న అజిత్ అగర్కార్ చాలాసేపు సెల్‌ఫోన్లో మాట్లాడుతూ కనిపించాడు. అతడు అంత సుదీర్ఘ సమయం ఫోన్లో సంభాషించింది రోహిత్‌తోనేనట. ఇక..రోహిత్ నిర్ణయాన్ని స్వాగతించిన పలువురు మాజీ క్రికెటర్లు, ఐసీసీ..టెస్ట్‌ల్లో అతడు అందించిన సేవలను కొనియాడారు.

వ్యక్తిగతంగా విమర్శలా?

భారత వ్యాఖ్యాతలపై హిట్‌మ్యాన్ గరం

న్యూఢిల్లీ: భారత క్రికెట్ వ్యాఖ్యాతలపై కెప్టెన్ రోహిత్ శర్మ ఫైర్ అయ్యాడు. ఓ ఆటగాడిని లక్ష్యంగా చేసుకొని ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డాడు. ఆటను వదిలి మసాలా వేయడానికి ఎక్కువగా పాకులాడుతున్నారని చురకంటించాడు. మనోళ్ల వ్యాఖ్యానంతో పోలిస్తే ఆస్ట్రేలియా వ్యాఖ్యాతలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారన్నాడు. 'కామెంటేటర్ల వ్యాఖ్యలు వింటే బాధేస్తుంది. పేలవ ఫామ్ గురించి విమర్శలు చేయడంలో తప్పులేకపోయినా.. దానికీ ఓ హద్దు ఉందనే స్పృహ కామెంటేటర్లలో ఉండాలి. ఏదో మనసులో పెట్టుకొని అదే పనిగా విమర్శలు చేయడం తగదు. కొందరైతే ఆట గురించి విశ్లేషించకుండా, ఆటగాడి వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతుంటారు. భారత్‌లో వ్యాఖ్యాతలు ఏదో ఒక అజెండాతోనే వ్యాఖ్యానం చేస్తున్నట్టు అనిపిస్తుంది. ఇది సరికాదు' అని హితవు పలికాడు.

శ్రీకాంత్‌కు ఆయుష్ షాక్





తైపీ: భారత యువ షట్లర్లు ఆయుష్ షెట్టి, ఉన్నతి హుడా తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో జోరు కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో వారు సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. గురువారం హోరాహోరీగా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 20 ఏళ్ల ఆయుష్ 21-16, 15-21, 21-17తో సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. తొలి రౌండ్‌లో.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ రన్నరప్ లీ చియాను కంగుతినిపించిన ఆయుష్..క్వార్టర్స్‌లో ఏడో సీడ్ బ్రియాన్ యంగ్ (కెనడా)తో అమీతుమీ తేల్చుకుంటాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఉన్నతి 21-12, 21-17తో స్థానిక క్రీడాకారిణి లిన్ యున్‌పై నెగ్గింది.

పాక్ లీగ్‌కు 'సిందూర్' ఎఫెక్ట్!

టోర్నీని వీడే యోచనలో విదేశీ క్రికెటర్లు

కరాచీ: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పైనా పడింది. ఈ కారణంగా పలు మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేయాలని పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయించింది. రావల్పిండి క్రికెట్ కాంప్లెక్స్‌పై భారత్ డ్రోన్లతో దాడి చేసినట్టు ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే గురువారం రాత్రే ఇక్కడ కరాచీ కింగ్స్-పెషావర్ జల్మీ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సిన మ్యాచ్‌ను వాయిదా వేశారు. ఇక.. రావల్పిండిలో గురువారం నుంచి శనివారం వరకు జరిగే మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేయాలని పీసీబీ నిర్ణయించింది. అయితే ఇదే వేదికపై నిర్వహిస్తారా? లేక తరలిస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు. అలాగే భారత సైన్యం ప్రతీకార దాడులతో పీఎస్ఎల్‌లో ఆడుతున్న విదేశీ ఆటగాళ్లలో ఆందోళన నెలకొంది. వెంటనే లీగ్‌ను వీడి తమ స్వదేశాలకు వెళ్లే యోచనలో క్రికెటర్లున్నట్టు సమాచారం.

ఫామ్‌హౌస్‌లో పడుకొని ప్రేలాపనలా?

పదేళ్ల పాలనలో ఉద్యోగులకు బీఆర్ఎస్ ఏం చేసింది?.. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికే కమిటీ వేశాం

- ఏడాదిలో ఆరోగ్యశాఖకు రూ.11,487 కోట్లు వెచ్చించాం: భట్టి
- రూ.450కోట్లతో 90 ట్రామా సెంటర్లు: దామోదర
- పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తాం: తుమ్మల
- ఖమ్మానికి మణిహారంలా ప్రభుత్వ కళాశాల: పొంగులేటి
- ఖమ్మంలో నూతన వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన



ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, మే 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని, ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలు పరిష్కారానికే అధికారులతో కమిటీ వేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో వైద్య, ఆరోగ్యశాఖకు 5,959 కోట్ల కేటాయింపులు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యం కోసం ఏడాదిలోనే రూ.11,487కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం బాలప్పేట సమీపంలో రూ.130 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలకు గురువారం మంత్రులు భట్టి, దామోదర, తమ్మల, పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పదేళ్ల పాలనలో ఉద్యోగుల కోసం బీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలన్నారు. ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారు ఇప్పుడు ప్రేలాపనలు చేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో పాలన గాలికొదిలేసి రూ.7లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి.. ఏనాడూ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వలేదన్నారు. ఆరోగ్యశ్రీకి గత పాలకులు ఏడాదికి రూ.54.12కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే రూ.306కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఎనిమిది మెడికల్ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రూ.450కోట్లతో 90 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. బ్లాక్ స్పాట్ పద్ధతిలో 35 కి.మీ ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. ఖమ్మానికి మణిహారంలా ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటవుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.130కోట్లతో నిర్మిస్తున్న ఈ కళాశాలతో పేదలకు మరింత మెరుగైన వైద్యం అందనుందని చెప్పారు.

ఇబ్బందులున్నా శాశ్వత భవనాలు: తుమ్మల

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించే లక్ష్యంతో పనిచేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా, వైద్యరంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మెడికల్, నర్సింగ్ కళాశాలలకు నిధులు ఇచ్చి శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నందున ఇక్కడ నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. కాగా ఖమ్మం జిల్లా ఆస్పత్రిని గురువారం మంత్రుల బృందం సందర్శించింది. ఆస్పత్రిలో అన్ని వార్డులను మంత్రులు తిలకించారు. అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

18న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకానికి శ్రీకారం

- మన్ననూరులో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఐదేళ్లలో 6 లక్షల ఎకరాలకు సాగు నీరు, సౌర విద్యుత్తు
- 12,600 కోట్లతో పథకం రూపకల్పన: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల పోడు భూములకు సాగు నీటి వసతిని కల్పించడంతో పాటు సౌర విద్యుత్తును అందించడానికి రూపొందించిన 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని ఈ నెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకంపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. గిరిజనులకు అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) ద్వారా కేటాయించిన భూములను సాగులోకి తెచ్చేందుకు, గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.12,600 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామని భట్టి చెప్పారు. సీఎంతో పాటు మంత్రులందరూ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. రానున్న ఐదేళ్లలో 2.10 లక్షల మంది పోడు రైతులకు సంబంధించిన 6 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాలన్నది పథకం లక్ష్యమని వెల్లడించారు.

ఆనాడు దత్తన్న బిడ్డను నర్సరీలో చేర్పించింది రేవంతే!

అప్పట్లో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొన్న ఎన్టీఆర్

- ఆసక్తికర ఘట్టాలతో బండారు దత్తాత్రేయ ఆత్మకథ
- నేడు ఆవిష్కరించనున్న ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): బీజేపీలో అత్యంత సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన ప్రస్తుత హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మిని నాడు నర్సరీ స్కూల్‌లో చేర్పించింది ఎవరో తెలుసా? అది 30 ఏళ్ల క్రితం దత్తాత్రేయ ఎంపీగా ఉన్నప్పుడు బీజేపీలో యువ నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఈ విషయాన్ని దత్తాత్రేయ తన ఆత్మకథలో వెల్లడించారు. ఆయన రచించిన 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ' పుస్తకాన్ని శుక్రవారం ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆవిష్కరించనున్నారు. 1947 జూన్ 12న జన్మించిన దత్తాత్రేయ తన జీవితంలోని అత్యంత కీలక ఘట్టాలను ఈ పుస్తకంలో ఆసక్తికరంగా వివరించారు. గౌలిగూడలోని మహారాజ్‌గంజ్‌లోని గుడంబ బస్తీగా పేరు పొందిన ప్రాంతంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన దత్తాత్రేయ తండ్రితో పాటు ఉస్మాన్‌గంజ్‌లో ఉల్లిపాయలు అమ్మేందుకు వెళ్లేవారన్న విషయం చాలామందికి తెలియదు. అదే బస్తీలో అనేకమంది పేదలతో పాటు ప్రభుత్వ మరుగుదొడ్డిలో కాలకృత్యాలు తీర్చేకునేవారు. ఐదో ఏటే తండ్రిని కోల్పోయిన దత్తాత్రేయ జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును వీడకుండా గ్రాడ్యుయేషన్ వరకు చదివారు. దత్తాత్రేయ పదో తరగతి చదువుతున్నప్పుడు 1963లో మనోహర్ షిండే అన్న ప్రచారక్ ఆర్ఎస్ఎస్‌లో చేర్పించారు. దాంతో దత్తాత్రేయ జీవితమే మారిపోయింది. 1968లో తానే ప్రచారక్‌గా బాధ్యతలు నిర్వర్తించిన దత్తాత్రేయ... 1980లో బీజేపీ ఏర్పడిన తర్వాత ఏపీలో పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కావడంతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. గోల్వాల్కర్, దేవరసు, రాజేందర్ సింగ్, సుదర్శన్ నుంచి మోహన్‌భగవత్ వరకు మొత్తం ఆర్ఎస్ఎస్ అధినేతలందరూ దత్తాత్రేయను అభిమానించారు. 1977లో దివిసీమ ఉప్పెనలో సంఘ్ తరఫున దత్తాత్రేయ నిర్వర్తించిన సేవా కార్యక్రమాలు ఆయనకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయి. తన జీవితంలో సగభాగం సంఘ్‌కే కేటాయించిన దత్తాత్రేయ 42వ ఏట 1989లో వివాహం చేసుకున్నారు. స్వాతంత్ర్య అనంతర దేశ రాజకీయ చరిత్రలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అనేక ఘట్టాలను దత్తాత్రేయ తన ఆత్మకథలో వివరించారు. ఎన్టీఆర్‌పై జరిగిన తిరుగుబాటును ఆసక్తికరంగా వివరించిన దత్తాత్రేయ 1946-47 ప్రాంతంలో ఎన్టీఆర్ స్వయంగా ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొన్న విషయాన్ని వెల్లడించారు. ఈ విషయం ఎన్టీఆర్ తనకు స్వయంగా చెప్పారని, స్వామి వివేకానంద తనకు స్ఫూర్తి అని వెల్లడించారని దత్తన్న తన ఆత్మకథలో వెల్లడించారు. బీజేపీలో ఉన్నా అన్ని రాజకీయ పార్టీల నేతల అభిమానాన్ని చూరగొన్న దత్తన్న... నక్సలైట్ నాయకుడైన మధుసూదన్‌రాజ్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించినప్పుడు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

మూడు ముక్కలాటకు ఇక స్వస్తి!

- ఏపీకి అమరావతే ఏకైక శాశ్వత రాజధాని!!
- తీర్మానానికి ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధాని మారుస్తామనకుండా.. ఆ పేరుతో మూడు ముక్కలాట ఆడకుండా అడ్డుకట్ట వేయాలని చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అమరావతినే ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక, శాశ్వత రాజధానిగా పేర్కొంటూ రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించాల్సిందిగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ఏపీ కేబినెట్ తీర్మానం ఆమోదించింది. కేంద్రం ఈ దిశగా చర్యలు తీసుకుంటే.. అమరావతి రాష్ట్రానికి చట్టబద్ధమైన రాజధానిగా ఆవిర్భవిస్తుంది. విభజన చట్టం-2014లోని సెక్షన్-5, సబ్‌సెక్షన్-2లో.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు హైదరాబాద్ పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంటుందని.. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతి అని పేర్కొంటూ సదరు సెక్షన్‌ను సవరిస్తే అమరావతి చట్టబద్ధమవుతుంది. రాజధాని మార్పు నాటకాలకు దాంతో తెరపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై ఇప్పుడు కేబినెట్‌లో చర్చించి తీర్మానం ఆమోదించారు. అలాగే అమరావతికి వచ్చి రాజధాని పున్నర్నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రధాని మోదీకి మంత్రిమండలి ధన్యవాదాలు తెలిపినట్లు సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు తెలిపారు. 'గత ఐదేళ్లలో ఏపీ రాజధాని ఏదీ అనడిగితే చెప్పలేని దౌర్భాగ్య పరిస్థితి ఉన్న విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర ప్రజలందరూ కూడా మీ రాజధాని ఏదని ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రజలు అడిగితే చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిని చూశాం. వాళ్ల ఇష్టం వచ్చినట్లు మూడు రాజధానులు, రకరకాల పేర్లు పెట్టి ఏ రాజధానినీ నిజం చేయలేదు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంతో.. ఈ రాష్ట్రానికి గర్వించదగిన రాజధానిని నిర్మించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా పేర్కొంటూ కేంద్రం సదరు చట్టంలో సవరణ చేయాలనే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మూడో దశ టెలిమెట్రీకి ఒప్పుకోం!

- కృష్ణా బోర్డుకి తేల్చిచెప్పిన ఏపీ ప్రభుత్వం

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల తరలింపుపై లెక్కలు తీయడానికి వీలుగా అదనపు టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రతిపాదనలను అంగీకరించబోమని ఏపీ తేల్చి చెప్పింది. ఈ మేరకు ఏపీ నీటిపారుదల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గత మార్చి 10వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి లేఖ రాశారు. దీనిపై అభిప్రాయం తెలుపాలంటూ ఈ నెల 6న కృష్ణా బోర్డు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో, ఏపీ లేఖలోని వివరాలు వెల్లడయ్యాయి. కృష్ణా జలాల తరలింపునకు సంబంధించి ఏపీ పరిధిలోని 11 కాంపోనెంట్లపై.. మూడో విడత కింద అదనపు టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేఆర్ఎంబీని తెలంగాణ గతంలో కోరింది. దీనిపైనే ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఖనిజ బ్లాకుల లీజు టెండర్ల దాఖలు

- గడువు 14 వరకు పొడిగింపు

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చిన్న తరహా ఖనిజ బ్లాకులు, క్వారీల లీజుల మంజూరుకు గనులు, భూగర్భ వనరుల శాఖ ఆహ్వానించిన టెండర్ల దాఖలు గడువును పొడిగించారు. ప్రీ బిడ్ సమావేశంలో పాల్గొన్న సంస్థల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు టెండరు డాక్యుమెంట్ల కొనుగోలుకు ఈ నెల 9 వరకు, బిడ్ల దాఖలుకు ఈ నెల 14 వరకు గడువును పొడిగించినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. దీనికి అనుగుణంగా వేలంపాట తేదీ మార్పు ఉంటుందని, పూర్తివివరాల కోసం మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొంది. రఫ్‌స్టోన్, రోడ్డు మెటల్, లేటరైట్, స్టోన్‌మెటల్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ వంటి 25 క్వారీలను లీజుకివ్వాలని భూగర్భ వనరుల శాఖ నిర్ణయించింది. ఒక్కో క్వారీ టెండరు దస్తావేజు ధరను రూ.లక్షగా ప్రకటించింది.

కాంగ్రెస్ కమిటీల నిర్మాణ ప్రక్రియకు విరామం

- 12 నుంచి పునఃప్రారంభం

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ, బ్లాక్, మండల కమిటీల నిర్మాణ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాల నేపథ్యంలో ఈ నెల 11 వరకు ఈ ప్రక్రియకు విరామం ఇవ్వాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ పరిశీలకులను ఆదేశించారు. క్షేత్రస్థాయి కమిటీల నిర్మాణ ప్రక్రియతో పాటు జై బాపూ, జై భీం సంవిధాన్ సమావేశాలను, ఇతర కార్యక్రమాలనూ వాయిదా వేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రక్షాళన ప్రయత్నాలు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తిపాస్తుల వివరాలను వెల్లడించి మంచిపనిచేశారు. ఏప్రిల్ 1న జరిగిన ఫుల్‌కోర్టు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, ముప్పైమూడు మంది న్యాయమూర్తుల్లో అత్యధికులు నెలరోజుల్లోనే ఆ వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందించారు. వాటిని సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో ఉంచి పారదర్శకతకు అగ్రప్రాధాన్యం ఇచ్చింది. ఒకరిద్దరివి తప్ప మిగతావారి వివరాలు అంత ఆకర్షించే రీతిలో ఏమీ లేవు. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు ఇలా ప్రజాక్షేత్రంలో ఉంచడంతో పాటు, గత రెండున్నరేళ్ళుగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన విస్తృత సమాచారాన్ని కూడా సర్వోన్నత న్యాయస్థానం బహిర్గతపరచింది. కొలీజియం విధానంలో అస్మదీయులకు అగ్రతాంబూలం ఇస్తున్నారని, న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారితో పోస్టులు నింపేసుకుంటున్నారని ఇటీవల కొందరు నాయకులు దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు నిజానిజాలు తెలియచేసే ప్రయత్నం ఇది.


పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా న్యాయవ్యవస్థపై విశ్వాసం పెంచాలన్నది జడ్జీల ఆశయం. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవల భారీమొత్తంలో నగదు లభ్యమై, న్యాయవ్యవస్థ విశ్వసనీయతమీద అనుమానాలు రేగిన నేపథ్యంలో ఈ స్వచ్ఛంద ఆస్తుల ప్రకటన జరిగింది. న్యాయమూర్తుల నియామకాలను కొలీజియం గుప్పిట్లోనుంచి తప్పించి, ఎన్‌జేఏసీ అధీనంలోకి తీసుకురావాలని మోదీ ప్రభుత్వం తన తొలివిడత పాలన తొలి ఏడాదిలోనే చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు అడ్డంకొట్టి పాలకపెద్దల ఆగ్రహానికి గురైంది. న్యాయవ్యవస్థ ఆత్మరక్షణలోకి జారిన ప్రతీ సందర్భంలోనూ బీజేపీ నాయకులంతా ఎన్‌జేఏసీని గుర్తుచేస్తూనే ఉన్నారు. జస్టిస్ వర్మ ఉదంతం వెలుగులోకి రాగానే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఏ విధంగా స్పందించారో చూశాం. మొన్నటికి మొన్న బిల్లుల ఆమోదం విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్రపతికి కాలపరిమితి విధించినందుకు ధన్‌ఖడ్, నిశికాంత్ దూబే వంటివారు అంతర్యుద్ధాలు, బ్రహ్మాస్త్రాలు ఇత్యాది పదజాలంతో అమితాగ్రహంతో ఊగిపోయారు. ఇటువంటి సంక్షోభాలను, సవాళ్ళను ఎదుర్కొంటూ, రాజ్యాంగాశయానికి అనుగుణంగా బలంగా నిలబడేందుకు సుప్రీంకోర్టు చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమైనది.

సచ్ఛీలత, రుజువర్తన, ఉన్నత విలువలే న్యాయవ్యవస్థకు బలం. ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో మిగతావాటి మాదిరిగా న్యాయవ్యవస్థ నియంత్రణలో ప్రత్యేక బలగాలు, యంత్రాంగాలు లేవు. అయినప్పటికీ, న్యాయవ్యవస్థపట్ల ప్రజల్లో విశ్వాసం, గౌరవం అధికంగా ఉండటానికి కారణం దాని నైతికతే. పేద, ధనిక భేదాలు లేకుండా సర్వులను సమానంగా చూస్తూ, బాధితులకు న్యాయం చేయాలన్న దాని ప్రతీ ప్రయత్నమూ ప్రజల్లో గౌరవాన్ని ఇనుమడింపచేస్తుంది. కొన్ని వివాదాస్పద కేసుల్లో ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు భిన్నంగా తీర్పులు వెలువడినప్పుడు ప్రజాగ్రహంతో పాటు అవినీతి ఆరోపణలను కూడా న్యాయవ్యవస్థ ఎదుర్కోవాల్సి రావచ్చు. రాజ్యాంగ విహితంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వాల నిర్దాక్షిణ్యమైన చర్యలనుంచి పౌరులను, వారి హక్కులను పరిరక్షించినప్పుడల్లా న్యాయవ్యవస్థ కీర్తిప్రతిష్ఠలు పెరిగిపోవడం చూస్తూనే ఉన్నాం. అయితే, ఈ వ్యవస్థలో అవినీతి ఉన్నదని ఇప్పుడే కాదు, ఎప్పటినుంచో ఆరోపణలు ఉన్నాయి. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తే సగానికి సగం జడ్జీలు అవినీతిపరులని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అవినీతి అంటే కేవలం డబ్బుతో ముడిపడింది కాదు. మిగతా అన్ని రంగాల్లోనూ ప్రమాణాలు, నీతినియమాలు నశించిపోతున్న నేపథ్యంలో, ఈ వ్యవస్థ కూడా జారిపోకుండా కాపాడుకోవడం న్యాయమూర్తుల బాధ్యత. బురద అంటుతోందనీ, విశ్వాసం కరుగుతోందని తెలిసినా నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోకుండా సమూల ప్రక్షాళనకు నడుంబిగించాల్సిన తరుణం ఇది. ఆస్తిపాస్తుల వివరాలను వెల్లడించడం ద్వారా తాను అందుకు సిద్ధపడుతున్న సంకేతాన్ని న్యాయవ్యవస్థ సమాజానికి ఇచ్చింది.

జనగణన 'హోం' ఆధ్వర్యంలో ఎందుకు?

జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభినందించాలి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జాతీయ భద్రత వ్యవహారాలలో తలమునకలై ఉండి కూడా కులగణనపై నిర్ణయం తీసుకోవడం ప్రధానమంత్రి విలక్షణ నాయకత్వ శైలికి ఒక తార్కాణం. జమిలి ఎన్నికల (లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం) విషయంలో వలే కాకుండా కులగణనపై అనూహ్య నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయం. ఈ నిర్ణయం ద్వారా, కులగణనపై భారతీయ జనతా పార్టీ వైఖరిలో ఒక సమూల మార్పు సంభవించినట్టు స్పష్టమయింది.

బ్రిటిష్ వలసపాలకులు 1872లో జనాభా లెక్కల సేకరణను ప్రారంభించిన నాటి నుంచి అందులో భాగంగా కుల జన గణన కూడా చేస్తూవచ్చారు. ఈ ఆనవాయితీ 1931 దాకా కొనసాగింది. ఆ తరువాత కులగణన ప్రక్రియ నిలిచిపోయింది. స్వతంత్ర భారతదేశంలో కూడా దానిని చేపట్టలేదు. ఇంచుమించు ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టడం ఇదే మొదటిసారి. స్వపరిపాలనలో భారతీయ సమాజంలో పెను మార్పులు సంభవించిన నేపథ్యంలో కులగణన అవసరమూ, ప్రాధాన్యమూ సంతరించుకుంది. ఇది ఎట్టకేలకు ఒక నిర్దిష్ట రూపం పొందనున్నది. చరిత్ర ముందుకు నడుస్తూనే ఉంటుంది కదా. జనాభా లెక్కల సేకరణ, కులగణన చాలా బృహత్ కార్యాలు. అంతేకాదు అవి బృహత్ బాధ్యతలు కూడా. అందునా ఏక కాలంలో నిర్వహిస్తున్నందున అవి పారదర్శకంగా జరగాలి. అది వాస్తవం కావాలంటే ఆ ప్రక్రియల నిర్వహణ వృత్తి నైపుణ్యంతో జరగవలసి ఉంటుంది. మరి ఈ కార్యనిర్వహణ ఏ మేరకు వృత్తి నిబద్ధతతో జరుగుతుందనే విషయమై సూచనలు స్పష్టంగా లేవు. 'ప్రభుత్వ సంక్షేమ ఎజెండాలో భాగంగా కులగణన' నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించినందున అనుమానాలకు తావివ్వని రీతిలో ఆ ప్రక్రియను పూర్తిచేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులాలవారీ జనగణన ప్రక్రియలో ఆ పారదర్శకత ఎటువంటి మినహాయింపులు లేకుండా కన్పించి తీరాలి.



జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులగణన హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కాకుండా స్వతంత్రంగా, వృత్తి నిపుణుల ఆధ్వర్యంలో జరిగేలా విధాన నిర్ణయం తీసుకోవాలి. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ ఇత్యాది అకడమిక్, పరిశోధనా సంస్థలకు ఆ బాధ్యతలు అప్పగించాలి.

దీక్షా దక్షతలు దండిగా ఉన్న నాయకుడుగా ప్రజల గౌరవాదరాలు పొందుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనాభా లెక్కల సేకరణ విషయంలో ఒక సాహసోపేత నిర్ణయం తీసుకోవడం సముచితంగా ఉంటుంది. జనాభా లెక్కల సేకరణ బాధ్యతను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విధుల నుంచి విడదీయాలి. ఇది కాలానుగుణ్యమైన మార్పుగా అర్థం చేసుకుని ప్రధాని మోదీ తన విలక్షణ రీతిలో నిర్ణయం తీసుకోవాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే జనాభా లెక్కల సేకరణ, అందులో భాగంగా కులగణనను హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కాకుండా స్వతంత్రంగా, వృత్తి నిపుణుల ఆధ్వర్యంలో జరిగేలా విధాన నిర్ణయం తీసుకోవాలి. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ ఇత్యాది అకడమిక్, పరిశోధనా సంస్థల ఆధ్వర్యంలో జనాభా గణన, కులగణన జరగాలి. 2021లోనే నిర్వహించాల్సిన ప్రక్రియను నాలుగు సంవత్సరాలకు పైగా వాయిదా వేయడంపై విమర్శలు వెల్లువెత్తిన దృష్ట్యా జనాభా గణన నిర్వహణకు ఒక స్వతంత్ర సలహామండలిని ప్రధానమంత్రి ఏర్పాటు చేయాలి. ఒక ప్రభుత్వ విభాగం ఆధ్వర్యంలో జనాభా లెక్కల సేకరణను నిర్వహించాల్సిన అవసరమేమీ లేదు. సెన్సస్ డైరెక్టరేట్ ఇన్ని దశాబ్దాలుగా హోం మంత్రిత్వ శాఖలో భాగంగా ఎందుకు ఉండి పోయిందన్నది ఒక అంతుపట్టని విషయమే. ఆసేతు హిమాచలం సమస్త ప్రజల గౌరవాదరాలు నిండుగా పొందుతున్న ప్రధానమంత్రి జనాభా లెక్కల సేకరణ కార్యకలాపాలను ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యం నుంచి పూర్తిగా తొలగించాలి. అయితే ప్రతిపాదిత సలహా మండలిలో ఆయా మంత్రిత్వశాఖలకు విధిగా ప్రాతినిధ్యం కల్పించాలి. జనగణన, కులగణనకు అవసరమైన నిధులను కేటాయించి, ఆ బాధ్యతల నిర్వహణను 'స్పేస్ కమిషన్' తరహా స్వతంత్ర సంస్థకు వదిలివేయాలి. సదరు సంస్థ షెడ్యూలు ప్రకారం ఆ బాధ్యతల నిర్వహణను ప్రారంభించి ముగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఇలా జరిగినప్పుడే జనాభా గణన, కులగణన విశ్వసనీయతను సాధించుకుంటాయి. ఏ సంకల్పంతో వాటిని నిర్వహించడం జరిగిందో అది నెరవేరుతుంది. 2026 జనాభా లెక్కల సేకరణ వర్తమాన భారతదేశ ప్రస్థానంలో చరిత్రాత్మక ప్రాముఖ్యమున్న సంఘటనగా నిలిచిపోతుంది.

– **డాక్టర్ ఎన్.భాస్కరరావు** (ఛైర్మన్, సీఎంఎస్)

ఏ వెలుగులకీ లెక్కలు!



కొన్ని నిర్ణయాలను.. తాత్కాలిక ఆవేశంతోనో, స్పందనతోనో, చిరకాల కోరిక నెరవేరుతుందన్న ఆశావహ దృష్టితోనో చూస్తే చరిత్రాత్మకం అనిపిస్తాయి. సమకాలీన చరిత్రను కొత్త మలుపు తిప్పే శక్తి వాటికి ఉన్నదని భావించేలా మనపై ప్రగాఢ ముద్రవేస్తాయి. 14 ఏళ్ల కిందట సామాజిక, ఆర్థిక కులగణనను (ఎస్ఈసీసీ) చేపడతామని ఆనాటి యూపీయే ప్రభుత్వం ప్రకటించినప్పుడు అన్నిరంగాల్లో సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిధి బాగా విస్తరించాలని కోరుకుంటున్న వారందరూ అలాగే భావించారు. కులగణన అనేది కులనిర్మూలనకు దారితీస్తుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ఘనంగా ప్రకటించారు. మరో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేల్ ఆమ్‌వెట్ సమానత్వానికి అవసరమైన విధానాల రూపకల్పనకు కులగణన ఎంత అవసరమో వివరించారు. దాన్ని వ్యతిరేకించే వారందరూ కళ్లముందున్న సామాజిక అసమానతలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కులగణన అనేది సంక్లిష్టమైనది కానేకాదనీ, ప్రతివ్యక్తి దగ్గరికి వెళ్లి నీ కులం ఏమిటి? అని అడిగి దాన్ని నమోదు చేస్తే సరిపోతుందనీ ఆమ్‌వెట్ సూచించారు. అట్లా సేకరించిన సమాచారాన్ని ఇతరత్రా వాటిని ఆధారం చేసుకుని నిపుణులు నింపాదిగా విశ్లేషణ చేసి వివిధ కులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఏ వర్గానికి చెందుతారో నిర్ణయించవచ్చని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా చెప్పే కులాల పేర్లను జనాభా సేకర్తలు యథాతథంగా రాసుకోవాలనీ, ముందుగా నిర్దేశించుకున్న కొన్ని కేటగిరీల్లో చేర్చేలా ఫలానా విధంగా సమాచారం చెప్పాల్సిందిగా నిర్బంధం పెట్టకూడదని కూడా సూచించారు.

ఎన్నో తర్జనభర్జనల అనంతరం ఆనాడు సామాజిక, ఆర్థిక, కులగణను ఆమ్‌వెట్ లాంటి వాళ్లు సూచించిన పద్ధతిలోనే చేపట్టారు. 6.4 లక్షల 'టాబ్స్'తో 640 జిల్లాల్లో డిజిటల్‌గా సమాచారాన్ని సేకరించారు. జనాభా సేకరణ చట్టం పరిధిలో కాకుండా ఆ కులగణనను వేరుగా నిర్వహించారు. అందుకే జనాభా లెక్కలతో పాటు ఆ సమాచారాన్ని వెల్లడించలేదు. విడిగా కూడా కులాల సమాచారాన్ని బహిరంగపరచలేదు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. యూపీయే ప్రభుత్వం ఓడిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2015లో పాక్షికంగా కొంత సమాచారాన్ని వెల్లడించింది. అది కూడా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఆర్థిక సమాచారాన్ని మాత్రమే ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 17.91 కోట్ల కుటుంబాల్లో 7.05 కోట్ల కుటుంబాలు ప్రభుత్వ చేయూత అవసరం లేనివిగా గుర్తించారు. 16 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయానికి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులపై 2011కు ముందు కూడా అవసరమైన సమాచారం ఉంది. కానీ దేశవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులను ఏకకాలంలో సర్వే చేయటంతో అంతకుముందు లేనంత స్థాయిలో సమగ్రంగానే సమాచారం లభ్యమైంది. కులగణన కోసం పట్టుపట్టిన వాళ్లకు ఆ సమాచారం సంతృప్తిని ఇవ్వలేదు. వెనుకబడిన కులాల జనాభా ఎంత ఉందో స్పష్టంగా వెల్లడి కావాలనీ దాంతో పాటు వారి విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక పరిస్థితి గురించి స్పష్టమైన గణాంకాలు ఉండాలనీ వారు కోరుకున్నారు. ప్రభుత్వం 2018లో వెల్లడించిన తుది నివేదికలో కూడా కులాల సమాచారాన్ని పొందుపర్చలేదు. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేస్తున్న ఆందోళనలతో సతమతమవుతున్న మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తన వద్దనున్న కులాలవారీ గణాంకాలను ఇవ్వాలని కోరింది. కేంద్రం తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది.

తన దగ్గరున్న కులాల సమాచారం చాలా గందరగోళంగా ఉందనీ, దానికి ప్రామాణికత లేదనీ కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహారాష్ట్రలో కులాలు 4,28,677గా తేలాయనీ, ఇక దేశవ్యాప్తంగా అవి 45 లక్షల దాకా నమోదయ్యాయని పేర్కొంది. గందరగోళాన్ని సృష్టించే అటువంటి సమాచారాన్ని వెల్లడి చేయలేమని తేల్చిచెప్పింది. అప్పటికి మహారాష్ట్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జాబితాలో 494 కులాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఈ తరహా జాబితాలు ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకుని కులాల జనసంఖ్య లెక్కించినా కొంత ఫలితం ఉండేది. ఎవరికి వారు తమది ఫలానా కులమని చెబితే మారుమాట్లాడకుండా దాన్ని నమోదు చేయాలనే నిర్ణయం మొదటికే మోసం తెచ్చింది. ఈ పరిస్థితిని అధికార యంత్రాంగం ఎందుకు ఊహించలేకపోయిందన్నది ఇప్పటికీ జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాష్ట్రాలవారీగా కులాలపై ఎన్నో అధ్యయనాలు అప్పటికే వెలువడిన నేపథ్యంలో ఇదెందుకు జరిగిందన్న విషయాన్ని కూడా ఎవరూ గట్టిగా లేవనెత్తలేదు. అప్పటి సర్వేని వేనోళ్ల పొగిడిన చాలామంది ఆ వైపరీత్యంపై మౌనం పాటించారు.



▪ **రాహుల్ కుమార్**

కులాల లెక్కల విషయంలో ఆ గతం పునరావృతం కాకుండా ఏం చేయబోతున్నారన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. జనాభా సేకరణ చట్టాన్ని సవరించి కులాల లెక్కలను సాధికారికంగా తేల్చుతామని కేంద్రమంత్రుల నుంచి ప్రకటనలు మాత్రం వెలువడుతున్నాయి. ఆ లెక్కలు రాజకీయాల్లో పావులుగా మారకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఘనతగానే భావిస్తోంది. రాహుల్ గాంధీ చేసిన పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందనే ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దాంతోనే ఆగలేదు. తెలంగాణలో తమ పార్టీ ప్రభుత్వం చేసిన కుల సర్వే సర్వసమగ్రమైందనీ దాన్ని దేశవ్యాప్తంగా అనుసరిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని చెబుతోంది. తెలంగాణ కుల సర్వేలో వెల్లడైన విద్య, ఉద్యోగ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి కీలక సమాచారాన్ని బయటపెట్టకుండా అద్భుత ఫలితాల గురించి పదేపదే మాట్లాడటం అసంబద్ధంగా అనిపిస్తుంది. ఆ సమాచారం ఏమిటో తెలిస్తేనే దేశవ్యాప్తంగా అనుసరించతగ్గ నమూనాగా తెలంగాణ సర్వే పనికొస్తుందో లేదో చెప్పగలిగే అవకాశం ఉంటుంది.

ఈసారి చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాన్ని ఒక అంశంగా చేర్చినంత మాత్రాన అద్భుతాలు జరుగుతాయని చెప్పలేం. ప్రతి కులానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటమే లక్ష్యమైతే జనాభా సేకరణలో చాలా మార్పులను చేపట్టాల్సి వస్తుంది. ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, హోదాల సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలి. అట్లాంటి సమాచారాన్ని సాధారణ జనాభా లెక్కలతో పాటు సేకరించిన సందర్భం ఇప్పటివరకూ లేదు. 2011లో చేసిన కసరత్తు ఆశించిన ఫలితాన్నీ ఇవ్వలేదు. పోనీ సాధారణ జనాభాలెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి సేకరిస్తోన్న సమాచారం మాదిరిగానే ఇతరకులాల విషయంలో జరిపితే లక్ష్యం నెరవేరుతుందని చెప్పలేం.

ఈసారి చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాన్ని ఒక అంశంగా చేర్చినంత మాత్రాన అద్భుతాలు జరుగుతాయని చెప్పలేం. ప్రతి కులానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించటమే లక్ష్యమైతే జనాభా సేకరణలో చాలా మార్పులను చేపట్టాల్సి వస్తుంది. ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, హోదాల సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలి. అట్లాంటి సమాచారాన్ని సాధారణ జనాభా లెక్కలతో పాటు సేకరించిన సందర్భం ఇప్పటివరకూ లేదు. 2011లో చేసిన కసరత్తు ఆశించిన ఫలితాన్నీ ఇవ్వలేదు. పోనీ సాధారణ జనాభాలెక్కల్లో భాగంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు సంబంధించి సేకరిస్తోన్న సమాచారం మాదిరిగానే ఇతర కులాల విషయంలో జరిపితే లక్ష్యం నెరవేరుతుందని చెప్పలేం. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ప్రతి కులం, తెగ విషయంలో సంఖ్యాపరమైన సమాచారం ఉంది. కానీ కులాలవారీగా ఆర్థిక, విద్యా, ఉద్యోగపరమైన సమాచారం లేదు. ఎస్సీల్లో డిగ్రీ ఎంత మంది చదివారో తెలుస్తుంది. ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారో వెల్లడవుతుంది. ఎంతమంది భూమిలేని వారున్నారో కనుక్కోవచ్చు. ఎంతమంది ఏ వృత్తుల్లో ఉన్నారో కూడా అంచనాకట్టొచ్చు. కానీ ఏ కులం వాళ్లు నిర్దిష్టంగా ఎక్కడున్నారో తెలుసుకోలేం. ఎవరికి ఉద్యోగాలు ఎక్కువ ఉన్నాయో, ఎవరికి తక్కువ ఉన్నాయో తెలుసుకోలేం. స్థూల చిత్రమే తప్ప విడి కులం పరిస్థితి కనపడదు. జనాభా లెక్కల్లో అటువంటి నిర్దిష్ట కుల సంబంధిత సమాచారమే ఉండి ఉంటే ఎస్సీ వర్గీకరణ సమస్య అంత జటిలమయ్యేది కాదు. కళ్లముందు కనపడే వాస్తవాలతో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలిసిపోయేది. వర్గీకరణ వివాదం ఎప్పుడో ముగిసేలా రాజకీయ ఒత్తిళ్లు వచ్చి ఉండేవి. న్యాయస్థానాలూ వాస్తవాలను తొందరగా పరిగణనలోకి తీసుకుని ఉండేవి!

పరిస్థితి ఇలా ఉన్న నేపథ్యంలో ఇతర కులాలకు సంబంధించి కూడా ఆ తరహా సమాచారాన్నే సేకరిస్తే అది పరిమితంగానే ఉంటుంది. దాన్ని సైతం చేపట్టకుండా కేవలం కులాలవారీ జనాభాను మాత్రమే లెక్కిస్తే అది మరింత పరిమితమైన ప్రయోజనాన్నే ఇస్తుంది. కీలక విషయాల్లో ఎవరు.. ఎక్కడున్నారో తెలియని పరిస్థితి వల్ల ఆశిస్తున్న మార్పులు వచ్చే అవకాశాలు తక్కువ. భవిష్యత్తులో రాజకీయ ప్రయోజనాలు ఎటువైపు లాగుతాయో చెప్పలేం. మార్గదర్శకాలు రూపొందితే గానీ స్పష్టత రాదు. అయితే పైన ప్రస్తావించిన రెండు మార్గాల్లో ఏదో ఒకదాన్ని అనుసరించే అవకాశాలే ఎక్కువ!

వలసపాలనలో కులాలు, తెగల వారీగా జరిగిన జనాభా లెక్కలకు అవసరానికి మించి ప్రాధాన్యతనూ, విపరీత శాస్త్రీయతను ఆపాదించటం ఇటీవల ఎక్కువైపోతోంది. కులం ఆధారంగా 1931లో జరిపిన జనాభా లెక్కలు చివరివే గానీ అవి సర్వసమగ్రమని చెప్పలేం. చాలా కులాలను అప్పుడు లెక్కించలేదు. కొన్ని కులాలను కలిపి చూపారు. పాలనా అవసరాల కోసం మార్పులూ చేర్పులూ చేశారు. 1921 నాటి లెక్కలతో పోల్చితే 1931లో మార్పులు కొట్టొచ్చినట్లు కనపడతాయి. 1931లో వృత్తుల ఆధారంగా కులాలను వర్గీకరించారు. 1891లో మొదటగా అలా చేశారు. మధ్యలో రెండు సార్లు వేరేరకంగా చేశారు. 1901లో అయితే కులాలకు ఎక్కువ తక్కువ హోదాలనూ సూచిస్తూ జాబితాను రూపొందించారు. విమర్శలు రావటంతో దాన్ని వదిలేశారు. కులాల జాబితాలు ఎలా మారిపోతాయో తెలుసుకోవాలంటే మద్రాసు రాష్ట్ర లెక్కలను బట్టి తేలికగా గ్రహించొచ్చు. 1931లో ఆ రాష్ట్రంలో 156 కులాలకు లెక్కలు ఇచ్చారు. 1921లో 351 కులాలవారీ జనాభాను ప్రచురించారు.

కుల, మత అస్తిత్వాలనూ, ఆలోచనలనూ దాటలేని పరిస్థితే దేశంలో ఇంకా బలంగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని కులలెక్కల ఆధారంగా పరిపుష్టం చేయాలన్న భావనపై జాతీయపార్టీలు ఏకాభిప్రాయానికి రావటమే ఇందుకు నిదర్శనం. 21వ శతాబ్దపు భారత విశిష్టతగా దాన్ని చెప్పుకోవచ్చు!

కులాలు, తెగలు, మత సమూహాలుగా మాత్రమే భారత ప్రజలను బ్రిటిషు పాలకులు ప్రధానంగా చూశారు. అందరినీ ఏకంచేసే జాతీయభావన భారత్‌లో లేదన్న ఆలోచనే బ్రిటిషు పాలకుల విధానాలను ప్రభావితం చేసింది. కులలెక్కలను కూడా ఆ దృష్టితోనే చేపట్టారు. ఆ లెక్కలు కులాలు సంఘటితం కావటానికీ, పదవుల కోసం పోటీపడటానికి దారితీశాయి. ఈ రెండు పరిణామాలు ఇప్పటికీ ఏదో రూపంలో కొనసాగుతున్నాయి. ఇవి మరింత ఉధృతం అవుతాయా లేదా అన్నది కులగణన ఫలితాలను, వాటి ఆధారంగా చేపట్టే విధానాలు బట్టి ఉంటుంది. కుల, మత అస్తిత్వాలనూ, ఆలోచనలనూ దాటలేని పరిస్థితే దేశంలో ఇంకా బలంగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని కులలెక్కల ఆధారంగా పరిపుష్టం చేయాలన్న భావనపై జాతీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావటమే ఇందుకు నిదర్శనం. 21వ శతాబ్దపు భారత విశిష్టతగా దాన్ని చెప్పుకోవచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

'పహల్గాం' మథనంలో కశ్మీరీలు



▪ **రాజ్‌దీప్ సర్దేశాయి**

దీపశిఖ

పహల్గాం హతులకు నివాళిగా శ్రీనగర్ నడిబొడ్డున కొవ్వొత్తుల ప్రదర్శనలు జరుగుతున్నాయి; సోపోర్ లాంటి పట్టణాలలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి; కశ్మీర్ లోయలో సర్వత్రా పాకిస్థాన్‌కు మద్దతు తగ్గిపోతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితులలో భారత ప్రభుత్వమూ, పౌర సమాజమూ కశ్మీరీలతో అర్థవంతమైన రీతిలో ఆత్మీయ అనుబంధాలను పెంపొందించుకోవాలి. భారత జాతీయ జీవన స్రవంతిలో తామూ భాగమేనన్న భావన కశ్మీరీలలో సుస్థిరంగా నెలకొల్పాలి.

'కశ్మీరీలుగా మేము ఎవరం? సంఘర్షణ వల్ల గుర్తింపు పొందాలని మేము కోరుకోవడం లేదు. మా సామర్థ్యాలతో మేము ఎవరమో నిర్ణయింపబడాలని కోరుకుంటున్నాం. ప్రపంచం నుంచి వేరుపడాలని మేము ఆశించడం లేదు. మేము కేవలం రాజకీయ పరిస్థితులకు బాధితులం మాత్రమే కాదు, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా, ఇంకా సమున్నత వృత్తి నిపుణులుగా పేరుగాంచాలని మేము ప్రగాఢంగా కోరుకుంటున్నాం.'– ఇవి సోపోర్ పట్టణానికి చెందిన ఒక 17 ఏళ్ల విద్యార్థిని మాటలు.

రక్త కాసారమై పోయిన కశ్మీర్ లోయలో ఆశాభావం, నైరాశ్యం ఎనలేని వ్యాకులతతో సహజీవనం చేస్తున్నాయి. కశ్మీరీ ముస్లిం గురించి గతానుగతమైన భావనల నుంచి బయటపడి జీవన ఉన్నతికి తోడ్పడే ఆకాంక్షాభరిత సమాజంలో భాగమయ్యేందుకు యువ కశ్మీరీలు ఆరాటపడుతున్నారు. ఆ ఆరాటం వారిని కొత్త ఆలోచనలకు పురిగొల్పుతోంది. నైరాశ్యాన్ని వీడి తెగింపుతో వ్యవహరించేలా ప్రోత్సహిస్తోంది. అయితే తీవ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నవారూ కచ్చితంగా ఉన్నారు. ఇది కొట్టివేయలేని వాస్తవం. కశ్మీరీ సమాజం సంక్లిష్టమైనది. సోపోర్ విద్యార్థిని శాంతి కోసం చేసిన విజ్ఞప్తికి సమాంతరంగా ప్రతీకారానికి పాల్పడి తీరాలని కర్కశంగా ఇస్తున్న పిలుపులూ మీకు కశ్మీర్ లోయలో వినబడతాయి. సంఘర్షణలు ఎడతెగకుండా జరుగుతున్న ప్రదేశంలో చాలా మంది బహిరంగంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను వారిలో అంతర్గతంగా ఉన్న భయమే నిర్దేశిస్తుందనడం సత్య దూరం కానేకాదు. పహల్గాంలోని బైసరన్ హరిత మైదానంలో ఉగ్రవాదుల ఘాతుకం, దాని పర్యవసానాల ప్రభావంతో కశ్మీరీలు మళ్లీ మథనంలో పడ్డారు. పాత, కొత్త సమస్యలు అన్నిటినీ పరిగణనలోకి వివిధ దృక్కోణాలలో ఆ మథనం సాగుతోంది. సుడిగాలి వేగంతో కశ్మీర్ లోయలో విస్తృతంగా చేసిన పర్యటనలో నేను గ్రహించిన పది అంశాలను వివరంగా తెలియజేస్తాను.

మొదటిది. పహల్గాం ఘటనపై కశ్మీరీ సమాజంలోని అన్ని వర్గాలలో ఆగ్రహం, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. అవి నిర్నిబంధమైనవి. మనసు లోతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చివేయడం పట్ల సమస్త కశ్మీరీలు స్వతస్సిద్ధమైన భావోద్వేగాలతో ప్రతిస్పందించారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు వాటిని తాము ఖండించకపోవడం గురించి చాలా మంది పరితాపం చెందుతున్నారు. భయంతో తాము మౌనంగా ఉండిపోవడం వల్లే ఉగ్రవాదులు మరింతగా తెగించుతున్నారని కశ్మీరీలు భావిస్తున్నారు.

రెండవది. పహల్గాం పర్యాటకులలో హిందువులు ఎవరో గుర్తించి మరీ వారిని కాల్చివేయడం పట్ల కశ్మీరీలు తీవ్ర వేదనతో ప్రతిస్పందించారు. మత విద్వేషంతో జరిగిన ఘాతుకాన్ని వారు నిరసిస్తున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదం ఇటీవలి దశాబ్దాలలో కశ్మీర్ లోయలోకి ప్రవేశించిన ఇస్లామిక్ తీవ్రవాదం కశ్మీరీ పండిట్‌లను స్వస్థలాల నుంచి వెళ్లగొట్టింది. ఇది, ఉదాత్త 'కశ్మీరియత్' భావనకు పూర్తిగా విరుద్ధమైనది. ఆ వెలివేత కశ్మీర్ చరిత్రకు ఒక తీరని కళంకం.

మూడవది. పహల్గాం ఘటన కశ్మీర్ లోయలోని పాకిస్థాన్ మద్దతుదారులకు విద్యుద్ఘాతమయింది. కశ్మీరీ ప్రయోజనాలను కాపాడే శక్తిగా పాకిస్థాన్‌ను కశ్మీరీలు ఇంకెంత మాత్రం భావించడం లేదు. ఇంటెలిజెన్స్ వర్గాల వారి వైఫల్యం వల్లే పహల్గాం ఘటన సంభవించిందని విశ్వసిస్తున్నవారు సైతం పాకిస్థాన్ నాయకులు తమ బాధ్యతను కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న వాదనలు పూర్తిగా మోసపూరితమైనవని ఖండిస్తున్నారు.

నాల్గవది. స్థానిక మిలిటెంట్లకు దశాబ్దం క్రితం ఉన్న ఆదరణ, మద్దతు ఇప్పుడు లేనేలేదు. 2016లో హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వనీని కొత్త మిలిటెన్సీకి ఒక పోస్టర్ బాయ్‌గా పరిగణించేవారు ఆ ఏడాది అతడు భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయినప్పుడు ప్రజలు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసనలు తెలిపారు. స్వతంత్ర కశ్మీర్ కోసం పోరాడుతున్న వర్గాలలో మినహా ప్రజల్లో విస్తృత స్థాయిలో స్థానిక మిలిటెంట్లకు ఆదరణ, మద్దతు లభించడంలేదు.

ఐదవది. కశ్మీర్ లోయలో పాకిస్థాన్‌కు మద్దతు గణనీయంగా తగ్గిపోయినప్పటికీ దానికి సమతుల్యంగా భారత రాజ్య వ్యవస్థతో సాన్నిహిత్యం పెరగలేదు. నిజమేమిటంటే మోదీ ప్రభుత్వం ముస్లిం–వ్యతిరేకి అని కశ్మీరీలు భావిస్తున్నారు. ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రమైన జమ్మూ కశ్మీర్‌కు 2019లో రాత్రికి రాత్రే రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేసి కేంద్రపాలిత ప్రాంతంగా కుదించివేసిన అనంతరం కశ్మీరీలలో ఆ భావన మరింత ప్రగాఢమయింది. తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంచేందుకే తమ రాష్ట్రానికి రాష్ట్ర హోదా రద్దు చేశారని కశ్మీరీలు భావిస్తున్నారు.

ఆరవది. కేంద్రం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని మనస్తాపం చెందుతున్న కశ్మీరీలకు 2024 ఎన్నికలు ఎటువంటి ఊరట నివ్వలేదు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పట్ల సదభిప్రాయం ఉన్నప్పటికీ ఆయన తమ ప్రయోజనాలను కాపాడ గల నాయకుడుగా కశ్మీరీలు భావించడం లేదు. న్యూఢిల్లీ పాలకులు అనుసరిస్తున్న కశ్మీర్ వ్యతిరేక విధానాలపై పోరాడే పటిమ, చొరవ ఆయనకు లేవనే అసంతృప్తి కశ్మీరీలలో బాగా ఉన్నది.

ఏడవది. కశ్మీర్ లోయలో అడుగడుగునా భద్రతా దళాల మోహరింపు కనిపిస్తుంది. తమను అడుగడుగునా నియంత్రించడాన్ని కశ్మీరీలు నిరసిస్తున్నారు. ఆ అణచివేత నుంచి బయటపడేందుకు వారు ఆరాటపడుతున్నారు. నిత్యం ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, గాలింపు చర్యలు వారిని క్రుంగదీస్తున్నాయి. ఉగ్రవాద దాడి జరిగిన ప్రతిసారీ మిలిటెంట్ కార్యకలాపాలతో ఎటువంటి సంబంధం లేని వారిని నానా వేధింపులకు గురిచేయడాన్ని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పహల్గాం ఘటన అనంతరం ఉగ్రవాదులతో ఎటువంటి సంబంధాలు లేని వారి గృహాలను సైతం కూల్చివేయడాన్ని వారు గర్హించారు.

ఎనిమిదవది. భారత రాజ్యవ్యవస్థ నిరంకుశ పాలనకు తాము శాశ్వత బాధితులమనే భావన కశ్మీరీలలో ఉన్నది. ఈ కారణంగానే విశాల భారతదేశంలోని ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఒక కశ్మీర్ విద్యార్థి వేధింపులకు గురవుతున్నాడన్న వార్త కశ్మీర్ లోయ అంతటా దావానలంలా వ్యాపిస్తోంది. 'ప్రధానస్రవంతి' భారతీయులు తమను ఉద్దేశపూర్వకంగానే 'జాతి–వ్యతిరేకులు'గా ప్రచారం చేస్తున్నారని కశ్మీరీలు చాలా మంది వాపోతున్నారు. ఉగ్రవాద చర్యలు చోటుచేసుకున్న ప్రతిసారీ తమను ఏదో ఒక విధంగా ఉమ్మడి శిక్షకు గురి చేస్తున్నారని కశ్మీరీలు కలత చెందుతున్నారు.

తొమ్మిదవది. కశ్మీరీలకు శాంతి, ఐశ్వర్యాల లబ్ధి సమకూరేందుకు అవకాశాలు అధికంగానే ఉన్నాయి. ఇటీవలి కాలంలో కశ్మీర్ లోయకు పర్యాటకులు వెల్లువెత్తడం ప్రారంభమయింది. కశ్మీర్ పర్యాటక ఆర్థిక వ్యవస్థ బాగా పుంజుకుంది. సరిగ్గా ఈ తరుణంలో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఆ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. తక్కువ తలసరి ఆదాయం, అత్తెసరు ఉద్యోగ అవకాశాలతో కునారిల్లుతున్న కశ్మీరీలు తమ విలక్షణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ విశాల భారత ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ఆరాటపడుతున్నారు.

కశ్మీరీల ఆకాంక్ష పదవ, చివరి పరిశీలనకు తీసుకువస్తుంది. బైసరన్ హత్యాకాండ ఎంత భీతావహాన్ని సృష్టించినప్పటికీ కశ్మీర్ లోయలో శాంతి స్థాపనకు అదొక కొత్త అవకాశాన్ని కల్పించింది! విడ్డూరమే అయినప్పటికీ ఇదొక వాస్తవం. ఉగ్ర దాడితో కశ్మీర్ లోయ స్తబ్దమైపోయింది. హింసాకాండను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్న వారితో సంబంధాలు నెలకొల్పుకోవడం, వారి ఆందోళనలకు మద్దతునివ్వడం చాలా ముఖ్యం. బైసరన్ హతులకు నివాళిగా, ఇతర బాధితులకు సంఘీభావంగా శ్రీనగర్ నడిబొడ్డున కొవ్వొత్తుల ప్రదర్శనలు జరుగుతున్నాయి; సోపోర్ లాంటి పట్టణాలలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి; బైసరన్ హత్యాకాండకు పాల్పడినవారికి గరిష్ఠ శిక్ష విధించాలని కశ్మీర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు; కశ్మీర్ లోయలో సర్వత్రా పాకిస్థాన్‌కు మద్దతు తగ్గిపోతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితులలో భారత ప్రభుత్వమూ, పౌర సమాజమూ కశ్మీరీలతో అర్థవంతమైన రీతిలో ఆత్మీయ అనుబంధాలను పెంపొందించుకునేందుకు హృదయపూర్వకంగా ప్రయత్నించాలి. హిందూ–ముస్లిం ఉద్రిక్తతలు పెచ్చరిల్లే విధంగా వ్యవహరించకూడదు. కశ్మీరీలను లక్ష్యంగా చేసుకునే చర్యలు చేపట్టకూడదు; నిర్ణయాలు తీసుకోకూడదు. దుష్ట, విఫల పాకిస్థాన్ రాజ్య వ్యవస్థకు విరుద్ధంగా నిజమైన లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థకు నెలవుగా వర్ధిల్లుతున్న భారత్ ఆదర్శ స్ఫూర్తి ప్రాతిపదికన కశ్మీరీలకు సన్నిహితమవ్వాలి. భారత జాతీయ జీవన స్రవంతిలో తామూ భాగమేనన్న భావన వారిలో సుస్థిరంగా నెలకొల్పాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శుక్రవారం 9 మే 2025



ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకెళుతున్న పోలీసులు

కర్రెగుట్టల్లో రక్తపుటేరులు!

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా 'ఆపరేషన్ కగార్'

- అగ్రనేతలే టార్గెట్‌గా కొనసాగుతున్న 'ఆపరేషన్ బ్లాక్ హిల్స్'
- నక్సల్స్ మందుపాతరలకు ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసుల మృతి
- ఇటీవల ప్రెజర్ బాంబు పేలి జవాన్ మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- పోలీసుల ఆపరేషన్‌లో 25మందికి పైగా మావోయిస్టులు హతం
- కాల్పుల విరమణ, శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపు
- వచ్చే యేడాదిలోగా నక్సలైట్ల నిర్మూలనే ధ్యేయంగా కేంద్రం చర్యలు 7

కర్రెగుట్టల్లో అలజడి మొదలైంది. ఇనుప బూట్ల చప్పుడుతో కీకారణ్యం గర్జిస్తోంది. అడవుల్లో తుపాకులు మోగుతున్నాయి. మందుపాతరలు పేలుతున్నాయి. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బ్లాక్‌హిల్స్ ఎరుపెక్కుతున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా కేంద్ర భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' కర్రెగుట్టల్లో మారణహోమాన్ని సృష్టిస్తోంది. అనేక మంది మావోయిస్టులు తుపాకీ తూటాలకు, పోలీసులు మందుపాతరలకు బలైపోతున్నారు. గత నెల 22వ తేదీన కేంద్ర బలగాలు చేపట్టిన కర్రెగుట్టల ఆపరేషన్‌లో ఇప్పటికే 25మందికి పైగా మావోయిస్టులు మృతి చెందగా, తాజాగా ముగ్గురు తెలంగాణ గ్రేహౌండ్స్ జవాన్లు నక్సల్స్ మందుపాతరలకు బలయ్యారు. ఇంతకుముందు వందలాది మందుపాతరలను పోలీసులు నిర్వీర్యం చేశారు. దట్టమైన అడవుల్లో మావోయిస్టుల కోసం శాటిలైట్ చిత్రాలను, అత్యాధునిక డ్రోన్లను, హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు శాంతిమంత్రం జపిస్తుండగా, కేంద్రం పట్టించుకోవడంలేదు. చర్చలకు సిద్ధమని మావో ప్రతినిధులు చెబుతుండగా.. మావోయిస్టుల నిర్మూలనే ధ్యేయంగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కర్రెగుట్టల్లో యుద్ధవాతావరణం నెలకొంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

దండకారణ్యంలో పేలిన మందుపాతర

- కూంబింగ్ బలగాలే లక్ష్యంగా పేల్చిన మావోయిస్టులు
- తెలంగాణ గ్రేహౌండ్స్‌కు చెందిన ముగ్గురు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు, హైదరాబాద్‌కు తరలింపు
- ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారంటూ ప్రచారం 7
- మృతుల్లో చంద్రన్న, బండి ప్రకాష్ ఉన్నట్టు కథనాలు

హెలికాప్టర్‌లో మృతదేహాల తరలింపు

- కర్రెగుట్టల నుంచి మామునూరుకు.. అక్కడి నుంచి ఎంజీఎం మార్చురీకి..
- కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నివాళులర్పించిన డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు నాగరాజు, రేవూరి 7

వసంతోత్సవంలో భద్రకాళి అమ్మవారు

తొమ్మిదో రోజుకు చేరిన కల్యాణ బ్రహ్మోత్సవాలు


భద్రకాళి అమ్మవారి వసంతోత్సవ పూజకు హాజరైన భక్తులు

వరంగల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వైభవంగా జరుగుతున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్య పూజతో ప్రారంభమైన పూజలు, పారాయణం, హోమం నిర్వహించిన అనంతరం అమ్మవారికి వసంతోత్సవం, చతురంత సేవను నిర్వహించారు. తొమ్మిదో రోజు ఉత్సవాల ఉభయ దాత సేవల్లో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి కుల సంఘం వారు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూజాద్రవ్యాలు అందజేసి పూజలు చేశారు. అనంతరం మహిళలచే కుంకుమార్చన, హోమం అర్చకులు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఆమంచి నాగపరిమళ శ్రీనివాసరావు దంపతులు, కుమ్మరి కుల సంఘం ప్రతినిధులు ఆమంచి రాజ్‌ప్రదీప్, అనసూయ, అనిల్ కార్తీక్, రాజేశ్వరి, ధర్మరాజు వందన, ఆవునూరి రాంమూర్తి, రుద్రారపు కుమారస్వామి, నాంపల్లి ప్రభాకర్, రమేష్‌మూర్తి, కుమారస్వామి, పాలడుగుల నాగరాజు, రాజ్‌గోపాల్, సముద్రాల వెంకన్న, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శేష భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరు మెరుగుపర్చుకోవాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): బల్దియా పరిధిలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరు మెరుగుపర్చుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బల్దియా కార్యాలయంలో గురువారం కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అన్ని సెక్షన్లతో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు కొత్తగా వచ్చే సాఫ్ట్‌వేర్‌లపై నైపుణ్యత పెంచుకోవాలన్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని అందుకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ఏ సెక్షన్ కేటాయించినా అక్కడ అంకిత భావంతో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఐటీ అధికారి రమేష్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి పాల్పడితే కేసులు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి గుమ్మడికాయ, కోడె మొక్కులు చెల్లించారు. అనంతరం వీరభద్రస్వామి దేవాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. స్వయంగా కార్యకర్తలందరికీ కేక్‌ను తినిపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు ఇప్పిస్తామని కొంత మంది దళారులు, బ్రోకర్ల అవతారం ఎత్తుతున్నట్లు సమాచారం ఉందన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులు, నిరుపేదలకే అందించాలన్నారు. యేడాదికి 3500 ఇళ్లు ప్రతీ నియోజకవర్గానికి అందిస్తామన్నారు. ఇలా ఐదేళ్లలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. దీని ద్వారా ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి అందిస్తే గ్రామాల్లో మంచి పేరు వస్తుందన్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. ఎంపికైన ఇందిరమ్మ ఇళ్లను గ్రామాల్లోనే పేర్లను డిస్‌ప్లే చేస్తామన్నారు. పదేళ్లలో ఒక ఇల్లు కూడా ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడే అర్హత లేదన్నారు. సాగు, తాగునీరు నియోజకవర్గానికి అందించడమే లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కొత్తకొండ దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనకయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, కేతిరి లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పప్పు పోచయ్య, ఊసకోయిల ప్రకాష్, మాడ్గుల ఎజ్రా, యాటపోలు శ్రీనివాస్, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, చిదురాల స్వరూప, కడారి అన్నపూర్ణ, మంజూల, డబ్బా శంకర్, జక్కుల అనిల్, చిట్కూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తకొండలో మొక్కులు చెల్లిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సీఎం వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధిపై ప్రభావం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధిపై ప్రభావం చూపుతాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలోని ఎంఆర్ఆర్ గార్డెన్స్‌లో వర్ధన్నపేట, ఐనవోలు మండలాల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 15నెలల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని, రైతు రుణమాఫీ కొంత మందికి మాత్రమే వచ్చిందన్నారు. రైతుబంధు కొద్దిమంది రైతులకు వేసి చేతులు దులుపుకుందన్నారు. అవినీతి, అక్రమాలు పెరిగాయని, పలు ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికార పార్టీ పథకాలుగా మార్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ఎండగడుతూ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు అనుబంధ సంఘాలు సైతం క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తూకాలు, రవాణా సౌకర్యాలలాంటి ఇబ్బందులతో రైతులు వారం రోజులకుపైగా వరి ధాన్యంపై నిద్రించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామన్న మంత్రి మాటలు నీటి మూటలుగా మారాయన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లలితయాదవ్, మార్గం బిక్షపతి, చింతల యాదగిరి, గుజ్జ గోపాల్‌రావు, అన్నమనేని అప్పారావు, చందర్‌రావు, గుజ్జ సంపత్‌రెడ్డి, తూళ్ల కుమారస్వామి, సిలువేరు కుమారస్వామి, చొప్పరి సోమయ్య, తిరుపతిరెడ్డి, దుగ్యాల మాధవరావు, పెంచాల కుమారస్వామి, గోదుమల మధు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కమిషనరేట్‌కు ఇద్దరు కొత్త ఏసీపీలు

- కాజీపేట ఏసీపీగా పింగిళి ప్రశాంత్‌రెడ్డి
- నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్

వరంగల్ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు ఇద్దరు ఏసీపీ లను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీ సైబర్ క్రైమ్ బ్యూరో డీసీపీగా పనిచేస్తున్న పింగిళి ప్రశాంత్‌రెడ్డిని కాజీపేట ఏసీపీగా నియమించారు. నర్సంపేట ఏసీపీగా పని చేస్తున్న కిరణ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆయన స్థానంలో ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న పున్నం రవీందర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

తీరని కబ్జా 'దాహం'

గోపాల్‌పూర్ చెరువులో అక్రమ నిర్మాణాలు

- నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్‌లో కట్టడాలు
- శిఖంలోనే వెంచర్లు చేసి విచ్చలవిడిగా దందా
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


చెరువు బఫర్‌జోన్‌లో నిర్మించిన ఇళ్లు

వడ్డెపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోపాల్‌పూర్‌లో రియల్టర్ల భూ దందా మూడు పూలు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. చెరువు శిఖం భూమిని వెంచర్లుగా మలిచి నకిలీ దస్తావేజులు సృష్టించి కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొల్లగొడుతున్నారు. బఫర్ జోన్‌లో వందలాది గృహాలు వెలిశాయి. చెరువుకు ఉన్న మత్తడి సైతం మాయం చేయడంతో పాటు వ్యర్థాలతో పూడ్చి వేస్తున్నారు.


మత్తడి స్థలంలో నిర్మించిన సీసీ రోడ్డు

బఫర్‌జోన్‌లో..

గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ ఊర చెరువులో బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. సర్వే నంబర్ 89లో రెవెన్యూ సెత్వార్ రికార్డుల ప్రకారం 23ఎకరాల 10 గుంటల భూమి ఉండాల్సి ఉంది. ఇందులో 2ఎకరాలు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనధికారికంగా కేటాయింపు జరిగింది. దీంట్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. అంతేకాకుండా గ్రామానికి చెందిన కొందరు రియల్టర్లు నకిలీ దస్తావేజులు సృష్టించి సుమారు 10 ఎకరాల స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చెరువునే వెంచర్‌గా మలిచి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు ఫుల్ ట్యాంకు లెవెల్ (ఎఫ్‌టీఎల్) పైన బఫర్ జోన్ ఉండాల్సి ఉంది. బఫర్ జోన్‌ను ఆక్రమించుకొని బైసర్వే నెంబర్లు సృష్టించి శిఖం భూమిని అప్పనంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం చెరువు శిఖం 10 ఎకరాల్లోపే ఉంది. మిగతా భూమి అన్యాక్రాంతమైందని ప్రజలు అంటున్నారు.

చెరువులో సమాధులు

చెరువు కట్టను ఆనుకొని రెండు చోట్ల సమాధులు వెలిశాయి. సమాధులకు అధికారపూర్వకంగా స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించలేదు. అయినప్పటికీ సమాధులతో పాటు శవ దహనాలను సైతం చెరువులోనే నిర్వహిస్తున్నారు.


చెరువులో పారిశుధ్య కార్మికులు పడేసిన చెత్త

చెత్తతో పూడుకుపోతున్న చెరువు

56వ డివిజన్‌లోని వివిధ కాలనీలలో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను చెరువులోనే డంప్ చేస్తున్నారు. కాలనీలలోని వ్యర్థాలు, కోసిన ముంజల కాయలను చెరువులో వేస్తున్నారు. దీంతో చెరువులోని నీటిలోకి వ్యర్థాలు చేరి జలం కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. చెరువులో వేసిన వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని వివిధ కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మత్తడి మాయం

చెరువు మత్తడిని నగర పాలక సంస్థ సిబ్బంది తొలగించారు. మత్తడిని చెరిపి వేసి ఆ స్థలంలో అనుమతి లేకుండానే సీసీ రోడ్డును వేశారు. దీంతో చెరువుకు ఉన్న మత్తడి నామరూపాలు లేకుండా పోయింది. చెరువు నిండినప్పుడు నీరు ప్రవహించకుండా నివాస గృహాల్లోకే చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ వెల్లడి

ప్రకటించిన కేయూ పరీక్షల నియంత్రణాధికారులు

కేయూ క్యాంపస్ మే 8, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర రెగ్యులర్ కోర్సుల సెమిస్టర్ పరీక్షల తాజా రీ షెడ్యూల్‌ను గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్యలు వెల్లడించారు. రీ షెడ్యూల్ పరీక్షల టైమ్‌టేబుల్‌లో డిగ్రీ అఖరు సెమిస్టర్, నాలుగో, రెండో సెమిస్టర్‌తోపాటు బ్యాక్‌లాగ్ సెమిస్టర్ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల తేదీలను వెల్లడించారు. అఖరు సెమిస్టర్ షెడ్యూల్‌ను మే 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 05, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ షెడ్యూల్‌ను మే 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. రెండో సెమిస్టర్‌ను షెడ్యూల్ మే 14, 16, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. బ్యాక్‌లాగ్ మొదటి సెమిస్టర్ షెడ్యూల్‌ను మే 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. బ్యాక్‌లాగ్ మూడో సెమిస్టర్ షెడ్యూల్‌ను మే 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. బ్యాక్‌లాగ్ ఐదో సెమిస్టర్ షెడ్యూల్‌ను మే 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4, 10 11, 12, 13, 16 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

సీపీ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరిక

వరంగల్ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సీపీ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో మద్యం దుకాణాల పరిసరాలతో పాటు పురాతన భవనాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒక్క రోజే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 221 మంది మందుబాబులపై సిటీ పోలీస్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు. అత్యధికంగా జనగామ డివిజన్‌లో 57 కేసులు నమోదు కాగా, హనుమకొండ డివిజన్‌లో 42, ఘన్‌పూర్‌లో 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్‌లో 10 కేసులు నమోదు చేశామన్నారు. మద్యం దుకాణాల పరిసరాల్లో మద్యం తాగకుండా మద్యం షాపు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగుతూ కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సీపీ తెలిపారు.

మార్కెట్‌లో వడదెబ్బతో హమాలీ మృతి

వరంగల్ వ్యవసాయం, మే 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డులో గురువారం పనిచేస్తున్న హమాలీ కార్మికుడు శివరాత్రి శ్రీనివాస్(35) వడదెబ్బ తగిలి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. వర్ధన్నపేట మండలం సాగరం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ పదేళ్ల కిందట వరంగల్ నగరానికి వచ్చి సుందరయ్యనగర్‌లో నివాసముంటున్నాడు. అతడికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు సమీక్ష, రిషి ఉన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని గజేంద్ర అడ్తి దుకాణంలో హమాలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే శ్రీనివాస్ గురువారం మార్కెట్‌కు వెళ్లి మిర్చి యార్డులో మిర్చి బస్తాలను తూకం వేస్తున్న క్రమంలో వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. తోటి హమాలీలు వెంటనే నీళ్లు తాగించారు. మార్కెట్‌లో ఉండే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆటోలో మొదట ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఎంజీఎంకు తీసుకువెళ్లమని చెప్పడంతో అక్కడికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలిసిన వెంటనే మార్కెట్ అధికారులు, వ్యాపారులు, కార్మికులు వెళ్లి శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి కార్మికులు కోరారు. కాగా, శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామమైన సాగరంకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు అతడి బంధువులు తెలిపారు.

ప్రొఫెసర్ సుజాతపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

దేశ సమగ్రతను దెబ్బతీస్తున్న అర్బన్ నక్సల్స్ : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి

నర్సంపేట టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌పై వ్యంగ్యంగా సోషల్ మీడియా పోస్టులు పెట్టిన శాతావాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ కళ్లఎదుటే భర్తలను కాల్చి చంపి వారి నుదిటి కుంకుమను తుడిచిన ఉగ్రమూకలను మట్టుపెట్టేందుకు దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆపరేషన్ సిందూర్‌ను మహిళల సారథ్యంలో నిర్వహించారన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై యావత్ ప్రపంచమంతా భారత్‌కు మద్దతునిస్తుంటే మహిళగా ఉండి ఎగతాళి చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలిగా ఉంటూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. మార్గదర్శిగా ఉండాల్సిన కొంతమంది ప్రొఫెసర్లు, టీచర్లు దేశ సమగ్రతను దెబ్బతీసే భావాజాలాన్ని కలిగి వుండడం సరైంది కాదన్నారు. సుజాత లాంటి వారి వెనుకాల ఉండి నడిపిస్తున్న కొంత మంది అర్బన్ నక్సల్స్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి దేశ ద్రోహుల వల్ల దేశానికి ఎంతో నష్టమన్నారు. రాష్ట్రంలో అర్బన్ నక్సల్స్ ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, దేశభక్తికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గవర్నర్లుగా, మంత్రులుగా మహిళలకు ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగేలా ఎవ్వరైనా వ్యవహరిస్తే బీజేపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని తగిన గుణపాఠం చెబుతారని రాణిరుద్రమదేవి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం అంజనేయులు, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచందర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల పార్టీ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, ఠాకూర్ చిన్న రవీందర్‌సింగ్, కూనమల్ల పృథ్వీరాజ్, పొదిల్ల రాంచందర్, శ్రీనివాస్, సూత్రం సరిత, జూలూరి మనీష్, కొంకీస విఘ్నేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజ్య హింసను అరికట్టాలి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు



ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.నారాయణరావు

వడ్డెపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్య హింసను అరికట్టి బూటకపు ఎన్‌కౌంటర్లకు స్వస్తి పలకాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు కొనసాగించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ రావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్లు, అప్రజాస్వామిక అణిచివేత, రాజ్య నిర్బంధాన్ని ప్రశ్నిస్తూ ప్రజాస్వామిక వాదులు, మేధావులతో 1973లో ఆవిర్భవించిన పౌర హక్కుల సంఘం ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉందని చెప్పారు. హక్కులు జీవించడానికే అవసరమని, పోరాటంలో భాగంగా సాధించుకున్న హక్కులను రక్షించుకోవడం, హక్కుల ఉద్యమాల కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలపై జరుగుతున్న అణిచివేతను ప్రశ్నించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. కర్రెగుట్టల్లో సాగుతున్న ఆపరేషన్ కగార్‌లో ఆదివాసీలే అసువులు బాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

11న ఉమ్మడి జిల్లా మహాసభలు

హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే పౌర హక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మూడో మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.రమేష్‌చందర్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు బి.సారంపాణి, వెంగళ్‌రెడ్డి, జనగాం కుమారస్వామి, కోడెం కుమారస్వామి, ఓం బ్రహ్మం, శాంత, అవినాష్, ప్రవీణ్, జయంత్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట, మే 8(ఆంధ్రజ్యోతి):కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొన్న ఘటనలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి వయస్సు 65ఏళ్లు ఉంటాయి. తెలుపు బూడిదరంగు చెక్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడిభాగాన పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు 9848779372, 99483 48070 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కైలాస్‌యాదవ్



వరంగల్ స్పోర్ట్స్, మే 8(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖిలావరంగల్‌కు చెందిన భైరబోయిన కైలాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటికే కైలాస్‌యాదవ్ వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం రావడంతో జిల్లా లోని జూడో అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కైలాస్ యాదవ్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్మిస్ట్రేషన్ రిటైర్డ్ జడ్జి పంకజ్‌నక్వీకి, రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో జూడో క్రీడను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకుపోతానని అన్నారు. కాగా, నాలుగేళ్లపాటు కైలాస్‌యాదవ్ పదవిలో కొనసాగనున్నారు.

కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా నరేశ్‌కుమార్



కాజీపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా వడ్డే నవీన్ గురువారం బదిలీపై వచ్చారు. నవీన్ ఇంతకు ముందు మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో పనిచేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన నరేశ్‌కుమార్ ఇంతకుముందు వరంగల్ ట్రాఫిక్ విభాగంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ రాంమూర్తి మామునూరు పోలీస్‌శిక్షణ కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

విద్యార్థుల పరీక్షల దృష్ట్యా హాస్టల్ తెరిచి ఉంచుతాం..

కేయూ క్యాంపస్ మే 8, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల రెండో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు హాస్టల్ తెరిచి ఉంచుతామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ తెలిపారు. మే 20వ తేదీ నుంచి పీజీ కోర్సుల పరీక్షలు ప్రారంభమవుతాయి. మే 30న పీజీ అఖరు సెమిస్టర్ పరీక్షలు ముగుస్తాయన్నారు. కాగా, ఇప్పటికే న్యాయశాస్త్ర కోర్సులు, ఇంజనీరింగ్ విద్యార్థుల హాస్టల్స్‌ను మూసివేశారు. పీజీ రెండో ఏడాది కోర్సుల పరీక్షలు పూర్తికాగానే వర్సిటీ హాస్టల్స్ మూసివేసి విద్యార్థులందరికీ సెలవులు ప్రకటించనున్నారు.

జల్‌హీ శిక్షణకు హాజరైన కమిషనర్



హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అర్బన్ గవర్నెన్స్ ఇన్ఫ్రాస్ట్రర్ డెవలప్‌మెంట్, అస్కీ సంయుక్తాధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన జల్ హీ అమృత్ అటల్ మిషన్ ఫర్ విజువల్స్ కార్యక్రమానికి వరంగల్ నుంచి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. 2.0 కింద ఒక రోజు కార్యక్రమం నిర్వహించారు. జల్‌హీ లక్ష్యంగా జరిగిన కార్యక్రమంలో మురిగునీరు శుద్ధిచేసి పునర్వినియోగం చేసే ప్రక్రియతోపాటు కార్మాగారాల నిర్వహణపై కమిషనర్ శిక్షణ పొందినట్టు వెల్లడించారు. అనంతరం హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లై సివరేజ్ బోర్డు నిర్వహించిన మురుగు నీరు శుద్ధీకణ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పర్యటించారు.

అన్ని రీజియన్ల నుంచి బస్సులు నడుపుతాం..

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్



కాళేశ్వరంలో ఆర్టీసీ పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఈడీ పగిడిమర్రి సోలమన్

మహదేవపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమంలో జరిగే పుష్కరాలకు ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలోని అన్ని రీజియన్ల నుంచి బస్సులు నడుపుతామని ఈడీ పగిడిమర్రి సోలమన్ తెలిపారు. కాళేశ్వరంలోని బస్సు డిపో, పుష్కరఘాట్‌లు, ఆర్టీసీ పార్కింగ్ తదితర ప్రాంతాలలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలందిస్తామని తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి భక్తులకు అందుబాటులో బస్సులను నడిపించాలని తెలిపారు. ఈడీతో పాటు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు భానుకిరణ్, భూపతిరెడ్డి, కరీంనగర్, భూపాలపల్లి, మంథని డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దు

మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



అధికారులతో చర్చిస్తున్న మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

మహదేవపూర్, మే 8(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్, భద్రత పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కాళేశ్వరానికి వచ్చిన ఆయన పోలీసు అధికారులు, సిబ్బందితో గురువారం కలిసి మొదట పుష్కరఘాట్, వీఐపీ ఘాట్ పనులను పరిశీలించారు. సీఎం రాకపోకలు, దర్శనం, పుణ్యస్నానం వివరాలను పోలీసు అధికారులతో చర్చించారు. వీఐపీలు వచ్చే రహదారి పుణ్యస్నానాల ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి బారీ కేడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల వద్ద కర్రలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. సెక్టార్ల వారీగా పార్కింగ్‌లను విభజించి వాహనాలను మళ్లించాలన్నారు. అనంతరం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ ఒక్క అంశంపై పోలీసు దృష్టి ఉండాలన్నారు. అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్ వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండాలని తెలిపారు. అనంతరం భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరేతో పలు అంశాలపై చర్చించారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రొఫెసర్ ఈసం నారాయణకు అరుదైన గౌరవం

సమ్మక్క- సారమ్మ వర్సిటీ లోగో రూపకల్పన కమిటీలో అవకాశం



ఈసం నారాయణకు ఉత్తర్వులు ఇస్తున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ మే 8 (ఆంధ్రజ్యోతి): కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్, కేయూ ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణకు అరుదైన గౌరవం దక్కింది. కేంద్రం ప్రభుత్వం ప్రతిష్మాత్మకమైన ములుగు జిల్లా జాకారంలో ఏర్పాటుచేసిన సమ్మక్క-సారక్క జాతీయ గిరిజన యూనివర్సిటీ లోగో ఏర్పాటు కమిటీలో ఈసం నారాయణను నియమించింది. ఈ మేరకు గురువారం సమ్మక్క-సారక్క ట్రైబల్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ నుంచి లోగో డిజైన్ కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ నారాయణ ఉత్తర్వులు అందుకున్నారు. జాతీయ గిరిజన వర్సిటీ లోగోలో గిరిజనుల సంప్రదాయం, సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తనవంతుగా సహకరం అందిస్తానని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. కాగా తన నియామకపు ఉత్తర్వును కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు తన చాంబర్‌లో అందచేసినట్లు ఈసం నారాయణ వెల్లడించారు.

బాలుడిపై యువకుడి లైంగిక దాడి

10 రోజులుగా గదిలో బంధించి బెదిరింపులు

తండ్రి ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు

వరంగల్ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) వేసవి సెలవుల్లో ఆనందంగా గడుపుతున్న ఓ బాలుడిపై కన్నేసిన ఓ యువకుడు కొద్దిరోజులుగా లైంగిక వేధింపులకు గురిచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడి లైంగిక వేధింపులు తట్టుకోలేని బాలుడు తన తండ్రికి చెప్పడంతో ఈనెల 6న సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు యువకుడిపై పోక్సో ఎస్సీ, ఎస్టీతో పాటు ఇతర సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం..

బాలసముద్రంలో నివాసముంటున్న బాలుడు.. ఇంటి వెనుకాల ఉండే తమ బంధువులు ఇంటికి వెళ్లి అడుకుంటున్నాడు. ఈ క్రమంలో తరచుగా అక్కడికి వచ్చే హనుమకొండ శ్రీనగర్‌కు చెందిన ఎం.డి. ఫైజుల్లా (37) బాలుడిని బెదిరించి కొద్దిరోజులుగా ఓ గదిలో లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఎవరికైనా చెబితే చంపుతానని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేసే బాలుడి తండ్రి.. ఈనెల 6న మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి రాగా, బాలుడు ఏడుస్తూ కనిపించడంతో ఆరా తీయగా జరిగిన విషయం చెప్పాడు. దీంతో బాలుడి తండ్రి ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ ద్వారా పోలీసులను సంప్రదించాడు. దీంతో నిందితుడిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేటి నుంచి వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, మే 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 9నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు కేంద్రాల్లో వేసవి ఉచిత క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఏ ఆదేశాల మేరకు ఏటా అండర్-14, 16, 19, 23 బాలబాలికల విభాగంలో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పరకాల, మహబూబాబాద్, జనగామ జిల్లాలోని యశ్వంతపూర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణాకేంద్రాల్లో అర్హత కలిగిన విద్యార్థులకు నిష్ణాతులైన కోచ్‌ల చేత క్రికెట్ క్రీడలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ 9849570979 నెంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

కుటుంబ కలహాలతో బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



రమ (ఫైల్)

దుగ్గొండి మే 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని స్వామిరావుపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... స్వామిరావుపల్లి గ్రామానికి చెందిన గైకోటి రాములు, నర్సాబాయికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారికి నాలుగు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంపిణీ చేశాడు. పెద్ద కుమారుడు గైకోటి రవికి వివాహం కాగా, కట్నం కింద రవి వారి అత్త మామలు 20 గుంటల భూమిని ఇచ్చారు. ఆ భూమిని రవి తండ్రి రాములు అమ్మి స్వామిరావుపల్లిలో 20 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. రవికి రావవలసిన రెండు ఎకరాలు, కట్నం కింద ఇచ్చిన 20 గుంటల భూమిని పెద్ద కుమారుడు రవి పేర పట్టా చేయడంలో తండ్రి రాములు, తల్లి నర్సాబాయి, సోదరుడు చిరంజీవి, సోదరుడి భార్య రాధ ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో రవి భార్య గైకోటి రమ(46) మనస్తాపం చెంది బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి మృతి చెందింది. మృతురాలి భర్త రవి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా గైకోటి రాములు, నర్సాబాయి, చిరంజీవి, రాధలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కర్రెగుట్టల్లో రక్తపుటేరులు..!

- మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా 'ఆపరేషన్ కగార్'
- నక్సల్స్ మందుపాతరలకు ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసుల మృతి
- కాల్పుల విరమణ, శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపు
- మద్దతుగా ప్రజాసంఘాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ప్రకటనలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

'ఆపరేషన్ కగార్'తో కర్రెగుట్టల్లో నెత్తుటేరులు పారుతున్నాయి. మందుపాతరలతో మావోయిస్టులు, తుపాకీ తూటాలతో పోలీసులు ఒకరిపై మరొకరు దాడులు చేస్తూ పచ్చని అడవులను ఎరుపెక్కిస్తున్నారు. గురువారం ములుగు జిల్లా పెనుగోలు గ్రామ శివారులో చత్తీస్‌గఢ్ సరిహద్దులో లంకపల్లి అడవుల్లో మందుపాతరలు పేల్చి పోలీసులకు మావోయిస్టులు సవాల్ విసిరారు. తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఈ సంఘటన జరిగింది. మందుపాతరలు పేల్చటంతో కూంబింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు సందీప్, పవన్ కల్యాణ్, శ్రీధర్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటే విధుల్లో ఉన్న ఆర్ఎస్ఐ చిలుక రణధీర్ తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, రణధీర్ స్వగ్రామం వరంగల్ మండలం పైడిపల్లి. కాగా, గతంలో పోలీసుల కోసం ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలాయా? లేక పోలీసులు వస్తున్నారని టార్గెట్ చేసి మావోయిస్టులు ల్యాండ్‌మైన్స్ పేల్చారా? అనేది చర్చనీయాంశంగా మారింది. మందుపాతరలకే ఆర్ఎస్ఐ రణధీర్‌కు గాయాలయ్యాయా..? లేక మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో గాయపడ్డారా? అనేది కూడా పోలీసులు అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఆపరేషన్ కగార్‌లో తెలంగాణ పోలీసులు పాల్గొనటం లేదని, ఇటీవల వరంగల్ పర్యటనలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో లంకలపల్లి ల్యాండ్‌మైన్స్ బ్లాస్టింగ్‌లో ముగ్గురు తెలంగాణ పోలీసులు మృతి చెందటం చర్చనీయాంశంగా మారింది.

బాంబుల మోత.. తుపాకుల గర్జన

కర్రెగుట్ట ఆపరేషన్ మొదలైన తరువాత ఏప్రిల్ 24న ముగ్గురు, మే 6వ తేదీన ఒక మహిళ మావోయిస్టు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. 7వ తేదీ బుధవారం 22మందికి పైగా మావోయిస్టులు కర్రెగుట్ట సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. అయితే వీరిలో తెలంగాణకు చెందిన కీలక నేతలు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు పోలీసులు తెలంగాణకు చెందిన వారిగా ప్రకటించలేదు. మే 6వ తేదీన కర్రెగుట్టల్లో మావోయిస్టులు పేల్చిన ప్రెజర్ బాంబుకు ఒక జవాన్ మృతి చెందగా, మరో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. అటు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు, ఇటు ల్యాండ్‌మైన్స్‌కు పోలీసులు రక్తాన్ని చిందిస్తూ.. ప్రాణాలను వదిలేస్తున్నారు. మొత్తంగా ఆపరేషన్ కగార్‌తో జనవరి నుంచి ఇప్పటి వరకు 250మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్ అయ్యారు. దీంతో పచ్చని అడవుల్లో ఆపరేషన్ కగార్ నెత్తుటేరులను పారుతోంది.



కానిస్టేబుళ్ల మృతదేహాలను హెడ్‌క్వార్టర్స్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆపరేషన్ బ్లాక్‌హిల్స్

కర్రెగుట్టలు మావోయిస్టులకు అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతం. గోదావరి ఒడ్డున దట్టమైన అడవులు, కొండలతో ఈ ప్రాంతం ఉంది. చత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రకు కూడా సరిహద్దుగా ఉన్న ప్రాంతం ఇది. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న అంబూజ్‌మడ్‌ను కేంద్ర బలగాలు స్వాధీనం చేసుకోవడంతో మావోయిస్టులు సుమారు 250 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ నల్లగుట్టలను షెల్టర్ జోన్‌గా చేసుకున్నారని భద్రతా బలగాలు భావించాయి. ఈ మేరకు గత నెల 22వ తేదీ నుంచి ఆపరేషన్ బ్లాక్‌హిల్స్‌కు కేంద్ర బలగాలు శ్రీకారం చుట్టాయి. మావోయిస్టు అగ్రనేత, పీఎల్‌జీఏ కమాండర్ హిడ్మాతో పాటు దేవా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్, కంకణాల రాజిరెడ్డి తదితర అగ్రనేతలే లక్ష్యంగా కర్రెగుట్టలను సుమారు 25వేల మంది సీఆర్పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా చుట్టుముట్టాయి. ఈ గుట్టలపైన వేలాది మంది మావోయిస్టులు ఉన్నారని భావించారు. కర్రెగుట్టలపై రెండు దశాబ్దాలకు పైగా మావోయిస్టులు షెల్టర్‌జోన్‌గా చేసుకుని కార్యాకలాపాలు నిర్వహించారు. దీంతో ఈ గుట్టల చుట్టూ మందుపాతరలతో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కర్రెగుట్టలపైకి కేంద్రబలగాలు చేరుకోవటం సవాల్‌గా మారింది. వేసవి కాలం కావటంతో కర్రెగుట్టల్లో అడవులు పలుచపడటం తమకు కలిసి వస్తుందని పోలీసులు భావించారు. దీంతో శాటిలైట్ చిత్రాలు, అత్యాధునిక డ్రోన్లతో మావోయిస్టుల కదిలికలను కనిపెడుతూ గుట్టలపైకి వెళ్లారు. అంతేకాకుండా హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే నిర్వహించి మావోయిస్టుల జాడ కోసం జల్లెడ పట్టారు. గుట్టలపైకి ఎక్కే క్రమంలోనే 150కి పైగా మందుపాతరలను కేంద్రబలగాలు నిర్వీర్యం చేసుకుంటూ వెళ్లినట్లుగా ప్రచారం జరిగింది. ఏప్రిల్ 27న కర్రెగుట్టలపైకి చేరిన భద్రతా బలగాలు మావోయిస్టుల బంకర్‌ను గుర్తించాయి. వెయ్యి మంది ఉండేలా భారీ సొరంగంలో నీటి సౌకర్యం కూడా ఉన్నట్లుగా గుర్తించారు. గుట్టలపై అనేక సొరంగాలు ఉండటంతో భద్రతా బలగాల కూంబింగ్‌ను గుర్తించి, ఇతర ప్రాంతాలకు మకాం మార్చినట్లుగా భావించారు. ఏప్రిల్ 30వ తేదీన పోలీసు బలగాలు కర్రెగుట్టలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తమ ఆధిపత్యాన్ని చాటారు. కర్రెగుట్టలపై బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ల కోసం సెల్ టవర్స్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో మావోయిస్టులకు కర్రెగుట్టలు షెల్టర్ జోన్‌గా మారకూడదనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు. అయితే భద్రతా దళాలు ఊహించినట్లుగా వేలాది మంది మావోయిస్టులు వారికి చిక్కకపోవటం చర్చనీయాంశంగా మారింది.


పవన్‌కల్యాణ్ మృతదేహం


సందీప్ మృతదేహం


శ్రీధర్ మృతదేహం


కర్రెగుట్టలు

చర్చలకు మావోయిస్టులు.. నిర్మూలనకు కేంద్రం

ఆపరేషన్ కగార్ తీవ్రం కావటంతో మావోయిస్టులు కాల్పుల విరమణకు పిలుపునిచ్చారు. బేషరతుగా చర్చలకు సిద్ధమని ప్రకటించారు. కనీసం నెల రోజులైనా కాల్పుల విరమణ ప్రకటించి, తమతో శాంతి చర్చలు జరపాలని పలుమార్లు మావోయిస్టు అగ్రనేతల పేరుతో లేఖలు విడుదల చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం మార్చి 31, 2026లోగా దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని శపథం చేసింది. దీంతో మావోయిస్టుల చర్చల ప్రతిపాదనను పట్టించుకోకుండా ఆపరేషన్ కర్రెగుట్టలను కొనసాగిస్తోంది. మరోవైపు మావోయిస్టుల చర్చల ప్రతిపాదనకు బీఆర్ఎస్ తన రజతోత్సవ బహిరంగ సభలో తీర్మానం చేసింది. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా మావోయిస్టుల కాల్పుల విరమణకు సానుకూలంగా ప్రకటనలు చేశారు. ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘాలు, వామపక్షాలు, ఇతర అనేక సంఘాలు, పార్టీలు మావోయిస్టులతో చర్చలకు సుముఖంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. దీంతో ఆపరేషన్ కగార్ మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

దండకారణ్యంలో పేలిన మందుపాతర

- తెలంగాణ గ్రేహౌండ్స్ ముగ్గురు పోలీసుల మృతి
- మరొకరికి తీవ్రగాయాలు, హైదరాబాద్‌కు తరలింపు
- ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారంటూ ప్రచారం

ములుగు/వాజేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. పచ్చగా ఉన్న అడవులు తుపాకులు, బాంబుల మోతతో దద్దరిల్లుతున్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా పదిహేడు రోజులుగా కేంద్ర బలగాలు జిల్లాలోని కర్రెగుట్టలను చుట్టుముట్టి మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం కూంబింగ్ జరుపుతున్న తెలంగాణ గ్రేహౌండ్స్‌కు ఎదురుదెబ్బలు తగిలాయి. వాజేడు మండల సరిహద్దులోని పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్‌ను రెండు రోజుల నుంచి చేపట్టినట్లు సమాచారం. గురువారం కూంబింగ్ బలగాలను చూసిన మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు సందీప్, శ్రీధర్, పవన్‌కళ్యాణ్ అక్కడికక్కడే మృతిచెందారు. అదే విధంగా కూంబింగ్ బలగాలపై మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో గ్రేహౌండ్స్‌కు చెందిన ఆర్ఎస్సై రణధీర్‌కు బుల్లెట్ గాయమైనట్లు సమాచారం. మృతిచెందిన ముగ్గురు పోలీసులను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు తరలించి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు అంబులెన్స్‌లో తరలించారు. గాయపడ్డ ఎస్సైను హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

8మంది మావోయిస్టులు మృతి అని ప్రచారం

పెనుగోలు-లంకపల్లి మధ్యలో గురువారం జరిగిన మందుపాతర పేలిన ఘటనలో ముగ్గురు పోలీసులు మృతిచెందారు. ఈ క్రమంలో కూంబింగ్ బలగాలపైకి మావోయిస్టులు ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిసింది. మందుపాతర ఘటన నుంచి తేరుకున్న కూంబింగ్ బలగాలు ఎదురుకాల్పులు జరుపుతున్న మావోయిస్టులపైకి కాల్పులు జరపడంతో 8 మంది మావోయిస్టులు మృతిచెందారంటూ ప్రచారం జరుగుతోంది. మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు చంద్రన్న, బండి ప్రకాష్‌లతోపాటు మరో ఆరుగురు దళ సభ్యులు ఉన్నట్లు ప్రచారం జరిగింది. మావోయిస్టులు మృతిచెందిన విషయంపై తెలంగాణ పోలీసులు అధికారికంగా ధృవీకరించలేదు. ఈ విషయంపై పోలీసులు అత్యంత గోప్యతను పాటిస్తున్నారు.


ఎంజీఎం మార్చురీ వద్ద పోలీసులు

మృతదేహాల తరలింపు హైడ్రామా

మృతిచెందిన గ్రేహౌండ్స్ పోలీసుల మృతదేహాల తరలింపు హైడ్రామా చోటు చేసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా మీడియాకు ఈ సంఘటనపై ఎటువంటి సమాచారం కూడా ఇవ్వలేదు. తొలుత మృతదేహాలను ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతం తరలించే విషయంలో హైడ్రామా చోటు చేసుకుంది. రోడ్డు మార్గాన తరలించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ చివరికి హెలికాప్టర్ ద్వారా మృతదేహాలను తరలించారు. అడవి నుంచి తీసుకువచ్చేందుకు వీలుపడకపోవడంతో హెలికాప్టర్‌లో తరలించినట్లు సమాచారం. మీడియా దృష్టిమరల్చేందుకు పోలీసులు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మృతదేహాలను వెంకటాపురానికి తీసుకువస్తారని, వాజేడు గాని పేరూరుకు గాని తరలిస్తారని ముమ్మరంగా ప్రచారం జరిగింది. చివరకు నేరుగా వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

హెలికాప్టర్‌లో మృతదేహాల తరలింపు

- ఎంజీఎంలో కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం
- నివాళులర్పించిన డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు

వరంగల్ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : కర్రెగుట్టలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మృతదేహాలను హెలికాప్టర్ ద్వారా గురువారం మధ్యాహ్నం 2.30ప్రాంతంలో వరంగల్ ఎంజీఎం తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతిచెందిన వారిలో మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్‌కల్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ కానిస్టేబుళ్లు ఉండగా సాయంత్రం 5.30వరకు శవపరీక్షలు పూర్తి చేసి పోలీసు పహారా మధ్య అంబులెన్స్‌ల్లో హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రాష్ట్ర డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలు మృతదేహాలపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాగా, కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన గ్రేహౌండ్స్ ఆర్ఎస్సై చిలుక రణధీర్‌ను మెరుగైన వైద్యం కోసం ఎయిర్ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు.

ఈ సమయంలో మీడియాను పోలీస్‌హెడ్‌క్వార్టర్‌లోకి అనుమతించలేదు. హైద్రాబాద్ డీజీ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువరిస్తున్నామని చెప్పినప్పటికీ పోలీసు అధికారుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో జవాన్ల మరణాలపై భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. కానిస్టేబుళ్లు బాంబులు పేలి మరణించారని కొంత మంది అంటుండగా, సీఆర్‌పీఎస్, గ్రేహౌండ్స్ బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో మరణించి ఉండొచ్చని మరి కొంత మంది అభిప్రాడుతున్నారు. మరి కొంత మంది మావోయిస్టులకు, గ్రేహౌండ్స్ బలగాల మధ్య జరిగిన కాల్పుల్లోనే కానిస్టేబుళ్లు మరణించినట్లుగా అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి శవపరీక్షల్లో ఫైర్ ఆర్మ్ ఇంజ్యూర్‌గా వైద్యులు గుర్తించినట్లుగా తెలుస్తోంది.


ఎంజీఎం మార్చురీ వద్ద పోలీసులు, మీడియా సిబ్బంది


పుష్కరాలకు ప్రత్యేక యాప్

విస్తృత ప్రచారం చేస్తున్న అధికార యంత్రాంగం



కలెక్టరేట్ ఎదుట ఏర్పాటుచేసిన సరస్వతి పుష్కరాల ఫ్లెక్సీ

భూపాలపల్లి కలెక్టరేట్, మే 8 (ఆంధ్ర జ్యోతి): కాళేశ్వరం ముక్తీశ్వర దేవస్థానం సన్నిధిలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి పుష్కరా లపై జిల్లా అధికారయంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహిస్తుంది. పుష్కరాలపై ప్ర జలకు సమాచారం అందించేందుకు అధి కారులు ప్రచార ఏర్పాట్లు చేస్తున్నారు. పు ష్కరాలపై ప్రజలకు మరింత సమాచారం అందించేందుకు సరస్వతీ పుష్కరాలు 2025పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మరాఠి భాషాల్లో యాప్‌లో సమాచారం పొందుపర్చారు. కాళేశ్వరానికి వెళ్లే రూట్ నుంచి వసతి సౌకర్యాలు, ఘాట్ అన్నదానం, వైద్యం, విడిది, రవాణా సౌకర్యానికి సంబంధించిన సమాచారాలను ప్రత్యేకంగా పొందుపర్చారు.కాళేశ్వరంతో పాటు రామప్ప, లక్నవరం, కోటగుళ్లు, బొగత జలపాతంతో పాటు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరా లను సమగ్రంగా అందుబాటులోకి తెచ్చారు. సరస్వతి పుష్కరాలు 2025యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులోకి తెచ్చింది ప్రభు త్వం. యాప్‌తోపాటు హోర్డింగ్స్ సైతం విస్తృత్తంగా ఏర్పాటుచేస్తు న్నారు. ఇప్పటికే భూపాలపల్లి కలెక్టరేట్‌తోపాటు జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రద్దీ ఉన్న ప్రదేశాలతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేయనున్నారు. మహారాష్ట్ర నుంచి ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ తెలుగు, మరాఠీ భాషాల్లో ప్రచారం నిర్వహిం చేందుకు సమయాత్తమవుతున్నారు. పుష్కరాలకు కొద్ది రోజులు మాత్రమే ఉండడంతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయనున్నారు.



సరస్వతి పుష్కరాలు 2025 యాప్

నిరుద్యోగులకు డీట్ యాప్

- ఉద్యోగ సమాచారానికి వేదిక
- పేరు నమోదుతో అరచేతిలో వివరాలు
- ఉమ్మడి జిల్లాలో 22 వేల మంది పేర్లు నమోదు
- బోగస్ కంపెనీలకు చెక్

దరఖాస్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు ఈ యాప్‌లో 22,045 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. హనుమకొండ జిల్లాలో 1,988, వరంగల్ జిల్లాలో 1,736, జనగామ జిల్లాలో 1,050, మహబూబాబాద్ జిల్లాలో 1,562, ములుగు జిల్లాలో 7,034, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8,675 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రతీ పరిశ్రమ ఈ యాప్‌లో తమ కంపెనీ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఖాళీలు, ఉద్యోగాల వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యా సంస్థల్లో పరిశ్రమ అధికారులు యాప్‌పై అవగాహన కల్పించనున్నారు. పరిశ్రమలు చొరవ తీసుకొని నమోదు చేసుకుంటేనే ఈ యాప్‌కు సార్థకత లభిస్తుంది.

హనుమకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులకు అండగా ఒక యాప్ అందుబాటులోకి వచ్చింది. ఉద్యోగ ఖాళీల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌకర్యం దీని ద్వారా సమకూరింది. దాని పేరే డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) యాప్. ఉమ్మడి జిల్లాలో ఈ యాప్ నిరుద్యోగులకు వరంలా మారింది. ఈ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 22 వేల మందికిపైగా యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అరచేతిలో ఉద్యోగ సమాచారాన్ని తెలుసుకునే ఈ యాప్ గురించి అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే మరింత ఎక్కువ మందికి లబ్ధి చేకూరనున్నది. కార్మిక ఉపాధి కల్పన శాఖ ఈ సరికొత్త పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో ప్రత్యేకంగా ఈ మొబైల్ యాప్ వెబ్‌పేజీ తెరిచింది. ఇంతకు ముందు కొన్ని ప్రైవేటు సంస్థలు ఇలాంటి సేవలను అందుబాటులోకి తెచ్చినప్పటికీ అవన్నీ ఖర్చుతో కూడుకున్నవే. ఉద్యోగం వచ్చిన తర్వాత లేదా ఉద్యోగాల జాబితా ప్రచురణకు వెబ్‌సైట్ నిర్వహణ సంస్థకు రుసుము చెల్లించాల్సి వచ్చేది. ఈ యాప్ పూర్తిగా ఉచితం. కంపెనీల్లో ఖాళీల నమోదుకు ఎలాంటి చెల్లింపులు ఉండవు. ఉద్యోగ ప్రయత్నం చేసే అభ్యర్థికి సైతం పూర్తిగా ఉచిత సేవలందిస్తుంది.

బోగస్ కంపెనీల దగా

నిరుద్యోగుల అవసరాలను ఆసరా చేసుకొని బోగస్ కంపెనీలు వారి నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటున్నాయి. నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు, కంప్యూటర్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. బోగస్ కంపెనీలు ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తూ ఆశావహుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. రూ. వందల్లో ఫీజులు చెల్లిస్తూ దరఖాస్తు చేసుకుంటూ మోసపోతున్నారు. బోగస్ కంపెనీలు రూ. లక్షల్లో వసూలు చేస్తూ బోర్డులు తిప్పేస్తున్నాయి. వీటి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధతో కూడిన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. యువత విద్యార్హతల ఆధారంగా సంబంధిత కంపెనీలు ఇంటర్వ్యూలకు పిలిచే యాప్‌ను రూపొందించారు.

పరిశ్రమలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), భారీ తరహా పరిశ్రమలు కలుపుకొని మొత్తం 24,873 ఉన్నాయి. ఇందులో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు 24,077 కాగా, భారీ పరిశ్రమలు 801 ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో 1,988, మహబూబాబాద్ జిల్లాలో 3,709, వరంగల్ జిల్లాలో 4,628, హనుమకొండ జిల్లాలో 11,101, ములుగు జిల్లాలో 888, జనగామ జిల్లాలో 2,564 ఉన్నాయి.



కచ్చితత్వంతో...

డీట్ యాప్, వెబ్‌పేజీల్లో గుర్తింపు ఉన్న కంపెనీల్లో ఖాళీల ప్రదర్శనకు కచ్చితమైన నిబంధనలు పాటిస్తుంది. ఉద్యోగ ఖాళీలున్నట్టు వచ్చే నోటిఫికేషన్ల తాలూకు కంపెనీ పూర్వాపరాలు ముందుగా యాప్ నిర్వాహకులు పరిశీలిస్తారు. మొబైల్ ఫోన్ వెరిఫికేషన్, ఈ-మెయిల్ వెరిఫికేషన్ చేసి క్షేత్ర పరిశీలనాంతరం నిర్ధారణకు వస్తారు. అలా మూడు దశల్లో ఆమోదం పొందిన తర్వాతే ఆ నోటిఫికేషన్లను యాప్, వెబ్ పేజీల్లో ప్రదర్శిస్తారు. ప్రభుత్వ అనుమతి తీసుకొని నిర్వహించే కంపెనీలకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేటు రంగ కంపెనీలైనా సంబంధిత శాఖల సలహాలు, సూచనలు సైతం తీసుకుంటారు. అభ్యర్థులు https///www.tsdeet.comలో లాగిన కావాలి. పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్హత, టెక్నికల్ కోర్సులు, ఇంటి నెంబర్, వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. ఆశిస్తున్న ఉద్యోగ తీరు, తదితర వివరాలు, విద్యార్హత వివరాలను నిక్షిప్తం చేయాలి.

మొబైల్‌కే సమాచారం

కృత్రిమ మేధ యాప్ ద్వారా ఉద్యోగార్థులు పరిశ్రమలతో అనుసంధానమవుతారు. సంస్థల్లోని ఖాళీలు యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుస్తాయి. అభ్యర్థుల విద్యార్హతకు అవసరమైన ఖాళీల సమాచారాన్ని ఫోన్ ద్వారా పంపిస్తారు. దీంతో ఉద్యోగార్థులు నేరుగా పరిశ్రమకు వెళ్లి నిర్దేశించిన ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రైవేటు కంప్యూటర్, కోచింగ్ కేంద్రాల ప్రమేయం లేకుండా కృత్రిమ మేధ సాయంతో ఉద్యోగావకాశాలు వస్తాయి. కొత్త యాప్‌లో పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంది. వాస్తవంగా గతేడాది నవంబర్‌లోనే పోర్టల్‌ను ప్రారంభించగా స్పందన కనిపించలేదు. దీంతో ఇటీవల ఈ కృత్రిమ మేధ యాప్‌ను ప్రవేశపెట్టారు.

ప్రయోజనాలు

ఈ డీట్ యాప్ వల్ల ఉద్యోగావకాశాల కోసం కంపెనీల చుట్టూ తిరిగితే సమయం వృథా అవుతుంది. అక్కడ ఉద్యోగాలున్నా అవి అభ్యర్థి అర్హతలకు సరిపోతాయో ? లేదోనన్న సందేహం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే కంపెనీలు వెబ్ పేజీల ద్వారా నోటిఫికేషన్లు ఇస్తున్నా ఆయా కంపెనీల పేజీలను ఒక్కొక్కటిగా వీక్షించడంతో సమయం ఎక్కువ పడుతుంది. వీటన్నింటినీ అధిగ వించి సులభంగా ఒకే వేదికగా ఉద్యోగాలను చూసుకునే వీలు ఈ యాప్ కల్పిస్తుంది.



ఆపరేషన్ సిందూర్ సాహసోపేతమైన చర్య

వడ్డెపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేతమైన చర్య అని వాకర్స్ అసోసి యేషన్ రాష్ట్ర ప్రతినిధి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన ఇండియన్ ఆర్మీకి సంఘీభావంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ రెగ్యులర్ వాకర్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో గురువారం పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదాచారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సాయిని రవికుమార్, గురజాల రవీందర్, వలస పైడి, కొంగర సారయ్య, కొండం శ్రీకాంత్‌రెడ్డి, వీసం రమణారెడ్డి, యోగా ప్రతినిధులు రోహిణి, రమ్య, మధన్‌మోహన్‌రెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ ప్రతినిధులు


ఎంపీడీవో కట్ల కరుణాకర్ రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

ఆంధ్రజ్యోతి : ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి ఎలా సాగుతోంది?
ఎంపీడీవో : సిబ్బంది ప్రోత్సాహం, లబ్ధిదారుల ఉత్సాహంతో ముందుకు సాగుతోంది.

ఆంధ్రజ్యోతి : పైలెట్ ప్రాజెక్టు పెంబర్తిలో పరిస్థితి ఏంటి?
ఎంపీడీవో : ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ ప్రాజెక్టు పెంబర్తిలో 83 ఇండ్లు ఎంపిక చేశాం. వాటిలో మొదటి దశలో 25 ఇండ్లు లక్ష్యంగా సాగుతోంది.

ఆంధ్రజ్యోతి : పైలెట్ ప్రాజెక్టులో పరిస్థితి ఎలా ఉంది?
ఎంపీడీవో : ప్రస్తుతం 15 ప్రారంభమైనవి, 6 బేస్‌మెట్ లెవల్ పూర్తి కాగా నలుగురికి లక్ష చొప్పున పేమెంట్ చేశాం.

ఆంధ్రజ్యోతి : మిగతా 14 పంచాయతీ గ్రామాల పరిస్థితి ఎలా ఉంది?
ఎంపీడీవో : ఎల్1, ఎల్2, ఎల్3లో 7643 మంది దరఖాస్తు చేసుకోగా 1857 మందిని ఎంపిక చేశాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో మొదటి విడత ఎంత మంది లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించాలనుకుంటున్నారు?
ఎంపీడీవో : మండలంలో మొదటి విడతగా 250 నుంచి 300 మంది లబ్ధిదారులకు ఇండ్లు నిర్మిస్తాం.

ఆంధ్రజ్యోతి : ఒక్కో గ్రామంలో ఎంత మందిని ఎంపిక చేస్తారు?
ఎంపీడీవో : అసెంబ్లీ పోలింగ్ స్టేషన్‌ల వారిగా ఒక్కో అసెంబ్లీ పోలింగ్ బూత్‌ల వారిగా 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

ఆంధ్రజ్యోతి : లక్ష్యాన్ని ఎలా పూర్తి చేస్తారు?
ఎంపీడీవో : హౌసింగ్ డీఈ, పంచాయతీ కార్యదర్శుల క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

ఆంధ్రజ్యోతి : ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపులు ఎలా ఉంటాయి?
ఎంపీడీవో: బేస్‌మెట్ లెవల్ రూ.1లక్ష, రూఫ్ లెవల్ రూ.2లక్షలు, మిగతా రూ.2లక్షలు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన తరువాత చెల్లిస్తాం.

- ఆంధ్రజ్యోతి, హసన్‌పర్తి

ప్రమాదకరంగా అంబాల ప్రధాన రహదారి

- రోడ్డు పైనే ప్రమాదకరంగా మిషన్ భగీరథ గేట్‌వాల్వ్
- ఇటీవల ప్రాణాపాయం నుంచి బయటపడిన బాధితులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

హసన్‌పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని అంబాల ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ ఏర్పాటు చేయడమే ప్రమాదాలకు కారణమని స్థానికుల నుంచి ఆరోపణలు వి నిపిస్తున్నాయి. ఈ ప్రధాన రహదారి ద్వారా కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యాసంస్థల వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉండడంతో నిత్యం ప్రమాదాలతో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ వల్ల ప్రమాదంలో గాయపడిన ఓ కార్పొరేట్ విద్యా సంస్థ యజమాని కుమారుడు కోమాలోకి వెళ్లి ప్రాణాలతో బయటపడినట్టు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కార్పొరేషన్, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాలకు కారణమైన మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ వద్ద రక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.


ఎర్రగట్టుగుట్ట వద్ద రోడ్డు పైన ప్రమాదకరంగా ఉన్న మిషన్ భగీరథ గేట్‌వాల్వ్

ఇటీవలే చిన్నారితో సహా ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు కిట్స్ కళాశాల సమీపంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ వద్ద ఇటీవలే ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పరకాల మండలం సీతనాగారం గ్రామానికి చెందిన బిట్ల శ్రీనివాస్‌తో పాటు 3 సంవత్సరాల చిన్నారి, ద్విచక్రవాహనంపై వెనకాలే కూర్చున్న మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా స్థానికులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్‌తో పాటు మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ వద్ద ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నప్పటికీ ఇటు పాలకులు, అటు అధికారులు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మిషన్‌భగీరథ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇటీవల ప్రమాదాల్లో గాయపడిన వారు


దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

కార్మికులకు వసతులు కల్పించాలి

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం పని ప్రదేశాల్లో యాజమాన్యాలు అన్ని వసతులు కల్పించాలని, యాజమాన్యాలు అందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు సహకరించాలని మాజీ చీఫ్ విప్ ద్యాసం వినయ్‌భాస్కర్ అన్నారు గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ ఎల్‌పీసీ స్లీపర్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మిక మాసోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కంపెనీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కంపెనీ స్థాపన కోసం ప్రజలతో కలిసి కృషి చేశానని చెప్పారు. 1993లో స్థాపించిన కంపెనీ కాలక్రమంలో నష్టాల బాటలో నడిచిందన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ కంపెనీని తెరిపించేందుకు కృషి చేశామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులతో తనకు అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జీఎం గణేష్, ఇన్‌చార్జి సిన్హా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొండపాక రఘు, లోకలబోయిన కుమారస్వామి, రామకృష్ణారెడ్డి, కార్మిక సం ఘం నాయకులు నాయిని రవి, తిరుపతి, రమణాచారి, భిక్షపతి, సురేందర్, సదానందం, సాయిలు, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీధర్, సురేందర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

జూపార్కులో అభివృద్ధి పనులు షురూ

హనుమకొండ టౌన్, మే8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రో డ్‌లోని జూపార్కులో రూ.కోటితో అంతర్గత రోడ్ల నిర్మాణం, బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు గురువారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, జూపార్కు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య తెలిపారు. గురువారం ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్యతో పాటు జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మదన్మోహన్‌రావులు హాజరై, జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బ్లడ్ బ్యాంక్ వద్ద నిర్వహించిన సమావేశంలో డాక్టర్ అప్పయ్య పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. సంబంధిత కుటుంబ సభ్యులు జన్యు పరీక్షలు చేయించుకోవాలని, అంతే కాకుండా మేనరిక వివాహాలు కూడా సరికావని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో తలసేమియా బాధితుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్మోహన్‌రావు, డాక్టర్ నిఖిల, డాక్టర్ గీత, వి.అశోక్‌రెడ్డి, డాక్టర్ దీప్తి, పీహెచ్ఎన్ రామేశ్వరి, కౌముది, ఖాదర్ అబ్బాస్, రమేష్, విప్లవ్‌కుమార్, రాజేశ్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.


ఏనుమాముల మార్కెట్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్

హనుమకొండ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూంలో ఉన్న ఈవీఎంలను త్రైమాసిక తనిఖీలలో భాగంగా గురువారం కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మార్కెట్ ప్రాంగణంలోని గిడ్డంగులు, స్ట్రాంగ్‌రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్‌గార్డుల హాజరు, సమయపాలన రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈవీఎం గిడ్డంగుల వద్ద విధులు నిర్వహించే పోలీస్‌గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సీసీటీవీ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. తనిఖీలో కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.

ఓంకార్ శత జయంతి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

హనుమకొండ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐయూ పార్టీ వ్యవస్థాపక నేత, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి పోస్టర్‌లను ఎంసీపీఐయూ నాయకులు గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 12 వ తేదీన వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లోని ఓంకార్‌స్థూపం వద్ద నిర్వహించే ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు కర్ర రాజిరెడ్డి, నీల రవీందర్, మాస్ సావిత్రి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మనిషికి ప్రత్యక్ష దైవం కన్నతల్లి

ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు మహేశ్‌బాబు

హనుమకొండ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మనిషికి ప్రత్యక్ష దైవం కన్నతల్లి అని ప్రతీ వ్యక్తి మాతృమూర్తులను గౌరవిస్తూ ఆదరించాలని ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకులు గట్టు మహేశ్‌బాబు అన్నారు. నగరంలోని ఆర్యవైశ్య వేడుకల మందిరంలో గురువారం వీఎన్ఆర్ బ్యానర్‌పై నేత్రపర్వంగా మదర్స్‌డే ముందస్తు వేడుకలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రేపాల వీనిలా, బెజుగం నాగరాణి, మర్రి రేణుకల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహేశ్‌బాబు మాట్లాడారు. ఢిల్లీకి రాజైన తల్లికి మాత్రం కొడుకేనని గుర్తు చేశారు. మాతృమూర్తులను గౌరవించని వ్యక్తి సమాజంలో మనుగడ కొనసాగించలేడన్నారు. సుమారు 200 పైగా మాతృమూర్తులను ఈ సందర్భంగా నిర్వాహకులు సంప్రదాయంగా సత్కరించడం విశేషం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళల కోసం ఫన్నీ గేమ్స్ నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చందా భారతి, సింధూజ, వరలక్ష్మి తదితర వైశ్య మహిళలు అతిథులుగా పాల్గొన్నారు. రేపాల వీనీల స్వాగతం పలికారు.

సీసీ కెమెరాల పరిశీలన

హసన్‌పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసం గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్థానిక తహసీల్దార్‌కు చల్ల ప్రసాద్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఇతర సిబ్బందితో కలిసి గురువారం సందర్శించి సమీక్షించారు. డివిజన్ పరిధిలోని 18 సీసీ కెమెరాల కార్యకలాపాలను ప్రత్యేకంగా పరిశీలించి అవి ప్రజల భద్రతకు ఎంతగానో దోహదపడుతున్నాయని గుర్తించారు. భద్రతా పరంగా హసన్‌పర్తిని మరింత అభివృద్ధి చేయడం కోసం మండల పరిధిలో మొత్తం 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తహసీల్దారు సిబ్బందిని కోరారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, కార్పొరేటర్

వరంగల్ ఇన్‌చార్జి బిషప్‌గా విజయపాల్‌రెడ్డి

కాజీపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్యాథలిక్ ఇన్‌చార్జి బిషప్‌గా విజయపాల్‌రెడ్డి నియమించారు. వరంగల్ జిల్లా గీసుకొండ గ్రామానికి చెందిన డి.విజయపాల్ రెడ్డి 1992లో గురువుగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత ఫాతి మా బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, లోడి సంస్థ డైరెక్టర్‌గా సేవలం దించారు. ప్రస్తుతం క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచే స్తున్నారు. ఇంతకుముందు ఈ స్థానంలో ఉన్న ఉడుముల బాల విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా పదోన్నతిపై వెళ్లారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సదిశ ఫౌండేషన్ చేయూత

హసన్‌పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): సదిశ ఫౌండేషన్ పదేళ్లుగా మూడు రాష్ట్రాలలోని ఆరు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు మాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఎంపికచేసి చేయూతనందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్ట కృష్ణవేణి జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులలో అత్యంత ప్రతిభకనబర్చిన వారిని గుర్తించి యేటా 70 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రముఖ కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ జేఈఈ మెయిన్స్‌లో చదివిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 2024 నవంబర్‌లో టెస్టు నిర్వహించగా వరంగల్ జోన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన 9 మంది విద్యార్థులైన సిరిచందన, వరుణ్, నందిని, విష్ణుతేజ, వర్షిత, మనోజ్ఞ, అనూష, పరమేశ్వరి, శ్రీస్మృతలను సదిశ ఫౌండేషన్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ప్రవీణ్, డైరెక్టర్ నవీన్, వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్, రవిలు అభినందించారు. కృష్ణవేణి జూనియర్ కాలేజీలో విద్యార్థులను జాయిన్ చేసినందుకు కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ సదిశ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నిట్, ఐఐటీ లాంటి ఉన్నత విద్యా సంస్థలలో సీటు వచ్చేలా సీనియర్ అధ్యాపకులతో కోచింగ్ ఇప్పిస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు.


విద్యార్థులను ప్రైవేట్ కళాశాలలో చేర్పించిన సదిశ ఫౌండేషన్ నిర్వాహకులు

అంధకారంలో కాలనీలు

వడ్డెపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వివిధ కాలనీల్లో వీధి దీపాలు వెలుగక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. వారంరోజులుగా కాలనీలోని వీధి దీపాలు వెలగడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారి జంక్షన్‌లో సైతం హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్జీవోస్ కాలనీని ఆనుకొని ఉన్న రాఘవేంద్ర నగర్ ఫేస్-1, ఫేస్-2లలో వారం రోజుల నుంచి వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చీకట్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చీకట్లో కుక్కల బెడదను సైతం ఎదుర్కోవాల్సి వస్తోందనీ కాలనీ వాసులు పేర్కొన్నారు.


అంధకారంలో ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీ

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

వడ్డెపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం రక్తం చిందించి సాధించుకున్న నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండలోని గోకుల్ జంక్షన్‌లో దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బరుపట్ల మహేష్, కూస రాజేష్, సురేష్, శారద, అశోక్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్ట్ శంకరయ్య మృతి



కాజీపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వెంపటి శంకరయ్య (55) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం ఉదయం గుండెనొప్పి రావడంతో విష్ణుపురిలోని ఆయన ఇంటివద్దనే కుప్పకూలాడు. శంకరయ్య కొన్నేళ్లుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. శంకరయ్య మరణ వార్తతెలియగానే స్థానిక మీడి యాపాయింట్ సభ్యులు చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన పార్థివదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యు లను సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పాలకవర్గాలపై ఉద్యమించాలి : సీపీఐ

హసన్‌పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతు కూలీల బతుకులతో చెలగాటమాడుతున్న పాలకవర్గాలపై ఉద్యమించాలని ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం రాష్ట్ర సమితి సభ్యుడు నేదునూరి రాజమౌళి అన్నారు. గురువారం జయగిరి గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 26, 27వ తేదీలలో హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించే సీపీఐ మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డితో పాటు జయగిరి నూతన గ్రామ శాఖ కార్యదర్శి గడ్డం చంద్రమౌళి, సహాయ కార్యదర్శులు నన్నెబోయిన జంపయ్య, పిట్టల రవి, రేణిగుంట్ల ఎల్లస్వామి పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న సీపీఐ నాయకులు



కంచి పీఠానికి నవ శకం

ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారయోః అలౌకికముపాయం యో వేదయతి స వేదః...

మంచిని పెంపొందించడానికి, చెడును తొలగించడానికి అలౌకికమైన ఉపాయాన్ని తెలియజేసేది వేదం. వేదాలు భగవత్ప్రాప్తికి సోపానాలైన కర్మలనే కాకుండా... లౌకిక జీవితానికి తోడ్పడే సదాచారమనే ధర్మాన్ని కూడా బోధిస్తున్నాయి. అసలు వేదమంతా ధర్మాన్ని మాత్రమే ఉపదేశిస్తోందంటూ 'వేదోఖిలో ధర్మమూలమ్' అని ఋషులు నిర్ణయం చేశారు. అటువంటి వేద జ్ఞానం భారతదేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రభావితం చేసింది. ఈ జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసింది. అందుకనే భారతదేశం 'వేదభూమి'గా, 'యోగభూమి'గా, 'కర్మభూమి'గా పిలుపులు అందుకుంటోంది.

మోక్షపురి... కాంచీపురి

ఈ యుగంలో దేశం నలుమూలలకూ సంచారం చేసి తన ఉపదేశాల ద్వారా, రచనల ద్వారా ధర్మాన్ని వ్యాప్తిచేసిన జగద్గురువు ఆది శంకరులు. జగత్తు ఉన్నన్ని రోజులు ఆయన బోధలు వ్యవహారంలో ఉంటాయి. ఆయన అపురూప సృష్టి... మఠాల స్థాపన. దక్షిణంలో శృంగేరి శారదా పీఠం, తూర్పున జగన్నాథ పూరీలో గోవర్ధన మఠం, పశ్చిమంలో సముద్ర తీరాన ద్వారకలో కాళికా మఠం, ఉత్తరాన బదరీనాథ్ సమీపాన జ్యోషిమఠ్ ఏర్పాటు చేశారు. ఆది శంకరులు తన అవతార సమాప్తి సమయాన... కాంచీపురంలో కామకోటి పీఠాన్ని నెలకొల్పి, ఆ క్షేత్రంలోనే శివైక్యం చెందారని తెలుస్తున్నది. కాంచీపురి మోక్షపురిగా వెలసింది. కంచి శివ క్షేత్రమూ, విష్ణు క్షేత్రమూ కూడా. కామాక్షీ విగ్రహం బిందు స్థానంగా అనేక ఇతర దేవాలయాలను కూడా ఆది శంకరులు నిర్మింపజేశారు. ఈ మఠాల నిర్వహణ నియమాలన్నీ శ్రీ శంకరులు చెప్పగా సుధన్వుడు రాసుకొని 'మహానుశాసనం' అనే పేరుతో గ్రంథం తయారు చేశాడు. ఆసక్తి రేకెత్తించే మరొక అంశం మనకు కాచీపురంలోని వరదరాజస్వామి వారి దేవాలయంలో దర్శనమిస్తోంది. 'కుడియాంతన్‌దళం' అనే గ్రామానికి 'శంకరాచార్యపురం', అలాగే 'సురుట్టిల్' అని పేర్లు ఉన్నట్టు అక్కడి శాసనాల అధ్యయనం వెల్లడయిన విషయాన్ని 1919లో ప్రచురితమైన ఒక నివేదిక పేర్కొంది. అలాగే క్రీస్తుశకం 1507 నాటి శ్రీవీర నరసింహదేవ కాలానిదైన రాగి రేకులోని వివరాల ప్రకారం... 'కుడియాంతండలం' అనే ప్రదేశాన్ని అప్పటి పీఠాధిపతి శ్రీ మహదేవ సరస్వతికి ఆనాటి విజయనగర ప్రభువు బహూకరించినట్టు తెలుస్తున్నది. ఆ గ్రామం... సురుట్టిల్‌కు పశ్చిమ దిక్కులో ఉంది. ఇంత ప్రాచీనత ఉన్న ఈ మఠ కార్యక్రమాలు ఇప్పుడు మన దేశంలోనే కాదు... అన్ని ప్రపంచ దేశాలకు విస్తరించాయి. ధార్మిక సేవలు నిర్వహిస్తూ, భక్తులకు మార్గ దర్శనం చేస్తున్నాయి.

సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రానికి

కాగా... ఈ ఏడాది ఏప్రిల్ 30న, శ్రీ ఆది శంకరుల 2534వ జయంతిని పురస్కరించుకొని... దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ్ ద్రావిడ్‌కు సన్యాస దీక్షను ప్రస్తుత కంచి పీఠాధిపతి అనుగ్రహిస్తున్నట్టు పీఠం శ్రీకార్యం (కార్యనిర్వహణాధికారి) గత నెల 25న ప్రకటించారు. వేదాధ్యయనం, శాస్త్ర పరిచయంలో శిష్య స్వామి అసమాన ప్రతిభ గురించి కూడా ఆయన ఆ ప్రకటనలో వెల్లడించారు. దీక్షా ప్రదానం రోజున చేసిన ఏర్పాట్లు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. దీనికోసం ఎంపిక చేసిన ముహూర్తం అద్వితీయం. గురువు సమక్షంలో... శిష్యస్వామి ఎలాంటి జంకు లేకుండా, పంచభూతాల సాక్షిగా "ఓం సన్యస్తం మయ" అని ప్రకటన చేయగానే... భక్తుల ఆనందాతిశయం మిన్నంటింది. బ్రహ్మచర్యం నుంచి సన్యాస దీక్షకు సిద్ధమైన ఆ బాల 'పెరియవ' (స్వామి) వదనంలో శంకరుల దీక్షను దర్శించినవారికి... ఉత్తమానంద స్థితి అక్కడే సిద్ధించింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించాలి. వరాలకు వ్రతాలకు సంబంధం ఉంది. అన్నవరంలో శ్రీసత్యనారాయణ వ్రతం చేస్తే వరాలు లభిస్తాయని పేర్కొంటూ, సత్యవ్రతం పాటించకపోతే వచ్చే కష్టాల గురించి వ్రత కథ చెబుతోంది. అలాగే ముక్తికి, సత్యవ్రతానికి ఉన్న విడదీయరాని సంబంధాన్ని 'చాందగ్యోపనిషత్తు' వివరించింది. కాంచీపురిలో సత్యవ్రతేశ్వరుడి ఆలయం ఉంది. ఆ ఊరికి 'సత్యవ్రత క్షేత్రం' అనే పేరు ఉంది. శ్రీ కంచి కామకోటి మఠం బిరుదావళిలో... సత్యవ్రత నామాన్ని 'కాంచి దివ్య క్షేత్ర' అని చెప్పడం జరిగింది. మహా సామ్రాజ్యాన్ని ఇచ్చినా కంచి క్షేత్ర వాసులు సత్యాన్ని విడనాడరని నాయనార్లు కీర్తించారు. అన్నవరం సత్యనారాయణ క్షేత్రం నుంచి సత్యవ్రత క్షేత్రమైన కంచికి వచ్చి సన్యాసం స్వీకరించిన శిష్య స్వామి నామం ముందు 'సత్యం' అని చేర్చడం ఎంతో సమంజసంగా ఉంది. అంతేకాదు... 'కచటపాది విధానం'లో 'సత్య' అనే పదం 71ని సూచిస్తుంది. శ్రీశిష్య స్వాములు కంచి కామకోటి పీఠాన్ని 71వ అధిపతిగా అధిష్ఠించబోతున్నారు. 'నడిచే దైవం'గా జగత్ ప్రసిద్ధి చెందిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు... ప్రస్తుత స్వామి వారికి 'శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి' అని నామకరణం చేశారు. వారి సత్యవ్రతం సర్వజన విదితం. ఆయన నామధేయానికే 'సత్యం' అనే విశేషణాన్ని అలంకరించి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి'గా ... శిష్య స్వామికి ప్రస్తుత పీఠాధిపతి నామకరణం చేయడం ముదావహం.

ఆద్యంతం నేత్రపర్వం

ఈ దీక్షా స్వీకారోత్సవం జరిగిన ప్రదేశ విశిష్టతను క్లుప్తంగా తెలుసుకుందాం. అంబికకు 'లలితా త్రిశతి'లో 'కామకోటి నిలయ' అనే పేరు ఉంది. ఇక్కడ ఆ తల్లి... గురురూపిణి, బ్రహ్మవిద్యా స్వరూపిణి. ఆమె ఆకాశరూపంలో వ్యాప్తి చెంది ఉంది. ఆమె 'ఈషణాత్రయా'న్ని (ధనేషణ, పుత్రేషణ, లోకేషణ) హరింపజేస్తుంది. శిష్య స్వాములకు అద్వైత ప్రతిపాదకాలైన మహా వాక్యాల ఉపదేశం ఆ దేవాలయంలోని పంచగంగ సరస్సు తీరంలో జరిగింది. కంచి కామకోటి పీఠంలో నాలుగు మహావాక్యాలను బోధించడం ఒక విశిష్టత. గురుశిష్యుల కలయిక సమయంలో... పక్షులు తమ కిలకిలారవంతో... ఆ రూపంలో విహరిస్తున్న దేవతలుగా కనిపించడం అపూర్వ సాక్ష్యం. అలాగే శిష్యుని శిరస్సుపై సాలగ్రామాన్ని గురుస్వామి ఉంచి అభిషేకించినప్పుడు... అన్నవరంలో కుంభవృష్టి కురవడాన్ని యాదృచ్ఛికంగా భావించలేం. శిష్య స్వామి సన్యాస దీక్ష కార్యక్రమం సందర్భంగా... కనీసం 10 వేల మంది ఆ సరస్సు దగ్గర ఆశీనులయ్యారు. కాంచీపుర వీధుల నిండా భక్తజన సందోహం కనిపించింది. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రార్థనలు అందజేసి, ఈ దీక్షా కార్యక్రమం మహత్తును కొనియాడారు. శ్రీ స్వామివారిని గుజరాత్ రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించారు. అనేకమంది ప్రముఖులు హాజరైన ఈ వేడుకకు... తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి భక్తునిగా రావడం విశేషం. "బాసర అమ్మవారికి అమూల్యమైన సేవలు అందించిన శిష్య స్వామి... పీఠాన్ని అధిష్ఠించడం తెలంగాణ ప్రజలందరికీ సంతోషదాయకం, గర్వకారణం" అని తన ఆనందాన్ని వ్యక్తపరచిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యులు.

• లంక వేంకట సుబ్రహ్మణ్యం
పూర్వ శ్రీకార్య నిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

పుష్కర సరస్వతి

సమాచారం

నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మనది. మన జీవన అవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు... ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు... పన్నెండేళ్ళకు ఒక్కోసారి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది ప్రత్యేకత. ఋగ్వేదంలో, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్త నదుల్లోనూ సరస్వతికి విశిష్ట స్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... *గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ... నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు...* అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది మే 15 నుంచి 26వ తేదీ వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.



ఎక్కడ?: సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బదరీనాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామంలో పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది... అలకనంద నదికి ఉపనది. కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా... ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్‌లోని పుష్కర్‌లో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.

కాళేశ్వరంలో ప్రతిష్ఠాత్మకంగా...

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం... సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 నుంచి 26 వరకు జరిగే పుష్కరాల్లో భాగంగా... శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో నిత్యం వివిధ హోమాలను నిర్వహిస్తారు. అలాగే ప్రధాన ఘాట్ వద్ద నదీ హారతి కార్యక్రమం ఉంటుంది. శ్రీ మాధవానంద సరస్వతి, శ్రీ పరిపూర్ణానంద స్వామి, శ్రీ సచ్చిదానంద సరస్వతి, శ్రీ విద్యాశంకర భారతి, ఆచార్య సంవిదానంద సరస్వతి మహరాజ్, శ్రీ జగద్గురు విద్యారణ్య భారతి, శ్రీ యోగానంద సరస్వతి తదితర ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ పుష్కరాలకు హాజరై ప్రార్థనలు చేస్తారు, అనుగ్రహభాషణలు చేసి, భక్తులకు ఆశీస్సులు అందజేస్తారు. పుష్కరాల కోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలతో సహా పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ మహా సరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీప ఆలయాల సందర్శించుకోవచ్చు.

గీతాసారం

సమత్వమే యోగం

మానవుల బుద్ధి నిశ్చయాత్మకంగా ఉండాలని, అలా లేనివారి బుద్ధి బహు శాఖలుగా (అనేక భేదాలతో) ఉంటుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. "సమత్వమే యోగం" అని కూడా అన్నాడు. జీవితంలో మనం ఎదుర్కొనే సుఖం-దుఃఖం, గెలుపు- ఓటమి, లాభం-నష్టం లాంటి ధ్రువాల కలయిక ఇది. ఈ ధ్రువాలను అధిగమించే మార్గం కర్మయోగం. అది చివరకు నిశ్చయాత్మకమైన బుద్ధిగా మారుతుంది. సమతుల్యత లేని బుద్ధి మన మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తుంది. సుఖం, విజయం, లాభం పొందినప్పుడు... మనశ్శాంతి దానికదే కలుగుతుందని మనం అనుకుంటాం. కానీ కర్మయోగం ద్వారా వచ్చే నిశ్చయాత్మకమైన బుద్ధి... ద్వంద్వాలను అధిగమించడానికి సాయపడుతుందని, అదే మనకు మనశ్శాంతిని ఇస్తుందని కృష్ణుడు చెబుతున్నాడు.

అస్థిరమైన బుద్ధి వివిధ పరిస్థితులను, ఫలితాలను, వ్యక్తులను భిన్నంగా చూస్తుంది. మనం పనిచేసే కార్యాలయంలో మనం కింది ఉద్యోగులకు ఒక కొలమానాన్ని, మన పై అధికారులకు మరొక కొలమానాన్ని వర్తింపజేస్తాం. కుటుంబాల్లో భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు వివిధ ప్రమాణాలను అనుసరిస్తాం. మనకు ఇష్టమైన వారి కోసం ఒక నియమం, ఇతరుల కోసం మరొక నియమం పాటించడాన్ని గమనించే పిల్లల్లో... సమత్వం అభివృద్ధి చెందడం కష్టమవుతుంది. దైనందిన జీవితంలో మనం కులం, మతం, మూఢనమ్మకాల లాంటి వాటి ప్రభావానికి గురవుతూ ఉంటాం. ఎదుగుతున్న దశలో... మన మనస్సుల మీద వాటి ముద్ర పడుతుంది. అవి మనల్ని విభజిస్తాయి. ఈ విభజనలు అన్ని వైపుల నుంచి మనల్ని ప్రభావితం చేస్తాయి. బుద్ధి అస్థిరంగా ఉన్నప్పుడు... మన తప్పులను గుర్తించడానికి ఒక కొలమానం, ఇతరుల తప్పులు ఎంచేటప్పుడు మరొక కొలమానం అనుసరిస్తాం. మనం సాయం కోరుతున్నప్పుడు ఒకలా సాయం చేస్తున్నప్పుడు మరోలా ఉంటాం. దీన్ని నివారించడానికి, కర్మయోగ మార్గాన్ని అనుసరించాలి. అప్పుడు నిశ్చయాత్మకమైన బుద్ధి కలుగుతుందని, మనశ్శాంతికి పునాది అయిన సమత్వాన్ని సాధించే యోగ్యత పొందుతారని శ్రీకృష్ణుడు ఉపదేశిస్తున్నాడు.



కె.శివప్రసాద్



'మిస్ వరల్డ్'కు సర్వం సిద్ధం

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి.. రేపటి నుంచి పోటీలు

హైదరాబాద్/ గచ్చిబౌలి, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మిస్‌వరల్డ్ పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపుగా పూర్తయినట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచ నలుమూలల నుంచి ఇప్పటికే 109 దేశాలకు చెందిన పోటీదారులు, ప్రతినిధులు, ఆహ్వానితులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. మరికొంత మంది మరో రెండు రోజుల్లో వస్తారని మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. వీరికి తోడు మిస్ వరల్డ్ సంస్థ నుంచి 28 మంది నిర్వహణా ప్రతినిధులు, 17 మంది సహాయకులు వచ్చారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారులు సుమారు 80 మంది గురువారం గచ్చిబౌలి స్టేడియానికి చేరుకొని రిహార్సల్స్ చేశారు. అందాల భామలు స్టేజ్‌పై తమ నడకలతో, నవ్వులతో, ఆకర్షణీయ కాస్ట్యూమ్స్‌తో రిహార్సల్స్‌తో అలరించారు.

ఓల్డ్ సిటీలో హెరిటేజ్ వాక్...

హైదరాబాద్ నగర సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో మిస్ వరల్డ్ పోటీదారులతో మే 13న చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌ను నిర్వహించనున్నారు. చార్మినార్‌కు పశ్చిమభాగంలో విస్తరించిన లాడ్‌బజార్‌లో సంప్రదాయ లక్కగాజులు ఇతర కళాత్మక వస్తు సామగ్రిని ఉత్పత్తి చేసి విక్రయించే స్థానిక కళాకారులతో మిస్ వరల్డ్ పోటీదారులు సంభాషించనున్నారు. ఈ హెరిటేజ్ వాక్ కార్యక్రమం సుమారు 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ సందర్భంగా చారిత్రక చార్మినార్ కట్టడం, లాడ్ బజార్ ప్రత్యేకతలను వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్‌గా ప్రమోట్ చేయనున్నారు. కాగా, ప్రకృతి, పర్యావరణ పరంగా అన్ని హంగులు ఉన్న తెలంగాణను పర్యాటక రంగంలో ముందు వరుసలో నిలిపే లక్ష్యంతో 'తెలంగాణ-జరూర్ ఆనా..' నినాదాన్ని విస్తృత స్థాయిలో ప్రపంచ వ్యాప్తం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పర్యాటకరంగం పెరగటం, పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశిస్తోంది. మే 31 వరకు కొనసాగే మిస్‌వరల్డ్ కార్యక్రమాల్లో సాధారణ ప్రజలను కూడా పరిమిత సంఖ్యలో భాగస్వామ్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. టూరిజం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ (https://tourism.telangana.gov.in/eventssingle/missworldevent) చేసుకున్న వారికి ఐదు కేంద్రాల్లో వేయి మంది చొప్పున మొత్తం ఐదువేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

కట్టుదిట్టమైన భద్రత

మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. గురువారం ఆయన 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీదారులు బస చేస్తున్న హోటళ్ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఎక్కువ మంది బస చేస్తున్న ట్రిడెంట్ హోటల్ వద్ద నాలుగంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీవీఐపీ కేటగిరీని బట్టి వారు బస చేస్తున్న పరిసరాలను గ్రీన్‌జోన్, రెడ్ జోన్‌గా విభజించామని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలకు వివిధ దేశాలకు చెందిన అతిథులతో పాటు, దేశంలో సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు సెలబ్రెటీలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ట్రాఫిక్ మళ్లింపులు ఉండవని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

అందంతో కీర్తి.. మహిళల్లో స్ఫూర్తి

మిస్ వరల్డ్ విజేతలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నారు

- తెలంగాణకు గొప్ప సాంస్కృతిక వారసత్వం
- ఇక్కడి ప్రజల ఆతిథ్యం నన్నెంతో ఆకర్షించింది
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్ చైర్‌పర్సన్, సీఈవో జూలియా మోర్లీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): 'అందాల పోటీలు కేవలం అందాన్ని ప్రదర్శించడానికి కాదు.. అందమైన విజయాలు సాధించడానికి, మహిళలకు అందమైన స్ఫూర్తి కలిగించడానికి, సంతోషాలతో కూడిన అందమైన ప్రపంచాన్ని సృష్టించడానికి'.. అని మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్, సీఈవో జూలియా మోర్లీ అన్నారు. తెలంగాణ వేదికగా జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో సేవారంగంలో ప్రపంచానికి ఒక మంచి సందేశం ఇవ్వనున్నామని, తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లనున్నామని చెప్పారు. ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకంగా జరిగే అందాల పోటీలకు గత 25 ఏళ్లుగా చైర్‌పర్సన్‌గా ఉన్న జూలియా.. శనివారం నుంచి 72వ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణను ఎంపిక చేయడం వెనక కారణం?

72వ మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు తెలంగాణను ఎంచుకోవడం గర్వంగా, సంతోషంగా ఉంది. ఇక్కడి సాంస్కృతిక వారసత్వం ఎంతో చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది. భిన్న మతాలు, సంస్కృతుల సమ్మేళనమైన తెలంగాణలోని ప్రజల హృదయపూర్వక ఆతిథ్యం నన్ను ఎంతో ఆకర్షించింది. తరతరాలుగా కొనసాగుతున్న చేనేత లాంటి కళలు ఈ రాష్ట్రం ప్రత్యేకత. ఇక్కడ శతాబ్దాల చరిత్ర ఉన్న అత్యంత సుందరమైన వారసత్వ కట్టడాలున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన ఆలయాలున్నాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో హైదరాబాద్ అంతర్జాతీయ ప్రముఖ నగరాలతో పోటీపడుతోంది. ఇలాంటి ఎన్నో విశేషాలున్న తమ రాష్ట్రం గురించి ప్రపంచానికి తెలపాలని ఇక్కడి ప్రభుత్వం ఎంతో పట్టుదలతో ఉంది. ఇలాంటి చారిత్రక నగరంలో పోటీలు నిర్వహించడం, ఇందులో మేమంతా భాగస్వామ్యం కావడం గర్వంగా భావిస్తున్నాను. మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణను ఎందుకు ఎంచుకున్నారని (వై ఇన్ తెలంగాణ? అని) చాలామంది నన్ను ప్రశ్నిస్తున్నారు. వారందరికీ నా సమాధానం ఒక్కటే.. 'వై నాట్ తెలంగాణ'!

భారత్ ప్రదర్శన ఎలా ఉంటోంది?

ఇండియా అంటే వ్యక్తిగతంగా నాకు ప్రత్యేక ఆసక్తి. ప్రపంచంలో ఏ దేశంలో లేని భిన్నత్వం ఇక్కడ కనిపిస్తుంది. అందంలోనే కాదు అన్ని రంగాల్లో ఇక్కడి మహిళలు ప్రపంచంపై తమ ముద్ర చూపుతున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లోనూ భారత్ తన ప్రత్యేక ముద్ర చాటుతోంది. తొలిసారి 1966లో మిస్ వరల్డ్ కిరీటం కైవసంతో భారత్ పేరు మార్మోగింది. ఇప్పటివరకు ఈ దేశ యువతులు ఆరుసార్లు ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకున్నారు. అందాల పోటీల్లో పాల్గొనడమే కాదు.. నిర్వహణలోనూ ఇప్పుడు భారత్ ప్రత్యేకత సాధించింది. బ్రిటన్ తర్వాత వరుసగా రెండుసార్లు మిస్ వరల్డ్‌కు ఆతిథ్యమిచ్చిన దేశంగా భారత్ పేరు నిలిచిపోతుంది.

మిస్ వరల్డ్ పోటీలు మహిళల్లో ఎలాంటి మార్పులు తీసుకొచ్చాయి?

72 ఏళ్లుగా సాగుతున్న ప్రయాణంలో ప్రపంచ మహిళలకు మిస్ వరల్డ్ ఎన్నో విజయాలు అందించింది. మహిళా సాధికారత ఏమాత్రం లేని అత్యంత పేద, నిరక్షరాస్య దేశాల నుంచి కూడా యువతులు ఈ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. తమ దేశాల్లో మార్పునకు శ్రీకారం చుట్టారు. ఆఫ్రికన్ దేశాలైన నైజీరియా, బోట్స్‌వానా నుంచి విజేతలుగా గెలుపొందిన యువతులు.. తమ దేశంలోని యువతులు, మహిళలకు ఆదర్శంగా నిలిచారు. అక్షరాస్యత పెరుగుదల, బాలికల విద్య, మహిళా సాధికారతకు కృషి చేసి అక్కడి ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ప్రతి మిస్ వరల్డ్ విజేత ప్రపంచాన్ని ప్రభావితం చేయాలన్నది, ప్రపంచ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నది మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ లక్ష్యం. అందుకే ఏటా విజేతలను ప్రపంచ అంబాసిడర్‌గా నియమించి పలు దేశాల సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా చేస్తాం.

ఈసారి ప్రత్యేకత?

అందాల పోటీలంటే శారీరక సౌందర్యం మాత్రమే కాదు.. సమాజం పట్ల బాధ్యత, సమస్యల్లో ఉన్న వర్గాలకు చేయూత అందించడం మిస్ వరల్డ్ సంస్థగా మా కీలకమైన బాధ్యత. పోటీలు నిర్వహించే ప్రదేశం నుంచి ప్రపంచానికి ఓ శక్తిమంతమైన సందేశం పంపాలన్నదే మా లక్ష్యం. దీంట్లో భాగంగానే.. గొప్ప సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి 'హ్యూమానిటేరియన్ అవార్డ్' కూడా ప్రకటిస్తున్నాం. గత ఏడాది ముంబైలో జరిగిన 71వ మిస్ వరల్డ్ పోటీల్లో రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీకి అవార్డు ప్రదానం చేయగా.. ఈసారి సూద్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ నటుడు సోనూసూద్‌కు అందిస్తున్నాం. కొవిడ్ సమయంలో సోనూసూద్ చేసిన సేవా కార్యక్రమాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలకు సూద్ ఫౌండేషన్ ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిపిస్తూ వారిని ఆదుకుంటోంది. ప్రపంచం అంతా మిస్ వరల్డ్ పోటీలను తిలకిస్తుంది.

గ్రూప్-1 పేపర్లపై వెల్డర్ సంతకం!

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల పత్రాల మూల్యాంకనం కేసు దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఓ వెల్డర్ పేరునూ అక్రమాలకు వాడుకున్నారు. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం పేరిట జరిగిన తంతులో గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన ఒక వెల్డర్‌ను వివిధ పనులకు ఉపయోగించుకున్నారు. స్ట్రాంగ్‌రూంలో ఉన్న పేపర్లను తీసుకురావడం, వాటిని గోనె సంచుల్లో పెట్టి తిరిగి స్ట్రాంగ్‌రూంకు మోసుకెళ్లడం వంటి పనులు ఆయన చేశారు. నిబంధనల ప్రకారం ఏపీపీఎస్సీ గుర్తించి, ప్రభుత్వ వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లతో మాత్రమే ఈ పేపర్లు మూల్యాంకనం చేయించాలి. ప్రతి పేపర్ వెనుక దాన్ని దిద్దిన ప్రొఫెసర్ పేరు, హోదా రాయాల్సి ఉంటుంది. అయితే ఆ స్థానంలో వెల్డర్‌తో, ప్రైవేటు టీచర్‌తో, గర్భిణి అయిన గృహిణితో సంతకాలు చేయించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ చిరునామాలను పట్టుకుని విచారణకు వెళ్తే సంతకాలు చేసిన వారి అసలు హోదాలు బయటపడుతుండటంతో అధికారులు విస్తుపోతున్నారు. హాయ్‌ల్యాండ్‌లో నాడు జరిగిన వ్యవహారాల్లో పాత్ర ఉన్న వారందరినీ దర్యాప్తు అధికారి ఏబీజీ తిలక్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు విచారిస్తున్నాయి. 2020 డిసెంబరులో గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించారు. డిజిటల్ మూల్యాంకనం అనంతరం ఫలితాలు విడుదల చేశారు. దీనిపై కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో డిజిటల్ మూల్యాంకనాన్ని రద్దు చేసి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోర్టు ఆదేశించింది. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతో కమిషన్ కార్యాలయం నుంచి గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను అక్రమంగా హాయ్‌ల్యాండ్‌కు తరలించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు సతీశ్ కూడా పాల్గొన్నారు. తనకు రోజుకు రూ.2వేలు చొప్పున ఇస్తున్నారని చెప్పి నందిగామ నుంచి మరో ఐదుగురిని కూడా అతను హాయ్‌ల్యాండ్‌కు తీసుకెళ్లినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కాగా, నిబంధనల ప్రకారం ఒకసారి ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసిన తర్వాత వాటిని పునఃపరిశీలించాలి. దీన్నే రీచెక్ అంటారు. ఈ పనిని ఏపీపీఎస్సీ సిబ్బంది చేశారు. రెండోసారి మూల్యాంకనం చేయని పత్రాలపై పునఃపరిశీలన జరిగినట్టుగా కమిషన్ ఉద్యోగులు సంతకాలు చేసి, స్టాంపులు వేశారు. ఈ విధంగా చేసిన ఐదుగురికి త్వరలోనే సంకెళ్లు వేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు.



నవ్వించడమే సింగిల్ లక్ష్యం


- శ్రీవిష్ణు

'మొదటి నుంచి చివరి వరకూ ప్రేక్షకుల్ని నవ్వించాలనే లక్ష్యంతో తీసిన సినిమా 'సింగిల్'. కథ, స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది. ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది' అని శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు.

● ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే ప్రేమకథా చిత్రమిది. ముక్కోణపు ప్రేమకథలతో ఇప్పటివరకూ చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఇందులో దర్శకుడు సరికొత్త కోణంలో కథను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. యువతకు చాలా బాగా నచ్చుతుంది. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది.

● గీతా ఆర్ట్స్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా. కార్తీక్ రాజు కథ చెప్పినప్పుడు మంచి ఎంటర్‌టైనర్ అవుతుందనిపించింది. వెన్నెల కిశోర్ ముఖ్య భూమిక పోషించారు. ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. సినిమాను పూర్తిగా హైదరాబాద్‌లో చిత్రీకరించాం. ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌ని ఇంత కొత్తగా ఎవరూ చూపించలేదు. విశాల్ చంద్రశేఖర్ హై ఎనర్జిటిక్ సాంగ్స్ ఇచ్చారు. వేల్‌రాజు సినిమాటోగ్రఫీలో హైదరాబాద్‌ని కొత్తగా చూడబోతున్నారు. కేతిక శర్మ, ఇవానా నటన ప్రేక్షకులను అలరిస్తుంది. వారి పాత్రల్లోని భిన్న ఛాయలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతాయి.

చిరునవ్వులు చిందిస్తూ...



నాగార్జున, ధనుశ్ ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్‌రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రధాన పాత్రధారుల ఫస్ట్‌లుక్ పోస్టర్లు, ఫస్ట్ సింగిల్ 'పోయిరా మామా' సినిమాపై అంచనాలను పెంచేశాయి. తాజాగా, ఈ సినిమా నుంచి ధనుశ్, రష్మిక కలసి ఉన్న స్టిల్‌ను విడుదల చేశారు మేకర్స్. చిరునవ్వులు చిందిస్తున్న ఈ ఇద్దరి లుక్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. జూన్ 20న సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.
















యుద్ధ బీభత్సం!



కరాచీ పోర్టు వద్ద చెలరేగిన మంటలు

పాకిస్థాన్‌కు చావు దెబ్బ!

(మొదటిపేజీ తరువాయి)

దిగింది. అరేబియా సముద్రంలో ఉన్న ఐఎన్ఎ‌స్ విక్రాంత్ నుంచి క్షిపణి దాడులకు శ్రీకారం చుట్టింది. పాక్ కీలక నేవీ స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించింది. భారీ విధ్వంసం సృష్టించింది. ఫలితంగా, పాకిస్థాన్ తీర ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. రక్షణ శాఖ వర్గాల కథనం ప్రకారం.. అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌తోపాటు 26 భారతీయ యుద్ధ నౌకలు ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో కరాచీ, ఓర్మారా పోర్టులపై ఐఎన్ఎస్ విక్రాంత్ క్షిపణుల వర్షం కురిపించింది. ఆ సమయంలో కరాచీ నగరమంతా ఆకాశంలో నల్లగా పొగ కమ్మేసింది. పోర్టులో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. పది నుంచి 12 నౌకలు పూర్తిస్థాయిలో ధ్వంసమైనట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. కరాచీ పోర్టులోని కీలక ప్రాంతాలు కూడా మంటల్లో అంటుకున్నాయని, దాంతో, స్థానికులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారని వివరించాయి. దాడుల్లో రెండు పోర్టులు తీవ్ర స్థాయిలో ధ్వంసమయ్యాయని, పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాన్ని ఇది తీవ్రంగా దెబ్బతీస్తుందని స్థానిక వర్గాలు తెలిపాయి. అదే సమయంలో.. ఇదే అదనుగా స్వతంత్ర దేశాన్ని కోరుతున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ రంగంలోకి దిగింది. పాకిస్థాన్‌లోని క్వెట్టాపై విరుచుకుపడింది. అక్కడి పాకిస్థాన్ ఆర్మీ స్థావరాలపై బలూచ్ దళాలు వరుస దాడులు చేశాయి. ఈ క్వెట్టా నగరం బలూచిస్థాన్‌కు రాజధాని కూడా కావడం విశేషం. వరుస పేలుళ్లతోపాటు కొద్ది సమయంపాటు ఇరు వర్గాల మధ్య కాల్పులు కూడా చోటుచేసుకున్నాయి. అనంతరం, క్వెట్టా నగరాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకుంది. ఫలితంగా.. అక్కడి పాక్ ఆర్మీ క్వెట్టా నుంచి పలాయనం చిత్తగిస్తోందని బలూచ్ వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే.. పాకిస్థాన్ మరోసారి మళ్లీ రెండు ముక్కలు అయ్యేందుకు అవకాశం ఉందని తెలుస్తోంది.

(మొదటిపేజీ తరువాయి)

కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుందని, వాటన్నిటినీ మధ్యలోనే అడ్డుకుని కూల్చేశామని వివరించాయి. హమాస్ తరహాలోనే పాకిస్థాన్ ఆర్మీ కూడా వ్యవహరిస్తోందని మండిపడింది. నెల కిందట పాక్ ఆక్రమిత కశ్మీరులో ఐఎస్ఎస్, హమాస్ ఉగ్రవాదుల మధ్య సమావేశం జరిగిన విషయాన్ని ఉటంకించింది. పాక్ డ్రోన్లు, రాకెట్లను భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసం చేస్తుండడంతో అక్కడ భారీ పేలుళ్లు జరుగుతున్నాయా అన్నట్లు పెద్దఎత్తున శబ్దాలు వస్తున్నాయి. అలాగే, కుప్వారా, బారాముల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ భారీ ఎత్తున గుళ్ల వర్షం కురిపిస్తోంది. అయినా, అక్కడ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికార వర్గాలు తెలిపాయి.

బుధవారం రాత్రి నుంచే..

ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ జరిపిన దాడులతో రగిలిపోతున్న దాయాది దేశం భారత్‌లోని 15 ప్రధాన నగరాల్లోని ఆర్మీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రయత్నించింది. జమ్మూకశ్మీర్ నుంచి గుజరాత్ దాకా.. ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లోని 15 నగరాలపై బుధవారం అర్ధరాత్రి దాటాక చైనాకు చెందిన మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. కానీ.. పాక్ ప్రతీకార దాడులను ముందే ఊహించి అప్రమత్తంగా ఉన్న భారతసైన్యం ఆ దాడులను దీటుగా తిప్పికొట్టింది. ఎస్-400 సుదర్శన్ చక్ర ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్‌ను ఉపయోగించి.. భారత్‌వైపు దూసుకొస్తున్న క్షిపణులను గాల్లోనే పేల్చేసింది. పాక్ క్షిపణులను ఇంటిగ్రేటెడ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థల సాయంతో వాటిని నిర్వీర్యం చేసినట్టు భారత ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇవి పాకిస్థాన్ దాడులేనని నిరూపించేందుకు.. పలు ప్రాంతాల్లో కూలిన క్షిపణుల శిథిలాలను సేకరిస్తున్నట్టు పేర్కొంది. ఇక. పాకిస్థాన్ దాడులకు ప్రతిగా మన సైన్యం లాహోర్, కరాచీ, రావల్పిండి సహా పాకిస్థాన్‌లోని తొమ్మిది నగరాల్లో గగనతల రక్షణ, రేడార్ వ్యవస్థలే దాడులు జరిపింది. ఈ దాడుల్లో సియాల్‌కోట్, లాహోర్‌తోపాటు మరో నగరంలో హెచ్‌క్యూ-9 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ లాంచర్లు పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. ఈ దాడులను కూడా భారత ప్రభుత్వం తన ప్రకటనలో ధ్రువీకరించింది. "గురువారం ఉదయం భారత సైన్యం పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలను, రేడార్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది" అని స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా.. లాహోర్‌లోని గగనతల రక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైనట్టు సమాచారం ఉందని వెల్లడించింది. పాక్ చేసిన దాడుల తీవ్రత, స్థాయికి సమంగానే తమ ప్రతిస్పందన ఉందని భారత్ తేల్చిచెప్పింది. మరోవైపు.. జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పులను తీవ్రతరం చేసిందని.. కుప్వాడా, బారాముల్లా, యూరీ, పూంచ్, మెంధార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్ షెల్లింగ్, ఫైరింగ్‌కు పాల్పడుతోందని తెలిపింది. ఇక.. సరిహద్దు గ్రామాల్లో సాధారణ పౌరులే లక్ష్యంగా బుధవారం నుంచి పాక్ జరుపుతున్న కాల్పుల్లో మృతుల సంఖ్య 16కు పెరిగిందని వెల్లడించింది. కాగా.. సరిహద్దుల్లో ఉద్రిక్తవాతావరణం నేపథ్యంలో పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. ఎమర్జెన్సీ ప్రోటోకాల్స్‌ను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా.. పలు జిల్లాల్లో పోలీసు, ప్రభుత్వ సిబ్బంది సెలవులను రద్దుచేశాయి. పాఠశాలలను మూసివేశాయి. ఎల్‌వోసీ వెంబడి వందలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. భద్రతను కట్టుదిట్టం చేశాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లోని 21 విమానాశ్రయాలను శనివారం దాకా మూసివేశారు. అటు బంగ్లాదేశ్‌తో సరిహద్దులను కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. గతంలో మంజూరు చేసిన సెలవులను కూడా ఉపసంహరించి.. ఉద్యోగులంతా విధులకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు.



జమ్మూ గగనతలంలో పాకిస్థాన్ రాకెట్

అన్నీ అబద్ధాలే..

పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడికి కుట్రపన్నడం ద్వారా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దాయాది దేశమే తెరలేపిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ గుర్తుచేశారు. భారత్ ఆ దాడికి ప్రతిస్పందించిందని.. ఉద్రిక్తతలను ఇంకా పెంచాలనుకోవట్లేదని.. పాక్ గనక ఇంకా ఉద్రిక్తతలను పెంచేందుకు ప్రయత్నిస్తే, అందుకు భారతదేశ ప్రతిస్పందన అదేస్థాయిలో ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి.. గురువారం సాయంత్రం కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత యుద్ధ విమానాలను తాము కూల్చేశామంటూ పాకిస్థాన్ చేసిన ప్రకటనను తోసిపుచ్చారు. పాక్ పుట్టినప్పటి నుంచే అబద్ధాలు ఆడడం మొదలుపెట్టిందని ఎద్దేవా చేశారు. "1947లో జమ్మూకశ్మీర్ తమదేనని ప్రకటించుకున్న పాకిస్థాన్ సాధారణ వ్యక్తులకు కాక.. ఏకంగా ఐక్యరాజ్యసమితికే అబద్ధాలు చెప్పింది. ఈ (పాక్ అబద్ధాల) ప్రయాణం 75 సంవత్సరాల క్రితమే మొదలైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. నీలం-జీలం ఆనకట్టను, తమ దేశంలోని మతప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులకు పాల్పడుతోందంటూ పాక్ చేస్తున్న ఆరోపణ.. పూర్తిగా అబద్ధమని ఆయన తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారతదేశం.. పాక్, పీవోకేలోని ఉగ్ర స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని స్పష్టం చేశారు. భారత్‌లోని ఆనకట్టల వంటి మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపే ఉద్దేశంతో పాక్ ఈ ఆరోపణలు చేస్తుంటేగనక.. పర్యవసానాలకు పూర్తి బాధ్యత ఆ దేశానిదేనని హెచ్చరించారు. అలాగే.. పాకిస్థాన్ ఉగ్రవాదులకు కేంద్రస్థానమన్న సంగతి ప్రపంచం మొత్తానికీ తెలుసని మిస్రీ వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడానికి, వారికి ఆశ్రయం ఇవ్వడానికి మతప్రదేశాలను ముసుగుగా పాక్ వాడుకుంటోందని మండిపడ్డారు. "ఒసామాబిన్ లాడెన్ ఎక్కడ దొరికాడో.. ఎవరు అతణ్ని అమరవీరుడని పిలుస్తారో నేను ప్రత్యేకంగా గుర్తుచేయనక్కర్లేదు. ఐక్యరాజ్య సమితితోపాటు వివిధ దేశాలు నిషేధించిన ఎంతో మంది ఉగ్రవాదులకు పాకిస్థానే నివాసస్థానం. పాక్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి, రక్షణ మంత్రి సైతం తమ దేశంలో ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చినట్టు ఇటీవలే ఒప్పుకున్న విషయం తెలిసిందే" అని ఆయన పేర్కొన్నారు. పహల్గాం దాడి తమ పనేనని టీఆర్ఎఫ్ ప్రకటించినా.. పాక్ మాత్రం ఐరాసలో ఆ విషయాన్ని ఒప్పుకోవట్లేదని గుర్తుచేశారు. పాక్ జాతీయ పతాకంతో చుట్టిన శవపేటికల్లో పౌరుల మృతదేహాలను ఉంచి, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించడం విచిత్రంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. "మాకు తెలిసినంతవరకూ అక్కడ చనిపోయింది ఉగ్రవాదులే. ఉగ్రవాదులకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపడం బహుశా పాకిస్థాన్ సంప్రదాయమేమో" అని వ్యంగ్యంగా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో సాధారణ పౌరులే లక్ష్యంగా పాక్ కాల్పులు జరుపుతోందని మిస్రీ మండిపడ్డారు. "జమ్మూ కశ్మీర్‌లో పాకిస్థాన్ సిక్కులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. పూంచ్‌లో ఒక గురుద్వారాపై దాడి చేసింది. అందులో ముగ్గురు చనిపోయారు. పూంచ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో పాక్ జరిపిన కాల్పుల్లో 16 మంది చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు" అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పాక్ గనక భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే తామూ అదేవిధంగా స్పందిస్తామని సోఫియా ఖురేషీ తేల్చిచెప్పారు.



చిమ్మ చీకట్లో..

డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో.. జమ్ము, చండీగఢ్, మొహాలీ, అమృత్‌సర్, పఠాన్‌కోట్ తదితర ప్రాంతాల్లో బ్లాకవుట్ చర్యలు చేపట్టారు. అలాగే, ప్రజలు ఎవరూ బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఉండిపోవాలని సూచించారు. దీంతో గురువారం రాత్రి ఆ ప్రాంతాలన్నీ చిమ్మ చీకట్లలో మునిగిపోయాయి. శత్రు దేశాలు రాకెట్లు దూసుకొస్తున్న సమయంలో.. సరిహద్దు ప్రాంతాల్లో లైట్లన్నీ ఆర్పేయాలని సూచిస్తారు. దీనినే బ్లాకవుట్ అంటారు. ఆ సమయంలో ఇళ్లల్లోనూ, బయటా మొత్తం లైట్లు ఆర్పేయడంతో అక్కడ చిమ్మచీకట్లు నెలకొంటాయి.

పాక్‌లో భారీ పేలుళ్లు.. భయాందోళనలు..

లాహోర్‌లోని వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలో జరిగిన భారీ పేలుళ్లు స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించాయి. అంతకుముందు.. కరాచీలోని షరాఫీ గోత్ ప్రాంతంలో ఒక పేలుడు సంభవించింది. ఆ రెండు ప్రధాన నగరాల్లోనే కాదు.. రావల్పిండి, గుర్జన్‌వాలా, చక్వాల్, అటోక్, బహావల్‌పూర్, మియాన్‌వాలి, ఛోర్ నగరాలపై భారత్ 12 హెరాన్ డ్రోన్లతో దాడి చేసినట్టు పాకిస్థాన్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. "బుధవారం రాత్రి భారత్ పాక్‌లోని పలు ప్రాంతాలకు డ్రోన్లు పంపడం ద్వారా మరోసారి దాడులకు పాల్పడింది. వాటిలో ఒకటి లాహోర్‌లోని సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఆ దాడిలో నలుగురు సైనికులు గాయపడ్డారు. భారతదేశం ఇలాగే డ్రోన్లను మా గగనతలంలోకి పంపిస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారు" అని ఆయన హెచ్చరించారు.

కరాచీ పోర్టు తగలబడిన వేళ..

నాడు బంగ్లా విముక్తి సమయంలో భారత్ దాడి

పశ్చిమ తీరంలో పాక్ నేవీని ఖతం చేసిన మన 'కిల్లర్ స్క్వాడ్రన్'

- స్టైక్స్ క్షిపణులు, బాంబులతో పాక్ ఆయువుపట్టుపై దెబ్బ
- ఇప్పుడూ కరాచీ లక్ష్యంగా దాడులు

న్యూఢిల్లీ, మే 8: అరేబియా తీరంలోని కరాచీ పోర్టు పాకిస్థాన్‌కు ఆయువు పట్టు. దాన్ని ఏమాత్రం దెబ్బతీసినా, స్వాధీనం చేసుకున్నా.. గట్టి దెబ్బతగిలినట్టే. ఈ క్రమంలోనే గురువారం రాత్రి కరాచీ పోర్టును భారత్ టార్గెట్ చేసింది. ఇంతకు ముందు బంగ్లాదేశ్ విముక్తి సమయంలోనూ కరాచీపై భారత్ భారీస్థాయిలో దాడులు చేసింది. ప్రస్తుత దాడులు.. నాటి పరిస్థితిని గుర్తుకు తెస్తున్నాయి.


1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి మద్దతు ప్రకటించడంతో.. భారత్‌లోని తొమ్మిది ఎయిర్‌బేస్‌లపై పాకిస్థాన్ దాడి చేసింది. దీనితో భారత్ నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది.. ఆపరేషన్ ట్రైడెంట్ చేపట్టింది. తూర్పు పాకిస్థాన్‌గా ఉన్న బంగ్లాదేశ్ ప్రాంతానికి ప్రస్తుత పాకిస్థాన్‌కు ఉన్న నౌకాపరమైన అనుసంధానాన్ని తెగ్గొట్టేందుకు.. కీలకమైన కరాచీ పోర్టుపై దృష్టిపెట్టింది. దీనిపై అప్పటి వెస్టర్న్ నావల్ కమాండ్ వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ కోహ్లీకి ఆదేశాలు వెళ్లాయి. 1971 డిసెంబర్ 4న పశ్చిమ తీరంలోని ముంబై, ఓఖా స్థావరాల్లోని 25వ మిస్సైల్ బోట్ స్క్వాడ్రన్ నుంచి 'కరాచీ స్ట్రైక్ గ్రూప్' పేరిట రెండు యుద్ధ నౌకలు, నాలుగు మిస్సైల్ బోట్లు బయలుదేరాయి. పెట్యా క్లాస్‌కు చెందిన కట్చాల్, కిల్టన్ యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ నిర్ఘాట్, నిపట్, వీర్ మిస్సైల్ బోట్లు కరాచీ పోర్టుపై దాడికి వెళితే.. మరో మిస్సైల్ బోట్‌ను ద్వారక వద్ద సిద్ధంగా ఉంచారు. మిస్సైల్ బోట్లలో రష్యన్ తయారీ స్టైక్స్ క్షిపణులను సిద్ధంగా ఉంచారు. కరాచీకి 110 కిలోమీటర్ల దూరంలోకి చేరుకున్న ఈ స్క్వాడ్రన్.. సముద్రంలో గస్తీ కాస్తున్న పాక్ యుద్ధ నౌకలు పీఎన్ఎస్ ఖైబర్, పీఎన్ఎస్ ముహాఫిజ్‌లను, పాక్ ఆర్మీకి ఆయుధాలను తరలిస్తున్న ఓ వాణిజ్య నౌకను ధ్వంసం చేశాయి. మరికాస్త లోపలికి చొచ్చుకెళ్లి.. కెమరీ చమురు రిఫైనరీపై క్షిపణి దాడి చేశాయి. ఆ వెనకాలే ఆపరేషన్ పైథాన్ పేరిట వచ్చిన ఐఎన్ఎస్ వినాశ్, తల్వార్, త్రిశూల్ యుద్ధ నౌకలు.. పీఎన్ఎస్ డక్కా యుద్ధ ట్యాంకర్‌ను ధ్వంసం చేశాయి. కరాచీ పోర్టుపై క్షిపణులు, బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో కరాచీ పోర్టు తగలబడిపోయింది. పోర్టులో ఉన్న ఎంవీ హర్మట్టన్, ఎంవీ గల్ఫ్ నౌకలు దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ నుంచి తూర్పు పాకిస్థాన్ (బంగ్లాదేశ్)కు ఆయుధాలు, ఇతర రవాణా నిలిచిపోయింది. దీనితో తూర్పు పాకిస్థాన్‌లోని ఆర్మీ లొంగిపోక తప్పలేదు.



కరాచీ పోర్ట్ మూసివేస్తే పాక్ కథ ముగిసినట్లే

- 70 శాతం ఎగుమతులు, దిగుమతులు బంద్
- ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

న్యూఢిల్లీ, మే 8: పాకిస్థాన్ వాణిజ్య రాజధాని అయిన కరాచీ దాయాది దేశానికి అత్యంత కీలక నగరం. అరేబియా సముద్ర తీరంలో ఉన్న కరాచీ పోర్టు నుంచి 70 శాతం ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. ప్రైవేట్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడంతో ఈ నగరం పరిశ్రమల పరంగా కూడా అభివృద్ధి చెందింది. అనేక ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక, అంతర్జాతీయ సంస్థలకు ఇది కీలక నగరంగా మారింది. పాకిస్థాన్ జీడీపీలో 20 శాతం ఈ నగరం నుంచే వస్తుంది. స్టాక్ మార్కెట్‌కు కూడా ఇదే ప్రధాన నగరం. కరాచీ పోర్టును మూసివేస్తే పాకిస్థాన్ త్రివిధ దళాలకు చమురుతో పాటు ఆహారధాన్యాలు, ఔషధాలు, కీలక ఆయుధాల సరఫరా నిలిచిపోతుంది. వాణిజ్య కార్యకలాపాలు స్తంభించే ప్రమాదం ఉంది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.





పాక్ క్షిపణులపై సుదర్శన చక్రం



భారత్‌లోని 15 నగరాల్లో ఉన్న సైనిక స్థావరాలపై పాకిస్థాన్ బుధవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లతో పెద్దఎత్తున దాడి చేసింది. అయితే ఆ దాడుల్ని సమర్థంగా అడ్డుకున్నామని భారత రక్షణ శాఖ ప్రకటించింది. మన 'ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ అండ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్'ను ఉపయోగించి పాక్ క్షిపణుల్ని, డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. పాక్ దాడుల్ని అడ్డుకునేందుకు భారత్ వద్ద ఉన్న ఈ వ్యవస్థలు ఏమిటి అనేది పరిశీలిద్దాం...

యూఏఎస్ అంటే అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (డ్రోన్లు). ఎక్కడో ఉన్న ఆపరేటర్ వీటిని నియంత్రిస్తూ దాడి చేయిస్తాడు. అంటే వేరేచోటి నుంచి వీటికి సిగ్నల్స్ అందుతుంటాయి. ఇలాంటి రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నల్స్‌ను, డ్రోన్ కంట్రోల్ సిగ్నల్స్‌ను పసిగట్టే సిగ్నల్ ఇంటెలిజన్స్ వ్యవస్థలు భారత్ వద్ద ఉన్నాయి. వీటి ద్వారా డ్రోన్ల ఉనికిని, కదలికల్ని కనిపెడతారు. అలాగే డ్రోన్లు పనిచేయకుండా స్తంభింపజేయగల జామింగ్, స్పూఫింగ్ వ్యవస్థలు కూడా మన వద్ద ఉన్నాయి. వీటిని ఉపయోగించినా డ్రోన్ ముందుకు వస్తుంటే దానిని కూల్చివేయడానికి గన్స్, లేజర్ బేస్డ్ సిస్టమ్స్ ఉన్నాయి. హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థల్ని రూపొందించింది. ఇవి కాకుండా డీఆర్‌డీవో డ్రోన్ డిటెక్షన్ అండ్ డిస్ట్రక్షన్ సిస్టమ్స్‌ను కూడా భారత్ తన పశ్చిమ సరిహద్దులో మోహరించింది. వీటివల్లే పాక్ డ్రోన్లను అడ్డుకోగలిగింది. ఇక పాక్ క్షిపణుల్ని అడ్డుకోవడంలో భారత్ దేశీయంగా రూపొందించిన ఆకాశ్ క్షిపణులు, భారత్-ఇజ్రాయెల్ సంయుక్తంగా రూపొందించిన బరాక్ 8 క్షిపణులు కీలక పాత్ర పోషించగా రష్యా నుంచి ఇటీవల కొనుగోలు చేసిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ అత్యంత ప్రధాన పాత్ర నిర్వహించినట్లు రక్షణ నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఎస్-400 చాలా శక్తిమంతమైనది. భారత సైన్యం ఇటీవల మూడు ఎస్-400 రెజిమెంట్లను రష్యా నుంచి కొనుగోలు చేసింది. ఈ వ్యవస్థకు భారత్ 'సుదర్శన్ చక్ర' అని పేరు పెట్టింది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

ఎస్-400 సత్తా ఇదీ...

రష్యన్ ఎస్-400 బాలిస్టిక్ క్షిపణుల్ని, క్రూజ్ క్షిపణుల్ని, శత్రు విమానాల్ని గుర్తించి ధ్వంసం చేయగలదు. ఏకంగా 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఇది గుర్తించి దెబ్బతీయగలదు. ఈ క్షిపణి వ్యవస్థను వాహనాల్లో ఎక్కడికైనా సులభంగా తీసుకవెళ్లవచ్చు. అందువల్ల వీటిని ఎక్కడైనా సులభంగా మోహరించవచ్చు. ఈ వ్యవస్థలో నాలుగు రకాల క్షిపణులు ఉంటాయి.

1) 40 ఎన్6ఈ... ఇది 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాంబర్ విమానాలను, అవాక్స్ విమానాలను ధ్వంసం చేయగలదు.
2) 48ఎన్6... ఇది 250 కిలోమీటర్ల దూరంలోని విమానాలను, బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది.
3) 9ఎం96ఈ2... ఇది 120 కిలోమీటర్ల రేంజ్ కలిగి తక్కువ ఎత్తులో ఉన్న లక్ష్యాలను అతి వేగంగా కూల్చగలదు.
4) 9ఎం96ఈ... ఇది 40 కిలోమీటర్ల రేంజ్ కలిగి వేగంగా వచ్చే విమానాల్ని, క్షిపణుల్ని అత్యంత కచ్చితత్వంతో కూలుస్తుంది.

పాక్ ఎయిర్ డిఫెన్స్‌పై గురి

మన యుద్ధ విమానాలకు ముప్పు తప్పించే లక్ష్యం



పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలపై భారత్ గురిపెట్టింది. లాహోర్, రావల్పిండి, కరాచీ సహా ఏకంగా తొమ్మిది నగరాల్లోని పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై దాడులు చేసింది. చైనా నుంచి దిగుమతి చేసుకున్న హెచ్‌క్యూ 9, ఎల్‌వై 80 వంటి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్ వద్ద ఉన్నాయి. భారత యుద్ధ విమానాలు, క్షిపణులను అడ్డుకుని కూల్చివేయడం ఈ వ్యవస్థల లక్ష్యం. అందువల్ల భారత్ వ్యూహాత్మకంగా వీటిపై గురిపెట్టింది. సైనిక పరిభాషలో ఇటువంటి ఆపరేషన్లను 'సియాడ్' (సప్రెషన్ ఆఫ్ ఎనిమీ ఎయిర్ డిఫెన్సెస్) అంటారు. మన యుద్ధ విమానాలకు శత్రు ఎయిర్ డిఫెన్స్ నుంచి ముప్పు ఏర్పడినప్పుడు గానీ, లేదా శత్రు భూభాగంలో త్వరలో భారీ దాడులు చేయాలని భావించినప్పుడు గానీ ఈ సియాడ్ దాడులు చేస్తారు. భారత్ ఇంత పెద్దఎత్తున అనేక పాక్ నగరాల్లో సియాడ్ దాడులు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో రాడార్లు ప్రధానమైనవి. ఇవి యుద్ధ విమానాలు, క్షిపణులపైకి రాడార్ సిగ్నల్స్‌ను పంపి వాటి ఆచూకీని కనిపెడతాయి. ఆ తర్వాత క్షిపణులు వెళ్లి వాటిని అడ్డుకుని ధ్వంసం చేస్తాయి. అయితే ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల నుంచి వెలువడే రాడార్ సిగ్నల్స్ ఎదుటి విమానాల్ని కనిపెట్టేందుకే కాదు, తమ ఆచూకీ ఎదుటివారు తెలుసుకునేందుకూ ఉపయోగపడతాయి. ఇలా శత్రు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల నుంచి వెలువడే రాడార్ సిగ్నల్స్‌ను కనిపెట్టి దాడి చేసే రుద్రమ్, కేహెచ్-31పీ అనే క్షిపణులు భారత్ వద్ద ఉన్నాయి. వీటిలో కేహెచ్-31పీ రష్యన్‌ది కాగా రుద్రమ్ క్షిపణి దేశీయంగా రూపొందించినది. వీటితో పాటు ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన హరోప్ కామికాజ్ డ్రోన్లను కూడా గురువారం నాటి దాడుల్లో ఉపయోగించారు. ఇవి రాడార్ సిగ్నల్స్‌ను కనిపెట్టి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వద్దకు చేరుకోవడంతోపాటు దానిపై ఆకాశంలో ఎగురుతూ అకస్మాత్తుగా దాడి చేస్తాయి. భారత్ ఇలాంటి 25 పైగా డ్రోన్లను పాక్‌పైకి పంపినట్లు సమాచారం. వీటన్నింటినీ కూల్చివేసినట్టు పాక్ ప్రకటించినప్పటికీ లాహోర్‌లోని పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపై ఈ డ్రోన్ దాడి చేయడం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. లాహోర్‌లో చేసిన దాడిలో లక్ష్యాన్ని గురి తప్పకుండా ఛేదించినట్లు భారత రక్షణ శాఖ సైతం ఒక ప్రకటనలో వెల్లడించింది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి



కర్ణాటక, కేరళలో చదివి.. ఉగ్రవాదం వైపు..

- పహల్గాం దాడి సూత్రధారి షేక్ సజ్జద్ అహ్మద్‌పై పోలీసుల ఆరా



బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి సూత్రధారి షేక్ సజ్జద్ గుల్ అలియాస్ సజ్జద్ అహ్మద్ షేక్ కర్ణాటక, కేరళలో ఉన్నత విద్యాభ్యాసం చేసినట్లు తెలిసింది. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ అనుబంధ టీఆర్ఎఫ్‌లో సజ్జద్ కీలకమని తెలుస్తోంది. బెంగళూరు, కేరళల్లో విద్యాభ్యాసం తర్వాత కశ్మీరులో సొంతంగా డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను తెరిచి, అక్కడి నుంచే ఉగ్రవాదులకు సరుకులు రవాణా చేసేవాడని తెలిసింది. ఆ సంబంధాలతోనే లష్కరే తోయిబా ద్వారా పాక్ చేరుకుని ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే సజ్జద్ గురించి ఆ రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

భారత్‌లో ఇరాన్, సౌదీ మంత్రుల ఆకస్మిక పర్యటన

- విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ

న్యూఢిల్లీ, మే 8: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ ఇరాన్, సౌదీ అరేబియా మంత్రులు ఢిల్లీలో ఆకస్మికంగా పర్యటించారు. సౌదీ విదేశాంగ సహాయ మంత్రి అదెల్ అల్ జుబైర్.. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కలుసుకున్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత విధానాన్ని జుబైర్‌కు వివరించినట్లు జైశంకర్ తెలిపారు. మరోవైపు భారత్-ఇరాన్ సంయుక్త కమిషన్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ.. జైశంకర్‌తో భేటీ అయ్యారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు సిద్ధమని, సోదరుల్లాంటి పొరుగుదేశాలు తమకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.

ఇంకా సినిమా అయిపోలేదు: నరవాణే



న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్‌పై భారత ఆర్మీ మాజీ చీఫ్, జనరల్ మనోజ్ నరవాణే సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టులు చేశారు. యుద్ధం అప్పుడే అయిపోలేదనే అర్థం వచ్చేలా 'ఇంకా సినిమా అయిపోలేదు (అభీ పిక్చర్ బాకీ హై)' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మొత్తం కథంతా 5 పదాల్లో అనే శీర్షికతో ఆయన పోస్టు చేసిన ఓ చిత్రం కూడా వైరలైంది. "పో.. మోదీకి చెప్పు".. నన్ను కూడా చంపేయండని పహల్గాంలో తన భర్తను చంపిన ఉగ్రవాదుల ఎదుట రోదించిన మహిళకు ఓ ఉగ్రవాది జవాబిది. దీనిపై రూపొందించిన చిత్రాన్ని నరవాణే పోస్టు చేశారు. దానిలోని ఓ భాగంలో భర్త మృతదేహం వద్ద ఏడుస్తున్న భార్యను చూస్తూ 'గో టెల్ మోదీ (పోయి మోదీకి చెప్పు)' అని ఓ ఉగ్రవాది హెచ్చరిస్తుంటాడు. మరోవైపు, కుప్పలుగా పడి ఉన్న మృతదేహాల మధ్య ఆ ఉగ్రవాది ఏడుస్తుండగా 'ఐ టోల్డ్ మోదీ (మోదీకి చెప్పా)' అంటూ ఆ మహిళ ధైర్యంగా నిలబడి ఉంటుంది.

కాందహార్ సూత్రధారి రవూఫ్ హతం!

- జైషే అధినేత మసూద్‌కు రవూఫ్ సోదరుడు

పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసి పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీసుకున్న భారత్‌కు మరో భారీ విజయం కూడా లభించింది. జైషే మహ్మద్ అధినేత మసూద్ అజర్ తమ్ముడు, కాందహార్ విమానం హైజాక్ మాస్టర్ మైండ్ అబ్దుల్ రవూఫ్ అజర్ ఈ దాడుల్లో మరణించాడు. భారత సైన్యం, వాయుసేన సంయుక్తంగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల శిక్షణ, ఆయుధ శిబిరాలు, ప్రధాన కార్యాలయాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో మరణించిన 10 మంది మసూద్ అజర్ కుటుంబసభ్యుల్లో రవూఫ్ అజర్ కూడా ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం కాగా, అధికార వర్గాలను ఉటంకిస్తూ న్యూస్ 18 మీడియా సంస్థ దీనిపై ఓ కథనం ప్రచురించింది. ఆపరేషన్ సిందూర్‌లో నేలమట్టమైన బహావల్‌పూర్‌లోని జైషే ప్రధాన స్థావరం మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై జరిపిన దాడిలో రవూఫ్ అజర్ మరణించాడు.

నేపాల్‌లో అపహరించి.. కాందహార్‌లో దింపి..

1999లో నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐసీ-814 విమానాన్ని హైజాక్ చేసిన రవూఫ్ అజర్ దాన్ని అఫ్ఘానిస్థాన్‌లోని కాందహార్‌లో దింపి ప్రయాణికులను అడ్డుపెట్టుకుని భారత్‌తో చర్చలు జరిపాడు. భారతీయ జైళ్లలో ఉన్న తన సోదరుడు మసూద్ అజర్, అల్‌కాయిదా ముఖ్య నేత ఒమర్ సయీద్ షేక్ సహా పలువురు ఉగ్రవాదులను విడుదల చేయాలని డిమాండ్ పెట్టాడు. అప్పటి బీజేపీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి జశ్వంత్ సింగ్ జైళ్లలోని ఉగ్రవాదులను తన వెంటపెట్టుకుని పోయి కాందహార్‌లో వారిని హైజాకర్లకు అప్పగించారు.

డ్రోన్ దాడి జరిగితే.. పిడుగుపాటు అని కవరింగ్!

రావల్పిండిలో భారీ నష్టం.. పాకిస్థాన్ సూపర్ లీగ్ రద్దు

- లాహోర్‌లోని వాల్టన్‌లో.. నలుగురు సైనికులకు గాయాలు
- లాహోర్‌కు నష్టం జరగలేదు: ఖవాజా
- ప్రతీకారం తీర్చుకుంటాం: షెహబాజ్

(సెంట్రల్ డెస్క్)

"భారత్ డ్రోన్లతో దాడి చేసింది. ఆ దాడిని ప్రత్యక్షంగా చూశాను. ఏం జరిగిందో చూడాలని అటువైపు వెళ్తుండగా పోలీసులు, సైనికులు అడ్డుకున్నారు. ఏమైంది? పెద్ద శబ్దం వచ్చింది? అని ప్రశ్నిస్తే.. వర్షాల కారణంగా భారీ పిడుగు పడిందని చెప్పారు. నేను కళ్లారా డ్రోన్లను చూశాను. ఇంత దారుణంగా ఏమార్చడం సిగ్గుచేటు".. రావల్పిండికి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో ఓ వీడియోలో తన ఆవేదనను వెల్లడించాడు. ఇదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు కూడా ఓ న్యూస్ చానల్ మాట్లాడుతూ పాక్ సైన్యం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించాడు. భారత్‌తో యుద్ధం మరింత ముదురుతుందేమోననే భయాందోళనలు ప్రజల్లో నెలకొన్నాయి. పౌరులు ముందుజాగ్రత్తగా ఏటీఎంలలో, బ్యాంకుల లోంచి నగదును డ్రా చేసుకుంటూ.. నిత్యావసరాలను నిల్వ చేసుకుంటున్నారు. లాహోర్‌లోని డీహెచ్ ఫేస్-8, ఆస్కారీ-11 నుంచి ప్రజలను ఖాళీ చేయాలని స్థానిక అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాలు లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు సమీపంలో ఉంటాయి. భారత్ 'ఆపరేషన్ సిందూర్' రెండో రోజు పాక్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండి, గుజ్రాన్‌వాలా, బహావల్‌పూర్, సియాల్‌కోట్, సింధ్ తదితర ప్రాంతాల్లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, మిలటరీ స్థావరాలను టార్గెట్‌గా చేసుకుంది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ నిర్వీర్యమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల వైపు దూసుకొచ్చిన భారత డ్రోన్లను సమర్థంగా కూల్చేశామని పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో చెప్పారు. భారత్ డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మృతిచెందారని, లాహోర్‌లోని వాల్టన్ వద్ద నలుగురు ఆర్మీ జవాన్లు గాయపడ్డారని, సైనిక స్థావరాలకు స్వల్పంగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. 29 భారత డ్రోన్లను కూల్చివేశామని ప్రకటించారు. తాము భారత్‌లోని 15 ప్రాంతాలపై దాడి చేశామని చెప్పడం నిజం కాదని, తాము దాడి చేస్తే ప్రపంచానికి తెలుస్తుందన్నారు. కాగా, పాకిస్థాన్‌కు చెందిన ఆర్మీ మాజీ మేజర్, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) తాహిర్ ఇక్బాల్ 'దేవుడా.. నువ్వే దిక్కు. పాకిస్థాన్‌ను కాపాడు. భారత్ నుంచి రక్షించు' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, భారత్ డ్రోన్ దాడిలో లాహోర్‌లోని రక్షణ వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. పాకిస్థాన్ రక్షణ వ్యవస్థ సురక్షితంగా ఉందని చెప్పారు. భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.



రావల్పిండిలోని క్రికెట్ స్టేడియం వద్ద ధ్వంసమైన భవనాలు



లాహోర్‌లో కుప్పకూలిన ఓ భవంతి

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైన్యం

'ఆపరేషన్ సిందూర్' తొలిరోజు దాడిలో మృతిచెందిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ ఆర్మీ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై విమర్శలు రాగా.. "మా సైన్యాధికారి కుమారుడు(7) కూడా భారత్ దాడిలో చనిపోయాడు. అందుకే ఆర్మీ వచ్చింది" అని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కాగా.. భారత్ దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ.. పాకిస్థాన్ సుప్రీంకోర్టు నివాళులర్పించడం గమనార్హం.



ఎల్‌వోసీ సమీపంలోని ఖంజో, సర్ఫరాజ్ లెఘారీ గ్రామాలు, చక్వాల్‌లోని ధమన్ తదితర ప్రాంతాల్లో మసీదులు ధ్వంసమయ్యాయని, పౌరుల ఇళ్లు దెబ్బతిన్నాయని పాక్ మీడియా పేర్కొంది. రావల్పిండిలో నష్టం

భారీ నష్టం?

ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఈ ప్రాంతాల్లోని దళాలు డ్రోన్లను కూల్చివేసినట్లు వివరించింది. దీంతో రావల్పిండి నుంచి పాక్ సూపర్ లీగ్ క్రికెట్ ఆటగాళ్లను ఇతర ప్రాంతాలకు తరలించి, లీగ్‌ను రద్దు చేశారని వివరించింది. భారత్ దాడుల ముప్పు నేపథ్యంలో ఓడరేవుల వద్ద హైఅలర్ట్ కొనసాగుతోంది. పడవలు, నౌకలను సముద్రంలోకి వెళ్లనివ్వడం లేదు. కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్, సియాల్‌కోట్ విమానాశ్రయాల్లో రాకపోకలను నిలిపివేశారు.

గగన్‌యాన్ వ్యోమగామి

యుద్ధానికి సిద్ధం

- అజిత్ కృష్ణన్‌ను వెనక్కి పిలిపించిన వాయుసేన



న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంతో గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ కృష్ణన్‌ను వాయుసేన తిరిగి తన యూనిట్‌కు పిలిపించింది. దేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం ఎంపికైన నలుగురు వైమానిక దళ అధికారుల్లో గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్ ఒకరు. ఢిల్లీలో జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ వద్ద ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తనకు ఐఏఎఫ్ నుంచి పిలుపొచ్చిందని ధ్రువీకరించారు. 2027లో నిర్వహించే గగన్‌యాన్ మిషన్ కోసం అజిత్‌తోపాటు వాయుసేనకు చెందిన అంగద్ ప్రతాప్, శుభాంశు శుక్లా, ప్రశాంత్ బి నాయర్ ఎంపికయ్యారు. 2003లో ఐఏఎఫ్‌లో చేరిన అజిత్‌కు ఎస్‌యూ-30, ఎంకేఐ, మిగ్-29 తదితర యుద్ధ విమానాల్లో దాదాపు 2,900 గంటలు ప్రయాణించిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన వాయుసేనలో ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

75 ఏళ్లుగా.. బలూచీల పోరు

- భారత్ దాడులతో క్రియాశీలమైన బీఎల్ఏ దళాలు
- అర్ధరాత్రి నుంచి పాక్‌పై దాడులు
- పాక్‌లో అతిపెద్ద భూభాగం బలూచిస్థాన్‌దే
- జనాభా మాత్రం 7-8 శాతం వరకే

(సెంట్రల్ డెస్క్)

బలూచిస్థాన్..! పాకిస్థాన్‌లో ఉన్నా.. అక్కడి పౌరులకు స్వేచ్ఛ లేదు.. విద్య, వైద్యం అందని దుస్థితి..! పాకిస్థాన్‌లో 44% విస్తీర్ణం ఉన్న బలూచిస్థాన్ ప్రాంతాన్ని పాక్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నాయి. దీంతో.. స్వతంత్ర దేశంగా ప్రకటించాలంటూ.. అక్కడి పౌరులు 75 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇప్పుడు పాక్‌పై భారత్ దాడి నేపథ్యంలో.. బలూచీలు తమ కలను సాకారం చేసే దిశలో ముందుకు సాగుతున్నారు.

ఇదీ బలూచిస్థాన్ కథ

బ్రిటిష్ వారు 1947 ఆగస్టు 15న భారత్-పాకిస్థాన్‌లను విభజించి, స్వాతంత్ర్యం ప్రకటించినా.. బలూచిస్థాన్ ప్రాంతం స్వతంత్రంగా ఉండేది. 'ఖాన్ ఆఫ్ కలాత్' అనే రాజు పాలనలో ఈ ప్రాంతం కొనసాగింది. అయితే.. 1948 మార్చిలో పాకిస్థాన్ ప్రభుత్వం సైనిక చర్యను చేపట్టి.. ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. పాకిస్థాన్‌లో విలీనం చేసుకుంది. పాకిస్థాన్ విస్తీర్ణంలో బలూచిస్థాన్ వాటా 44శాతంగా ఉంటుంది. అయితే.. పాక్ జనాభాలో బలూచీల వాటా 7-8% మాత్రమే. పాక్ దురాక్రమణ నుంచి ఈ ప్రాంత ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. తమ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా బలూచీలను పాకిస్థాన్ భావించేది. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదు. ఇక్కడి ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు లేవు. ఈ ప్రాంతంలోని వనరులను పాకిస్థాన్, చైనా దోచుకుంటున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన యువకులను పాక్ సైన్యం అపహరిస్తోంది. అలా అదృశ్యమయ్యే వారి జాడ నేటికీ తెలియలేదంటే.. బలూచీల దుర్భర పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బీఎల్ఏ ఆవిర్భావం.. దాడులు ముమ్మరం

2000 సంవత్సరంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ఆవిర్భవించింది. స్వతంత్ర బలూచిస్థాన్ దేశం కోసం గెరిల్లా యుద్ధాలతో పాకిస్థాన్ సైన్యంపై దాడులు చేసేది. క్రమంగా బీఎల్ఏ బలం పుంజుకుంది. పాకిస్థాన్ సైనికులు, వారి కార్యాలయాలు, కంటోన్మెంట్ ప్రాంతాలు, పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ భవనాలను టార్గెట్‌గా చేసుకుని, దాడులు జరుపుతోంది. ప్రస్తుతం బీఎల్ఏ చీఫ్‌గా బషీర్ జైబ్ వ్యవహరిస్తున్నారు. 2018 వరకు ఆయన సోదరుడు అస్లాం బలూచ్ ఈ పదవిలో ఉండేవారు. ఆయన మరణం తర్వాత బషీర్ జైబ్ బాధ్యతలను స్వీకరించాక.. బీఎల్ఏ మరింతగా పుంజుకుంది. గెరిల్లా పోరుతోపాటు.. అధునాతన ఆయుధాల వినియోగం, ఐఈడీల ప్రయోగాలు పెరిగాయి. ఆయన నేతృత్వంలోని బీఎల్ఏ.. గ్వాదర్ పోర్టు వద్ద చైనా ఇంజనీర్లు, వారి వాహనాలపై ఐఈడీ దాడులు చేస్తోంది. తాజాగా మంగళ, బుధవారాల్లోనూ బలూచిస్థాన్‌లో ఐఈడీలు పేల్చి, 21 మంది సైనికులను హతమార్చింది. ఇటీవల క్వెట్టా-పెషావర్ మధ్య నడిచే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసి, సంచలనం సృష్టించింది. స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్‌ను సాధించడానికి పోరాటాలను ముమ్మరం చేసింది. ముఖ్యంగా పాకిస్థాన్‌లో చైనా ప్రాజెక్టులు, సీపీఈసీ రోడ్డు ప్రణాళిక పాలిట బీఎల్ఏ ముప్పుగా పరిణమించింది. దీంతో ఈ ఉద్యమాన్ని అణిచివేయాలంటూ పాకిస్థాన్‌పై చైనా నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది.





...సిద్ధమా!?

నిరంతరం అప్రమత్తంగా ఉండండి: మోదీ



న్యూఢిల్లీ, మే 8: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. బుధవారం కశ్మీరులో సరిహద్దు వెంట జనావాసాలపై గుళ్ల వర్షం కురిపించిన పాకిస్థాన్.. గురువారం ఇరు దేశాల సరిహద్దుల్లో అటు చివరి నుంచి ఇటు చివరికి భారతసైనిక స్థావరాలపై దాడులకు విఫలయత్నం చేసింది. ఫలితంగా రాబోయే రోజుల్లో కశ్మీరు నుంచి కచ్ వరకూ సరిహద్దుల వెంట ఉండే ప్రజల ప్రాణాలను కాపాడడం తక్షణ కర్తవ్యంగా మారింది. ఇప్పటికే జమ్మూకశ్మీరు సరిహద్దు గ్రామాల్లో వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాబోయే రోజుల్లో రాజస్థాన్, గుజరాత్ సహా సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలను తరలించాల్సిన అనివార్య పరిస్థితులు తలెత్తుతాయా!? అనే సందేహాలూ వెలువడుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు రాకుండానే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక, ఇరు దేశాల దాడుల నేపథ్యంలో బుధవారం నుంచి సోషల్ మీడియాలో రకరకాల విశ్లేషణలూ వెలువడుతున్నాయి. వీటిలో నిజాలూ అర్ధ నిజాలూ అసత్యాలూ ఉంటున్నాయి. వీటిని ఆదిలోనే అడ్డుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రతి దాడి చేస్తే ముందుగా సైనిక స్థావరాలపైనే గురిపెట్టే అవకాశం ఉంది. గురువారం పాక్ గురి పెట్టిందీ వీటిపైనే! వాటిని కాపాడుకోవడం తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ కేంద్రంలోని వివిధ శాఖల కార్యదర్శులతో గురువారం సమావేశమయ్యారు. జాతీయ స్థాయిలో సన్నద్ధత, వాటి ప్లానింగ్, వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయంపై ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యుద్ధ సన్నద్ధత.. దేశ భద్రత.. ప్రథమ ప్రాధాన్యాలని స్పష్టం చేశారు. ఎక్కడ ఎప్పుడు ఏమి జరిగినా క్షణాల్లో సమాచారం చేరిపోవాలని, ఇందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రంగం సిద్ధం చేయాలని నిర్దేశించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు తక్కువ సమయంలోనే కోలుకుని తిరిగి యథా ప్రకారం కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా మంత్రిత్వ శాఖలు తమ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించుకోవాలని, అత్యవసర వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేసేలా చూసుకోవాలని నిర్దేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు, అంతర్గత కమ్యూనికేషన్ ప్రొటోకాల్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. దేశవ్యాప్తంగా పౌర రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఫేక్‌న్యూస్, తప్పుడు సమాచార వ్యాప్తిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని నిర్దేశించారు. సైనిక స్థావరాలు వంటి కీలక వ్యవస్థల భద్రతకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రాల్లోని అధికార యంత్రాంగంతోపాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న క్షేత్ర స్థాయి సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం కీలకమని కార్యదర్శులకు ప్రధానిసూచించారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయా మంత్రిత్వ శాఖలు ప్రధాని మోదీకి వివరించాయి. సమావేశంలో క్యాబినెట్ సెక్రటరీ, పీఎంవో సీనియర్ అధికారులు, రక్షణ, హోం, విదేశాంగ, విద్యుత్తు, ఆరోగ్యం, టెలి కమ్యూనికేషన్లు, సమాచార ప్రసార శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

100 మందిని హతమార్చాం

పాక్‌లోని ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు.. 9 స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేశాం

ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోంది..

పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేం

అఖిలపక్ష సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, మే 8: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై జరిపిన క్షిపణి దాడుల్లో 100 మంది దాకా ముష్కరులు హతమయ్యారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరులోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత బలగాలు మెరుపు దాడులతో విరుచుకుపడ్డాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పేరిట నిర్వహించిన ఈ దాడుల గురించి వివరించేందుకు గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "పాక్, పీవోకేల్లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించాం. దాదాపు 100మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం. దీనికి సంబంధించిన మరింత సమాచారం అందాల్సి ఉంది. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుందన్న ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేం. ఉద్రిక్తతలను పెంచాలన్న ఉద్దేశం మాకు లేదు. కానీ, పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాత్రం.. వెనక్కి తగ్గేదే లేదు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది" అని చెప్పారు. అలాగే ప్రధాని మోదీ సందేశాన్ని రాజ్‌నాథ్ చదివి వినిపించారు. "భారతీయులందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ వివరాలు, ప్రభుత్వ ఉద్దేశాలను రక్షణ మంత్రి ప్రతిపక్ష నేతలకు వివరించారు. అయితే, ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో సాంకేతిక అంశాలను వెల్లడించలేదు. ప్రతిపక్షాలు అత్యంత పరిణతితో వ్యవహరించాయి. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ అంశంలో రాజకీయాలకు తావులేదు' అని రిజిజు పేర్కొన్నారు. విపక్ష నేతలు పలు విలువైన సలహాలు, సూచనలు కూడా ఇచ్చారని తెలిపారు. దేశ భద్రత, భారతీయులందరినీ సురక్షితంగా ఉంచడం, ప్రత్యేకించి సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై కొంత ఆందోళన వ్యక్తం చేసినా.. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని చెప్పారు. యావత్ దేశం కేంద్రానికి, భద్రతా బలగాలకు అండగా ఉన్నాయన్న సందేశం ఇచ్చారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన మన బలగాలకు విపక్ష నేతలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



అఖిలపక్షం సందర్భంగా రాజ్‌నాథ్‌తో రాహుల్, ఖర్గే


ఐక్యంగా నిలబడతాం: రాహుల్

"ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు ప్రభుత్వానికి అండగా ఉంటాయి. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కొనసాగుతోందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు" అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో తాము కేంద్రానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తెలిపారు. ఇది సున్నితమైన అంశమైనందున, దేశ భద్రత దృష్ట్యా కొన్ని ప్రశ్నలు అడగరాదని రక్షణ మంత్రి చెప్పారన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతున్నందున పూర్తి వివరాలు ఇప్పుడే తెలియజేయలేమని కూడా రాజ్‌నాథ్ చెప్పారని ఖర్గే వివరించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రపంచానికి స్పష్టమైన సందేశం ఇచ్చినట్లవుతుందని రాహుల్ ప్రభుత్వానికి సూచించారని తెలిపారు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ రాకపోవడంపై ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నుంచి ఖర్గే, రాహుల్ హాజరుకాగా, డీఎంకే, శివసేన, మజ్లిస్, ఎన్సీపీ, ఎస్పీ, ఆప్, సీపీఎం, జేడీయూ, ఎల్జేపీ నేతలు హాజరవగా.. కేంద్ర ప్రభుత్వం తరపున మంత్రులు అమిత్ షా, నిర్మల, జైశంకర్, జేపీ నడ్డా పాల్గొన్నారు. మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత బలగాలు, ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అలాగే పహల్గాంలో అమాయకులను పొట్టనపెట్టుకున్న టీఆర్ఎఫ్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఐరాస భద్రతా మండలి టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా ప్రకటించాలని కోరారు. పాక్ మద్దతిస్తున్న ఉగ్రవాదులు భారత్‌లో జిహాద్ పేరిట హత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పూంచ్, ఉరీల్లో పాక్ బలగాల కాల్పుల్లో ప్రాణ, ఆస్తినష్టం జరిగిన కుటుంబాలకు పరిహారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భద్రతా బలగాలను అభినందిస్తూ పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. పీఏసీ తొలిసమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు కేసీ వేణుగోపాల్ తెలిపారు.

ఐఎన్ఎస్ విక్రాంత్ సముద్రంలో శత్రుదుర్భేద్య దుర్గం

పాకిస్థాన్‌పై పోరులో కీలకం

న్యూఢిల్లీ, మే 8: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అరేబియా సముద్రంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధవాహక నౌకను వారం కిందటే భారత నౌకాదళం తరలించింది. అరేబియా సముద్రం తీర ప్రాంతంలోనే పాకిస్థాన్‌లోని కరాచీ నగరం ఉంది. పాకిస్థాన్ మీద దాడికి సిద్ధంగా ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్.. గురువారం కరాచీ మీద నిప్పులు కురిపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఐఎన్ఎస్ విక్రాంత్ విశేషాలు.. ఐఎన్ఎస్ విక్రాంత్ బరువు 45 వేల మెట్రిక్ టన్నులు. పొడవు 262 మీటర్లు. దానిపై ఒకేసారి 30 మిగ్ 29కే యుద్ధవిమానాలను మోహరించవచ్చు. ఒక్కో మిగ్ 800 కి.మీ.ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యాన్ని కలిగిఉంటుంది. గగనతల నిఘా కోసం ఉపయోగించే కామోవ్-31 హెలికాప్టర్లను, యాంటీ సబ్‌మెరైన్ మిషన్ కోసం వాడే హాల్ ధ్రువ్ హెలికాప్టర్లను ఐఎన్ఎస్ విక్రాంత్ మీద మోహరిస్తారు. ఇక విక్రాంత్ రక్షణ కోసం దానిపై ఉపరితలం నుంచి గగనతలానికి దూసుకెళ్లే బరాక్-8 క్షిపణులు, ఈఎల్/ఎం-2248 ఎంఎఫ్-స్టార్ వంటి అత్యాధునిక రాడార్లు ఉంటాయి. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను శత్రు దుర్భేద్యంగా మార్చే 'కారియర్ బాటిల్ గ్రూప్' దాని వెంటే అంగరక్షకుల్లా ఉంటాయి. ఈ గ్రూప్‌లో కల్వరి క్లాస్ జలాంతర్గాములు, కోల్‌కతా క్లాస్ డిస్ట్రాయర్లు, తల్వార్ క్లాస్ ఫ్రిగేట్లు ఉంటాయి. వీటన్నింటితో ఐఎన్ఎస్ విక్రాంత్.. సముద్రంలో ఓ భారీకోటలా ముందుకు కదులుతుంది.



నిప్పులు చిమ్మే క్షిపణులు

కల్వరి క్లాస్ జలాంతర్గాముల్లో ఐఎన్ఎస్ కల్వరి, ఐఎన్ఎస్ వగీర్ సబ్‌మెరైన్లుంటాయి. వీటిలో శత్రునౌకలను ధ్వంసం చేసే క్షిపణులుంటాయి. ఒక క్షిపణి 3 వేల కిలోల బరువైన నౌకను కూడా తుత్తునియలు చేయగలదు. ఇక కోల్‌కతా క్లాస్ డిస్ట్రాయర్లలో బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్స్, 32 బరాక్-8 మిసైల్స్‌తో కూడిన ఐఎన్ఎస్ కోల్‌కతా, ఐఎన్ఎస్ చెన్నై యుద్ధనౌకలుంటాయి. ఇవి పాకిస్థాన్‌లోని నౌకాశ్రయాలను, చమురు డిపోలను, యుద్ధనౌకలను లక్ష్యంగా నిప్పులు కురిపించగలవు. తల్వార్ క్లాస్ ఫ్రిగేట్లలో ఐఎన్ఎస్ తల్వార్, ఐఎన్ఎస్ తేగ్, ఐఎన్ఎస్ త్రికాండ్ యుద్ధనౌకలుంటాయి. వీటిలో దాడికి సిద్ధంగా 8 బ్రహ్మోస్ క్షిపణులుంటాయి. వేగంగా కదులుతూ, తీరప్రాంతాల్లో దాడులు జరిపేందుకు, దాడికి అవసరమైన సహకారం అందించేందుకు ఫ్రిగేట్లు ఉపయోగపడుతాయి.

ఆ 'డ్రోన్లు' బెంగళూరులో తయారైనవే!

ఆపరేషన్ సిందూర్‌తో అరంగేట్రం

న్యూఢిల్లీ, మే 8: పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కోసం భారత సైన్యం అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించింది. వీటిలో స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హ్యామర్ బాంబులతో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆత్మాహుతి డ్రోన్లు కూడా ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ సహకారంతో బెంగళూరుకు చెందిన అల్ఫా డిజైన్ టెక్నాలజీస్ లిమిటెడ్(ఏడీటీఎల్) అభివృద్ధి చేసిన స్కై-స్ట్రైకర్ సూసైడ్ డ్రోన్లు ఈ ఆపరేషన్ సందర్భంగా అరంగేట్రం చేశాయి. శత్రు శిబిరాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి విరుచుకుపడేందుకు వీలుగా వీటిని రూపొందించారు. ఈ లాయిటరింగ్ మ్యూనిషన్లు 5 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలవు. సుదూర లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉన్న ఈ డ్రోన్లు 100 కిలోమీటర్ల పరిధిలో ఆకాశంలో తిరుగుతూ, లక్ష్యాన్ని నేరుగా ఢీకొట్టి విధ్వంసం సృష్టిస్తాయి. కామికేజ్ డ్రోన్లుగా పిలిచే ఈ ఆత్మహుతి డ్రోన్ల తయారీ ఖర్చు కూడా చాలా తక్కువే. ఇటువంటి 100 యూఏవీల కొనుగోలు కోసం 2021లో ఒప్పందం చేసుకొని భారత సైన్యంలో ప్రవేశపెట్టారు.

భారత్, పాక్ దాడులు ఆపేయాలి

» నేను ఏదైనా సాయం చేయగలిగితే చేస్తా: ట్రంప్

వాషింగ్టన్/లండన్, మే 8: భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరుదేశాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఆపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకు తానేదైనా సాయం చేయగలిగితే.. తప్పకుండా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. బుధవారం ఓవల్ ఆఫీసులో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'భారత్, పాక్ మధ్య పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి. రెండు దేశాల నుంచి గురించి నాకు బాగా తెలుసు. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, పరస్పర దాడులు ఆపేయాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. తనకు రెండు దేశాలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. అంతకుముందు భారత్ దాడికి కొద్ది గంటల తర్వాత ట్రంప్ మాట్లాడుతూ భారత్, పాక్ దశాబ్దాలుగా పోరాడుతున్నాయని, 'ఏదో జరగబోతోంది' అనే విషయం ప్రజలకు తెలుసన్నారు. రెండు దేశాలకు ఏమైనా సందేశం ఇస్తారా? అని అడగ్గా.. 'లేదు, ఇది చాలా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. మరోవైపు భారత్, పాక్ మధ్య ఘర్షణపై బ్రిటన్ పార్లమెంట్ చర్చించింది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పార్టీలకు అతీతంగా సభ్యులు కోరారు. బుధవారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చను ప్రారంభించిన బ్రిటన్ విదేశాంగ మంత్రి హమిష్ ఫాల్కనర్ మాట్లాడుతూ భారత్, పాక్ సహనం పాటించాలన్నదే తమ స్థిరమైన సందేశమని అన్నారు.

లాహోర్ వీడండి.. తమ పౌరులకు అమెరికా సూచన

పాకిస్థాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ ధ్వంసం చేయడంతో తమ పౌరులను అమెరికా అప్రమత్తం చేసింది. లాహోర్ వీడాలని సూచించింది. లేదంటే సురక్షిత స్థావరాల్లో తలదాచుకోవాలని సూచించింది. దీనికి సంబంధించి లాహోర్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.


ఆ న్యాయమూర్తిని అభిశంసించండి!

» జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో రాష్ట్రపతి, ప్రధానికి సీజేఐ లేఖ

న్యూఢిల్లీ, మే 8 : న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు బయటపడిన వ్యవహారంలో ఆయనపై చర్యలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సిద్ధమవుతున్నారు. జస్టిస్ వర్మను అభిశంసించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరినట్టు సమాచారం. ఢిల్లీలోని న్యాయమూర్తి నివాసంలో డబ్బు కట్టలు కనిపించడం నిజమేనంటూ సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఇప్పటికే తేల్చింది. సీజేకు తన నివేదికను అందించింది. ఆ నివేదికను జస్టిస్ వర్మకు పంపి, దానిపై వివరణను ఆయన కోరారు. వైదొలగడమే మంచిదని ఆయనకు సూచించినట్టు కూడా వార్తలు వచ్చాయి. అందుకు జస్టిస్ వర్మ నిరాకరించినట్టు సమాచారం. ఇలాంటి సందర్భంలో సదరు జడ్జిపై ఇన్‌హౌస్ ప్రొసీజర్‌ను నడిపి అభిశంసించడంలో అతి ముఖ్య ఘట్టానికి సీజే శ్రీకారం చుట్టారని తెలిసింది. ఇందులోభాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీకి సీజే లేఖ రాశారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి తప్పిదం తీవ్రమైనది కాదని కమిటీ నిర్ధారిస్తే ఇన్ హౌస్ ప్రొసీజర్‌లో సీజే మందలిస్తారు. అదేగనుక న్యాయమూర్తి చర్యను కమిటీ తీవ్రంగా పరిగణిస్తే అప్పుడు చీఫ్‌జస్టిస్ ఎదుట రెండు దారులు ఉంటాయి. న్యాయమూర్తిగా వైదొలగాలని లేక స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయాలని సదరు జడ్జికి సూచిస్తారు. అందుకు ఆ న్యాయమూర్తి నిరాకరిస్తే ఆయనకు న్యాయబాధ్యతలేవీ ఇవ్వొద్దంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఆదేశాలు జారీచేస్తారు. కమిటీ నివేదికలోని అంశాల తీవ్రతను రాష్ట్రపతి, ప్రధాని దృష్టికి తీసుకెళ్లి అభిశంసించాల్సిందిగా కోరతారు.

నూతన పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

» చరిత్రలో తొలిసారి ఓ అమెరికన్ ఎన్నిక



వాటికన్‌సిటీ, మే 8: నూతన పోప్‌గా అమెరికాకు చెందిన 69 ఏళ్ల రాబర్ట్ ప్రివోస్ట్ ఎన్నికయ్యారు. ఆయన్ను పోప్ లియో-14గా పిలవనున్నారు. 133 మంది కార్డినల్‌లు శతాబ్దాల నాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అత్యంత రహస్యంగా సమావేశమై నూతన పోప్‌ను ఎన్నుకున్నారు. దీనికి సూచికగా వాటికన్‌లోని ప్రాచీన సిస్టన్ చాపెల్ చర్చి పొగగొట్టం నుంచి తెలుపు రంగు పొగ వెలువడింది. పోప్‌గా ఓ అమెరికన్ ఎన్నిక కావడం చరిత్రలో ఇదే తొలిసారి. నూతన పోప్ ఎన్నిక ఖరారుతో ప్రజల హర్షధ్వానాలతో సెయింట్ పీటర్స్ స్కేర్ మార్మోగిపోయింది. అత్యున్నత కార్డినల్ నూతన పోప్ పేరును ప్రకటించారు. అనంతరం నూతన పోప్ తొలిసారి ప్రజలకు బహిరంగంగా కనిపించారు. అమెరికాలోని షికాగోలో జన్మించిన రాబర్ట్ ప్రివోస్ట్‌కు పెరూ పౌరసత్వం కూడా ఉంది. ఆర్చ్‌బిషప్‌గా ఎన్నో ఏళ్లపాటు ఆయన పెరూలో సేవలందించారు. 2023లో పోప్ ఫ్రాన్సిస్ ఆయన్ను వాటికన్‌కు పిలిపించి ఓ కీలక పదవి అప్పగించారు. ఈ ఏడాది జనవరిలో కార్డినల్‌గా నియమితులయ్యారు.

అడవిలో రక్తపుటేరులు

మందుపాతర పేల్చిన మావోయిస్టులు.. ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మృతి

» ఒక ఆర్ఎస్సైకి తీవ్ర గాయాలు

» ఎదురుకాల్పుల్లో 8 మంది నక్సల్స్ మృతి అని ప్రచారం



మృతులు శ్రీధర్, సందీప్, పవన్‌కల్యాణ్ (ఫైల్)

ములుగు/వాజేడు/వరంగల్ క్రైం/ఘట్‌కేసర్/మంచిర్యాల/ హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ చేస్తుండగా.. మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్‌కల్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఆర్ఎస్సై రణధీర్‌కు బుల్లెట్ గాయమైనట్టు తెలిసింది. పోలీసుల మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గాయపడ్డ ఎస్సైను హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. మరణించిన కమాండోల కుటుంబాలకు అండగా ఉంటామని డీజీపీ ప్రకటించారు. కాగా మందుపాతరపేలిన తర్వాత మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని, 8మంది మావోయిస్టులు మృతిచెందారని.. వీరిలో మావోయిస్టుపార్టీ అగ్రనేతలు చంద్రన్న, బండిప్రకాశ్ ఉన్నట్టు ప్రచారం జరిగింది. దీన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. బండి ప్రకాశ్(60) అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాత్‌ది మంచిర్యాల జిల్లా మందమర్రి.

6 నెలలు కాల్పుల విరమణ పాటిస్తాం..!

» మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ

రాష్ట్రంలో ఆరు నెలలు కాల్పుల విరమణ పాటించనున్నట్టు మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట గురువారం లేఖ విడుదలైంది. శాంతిచర్చలు జరపాలని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జగన్ పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ, ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా వస్తోందన్నారు. సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు ఇప్పటికే ఈ డిమాండ్‌తో కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు.





రుషికేశ్-గంగోత్రి రహదారిపై కూలిన హెలికాప్టర్, వేదవతి కుమారి (ఫైల్)

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

» అనంత టీడీపీ ఎంపీ సోదరి దుర్మరణం.. మరో ఐదుగురు కూడా

» ఆమె భర్తకు తీవ్రగాయాలు... రుషికేశ్ ఎయిమ్స్‌కు తరలింపు

గుంతకల్లు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అనంతపురం టీడీపీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి దుర్మరణం పాలయ్యారు. ఆమె భర్త ముష్టూరు భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను మెరుగైన చికిత్స కోసం రుషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు హెలికాప్టర్‌లో కెప్టెన్‌తో సహా మొత్తం ఏడుగురు ఉన్నారు. వారిలో ఆరుగురు.. కళా చంద్రకాంత్ సోనీ (61), విజయారెడ్డి (57), రుచి అగర్వాల్ (56), రాధా అగర్వాల్ (79), వేదవతి కుమారి (48), కెప్టెన్ రాబిన్ సింగ్ (60) మృతిచెందారు. మరణించిన వారిలో ముగ్గురు ముంబైకి చెందిన వారు. యూపీ, ఆంధ్రకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. కాగా, ఎంపీ సోదరి కుటుంబం గుంతకల్లులో నివాసం ఉంటోంది. వేదవతి భర్త భాస్కర్ స్థానికంగా నర్సింగ్ హోం నిర్వాహకుడిగా సుపరిచితుడు. మూడు రోజుల క్రితం ఆ దంపతులు చార్‌దామ్ తీర్థయాత్రకు వెళ్లారు. వాళ్లు గంగోత్రికి హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఆ హెలికాప్టర్ డెహ్రాడూన్‌లోని సహస్రధార హెలీప్యాడ్ నుంచి ఖర్సాలీ హెలీప్యాడ్‌కు గురువారం బయలుదేరింది. గంగోత్రికి వెళ్తుండగా ప్రతికూల వాతావరణంతో ఉదయం దాదాపు 8.45 గంటలకు రుషికేశ్-గంగోత్రి జాతీయ రహదారిపై పడిన హెలికాప్టర్... లోయలోకి జారిపోయింది. ఈ ప్రమాదంలో భాస్కర్ ఒక్కరే తీవ్రగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆయన కుమారుడు విక్కీ, భాస్కర్ కుమారుడు సాయి బెంగళూరు నుంచి విమానంలో బయలుదేరారు. భాస్కర్ మరో కుమారుడు అభిషేక్ హైదరాబాద్ నుంచి విమానంలో వెళ్లారు. భాస్కర్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.



జేఎన్‌టీయూ, టీసీఎస్ ఐయాన్ మధ్య ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

ఇంజనీరింగ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రామ్'

» ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

» జేఎన్‌టీయూ- టీసీఎస్ ఐయాన్ మధ్య ఒప్పందం

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేందుకు, వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రామ్' ద్వారా జేఎన్‌టీయూ, టీసీఎస్ ఐయాన్ సంస్థ కలిసి ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయని చెప్పారు. ఇందుకు సంబంధించి జేఎన్‌టీయూ-టీసీఎస్ ఐయాన్.. రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో గురువారం అవగాహన ఒప్పదం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీసీఎస్ ఐయాన్ సంస్థ తొలి దశలో ప్రతి ఐదు నెలలకు వంద మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణను ఇచ్చి, ఉద్యోగాలకు సిద్ధం చేస్తుందన్నారు. ఆ సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకున్న 3వేల సంస్థలు శిక్షణ పొందిన వారిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా తొలుత మంథనిలోని జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేయనున్నట్టు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కిషన్‌కుమార్‌రెడ్డి, టీసీఎస్ ఐయాన్ ప్రతినిధి స్మృతిముల్యే, టీసీఎస్ ఐయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి పాల్గొన్నారు.

నిరుద్యోగుల కలలు నెరవేర్చేందుకు అన్ని శాఖల్లో నియామకాలు: పొన్నం

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల పోరాటంతోనే తెలంగాణ సాధించుకున్నామని, నిరుద్యోగుల కలలు నెరవేర్చేందుకు ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో 60వేలకు పైగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. సమస్యలను అధిగమించి ఉద్యోగ నియామకాలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గురువారం సచివాలయంలో సంక్షేమ వసతి గృహాల అధికారులు (హెచ్‌డబ్ల్యూవో)గా ఎంపికైన వారికి మంత్రి చేతులమీదుగా నియామకపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. నియామకపత్రాలు అందుకున్న 132 మంది సంక్షేమ వసతిగృహాల అధికారులు తమ వృత్తిలో ప్రత్యేక గౌరవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల మార్గదర్శకంగా నిలవాలని, హెచ్‌డబ్ల్యూవోలు నిబద్ధతతో పనిచేయాలన్నారు.

ఐటీడీఏ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతలు పీవోలకే ఇవ్వాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం బాధ్యతలను జిల్లాల వారీగా కలెక్టర్లు పర్యవేక్షిస్తుండగా.. ఐటీడీఏల పరిధిలో మాత్రం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ల (పీవో)కు అప్పగించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు జ్యోతిబుద్ధ ప్రకాశ్, వీపీ గౌతమ్‌లతో సమావేశమైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఐటీడీఏ పీవోలకు పంపి అర్హులను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏల పరిధిలో చాలా మంది పాకల్లోనే ఉంటున్నారని, వారికి మొదటి ప్రాధాన్యత కింద ఇళ్లను మంజూరు చేయించాలని సూచించినట్టు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

'ఆపరేషన్ సిందూర్'కు సెల్యూట్: ఉత్తమ్

కోదాడటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అనన్యమైందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉగ్రవాదుల తొమ్మిది స్థావరాలను ఏక కాలంలో ధ్వంసం చేసి, త్రివిధ దళాలు తమ సత్తాను ప్రపంచానికి చాటడం గొప్ప విషయమన్నారు. పాకిస్థాన్‌కు ఇదే సరైన గుణపాఠం అని పేర్కొన్నారు. భారత వైమానికదళంలో పని చేసిన అనుభవం తనకు ఉందని, అందులోనూ యుద్ధ విమానాల పైలెట్‌గా యుద్ధ సమయంలో పని చేసిన అనుభవాన్ని మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

మిర్చి రైతులకు అండగా తెలంగాణలోనూ మార్కెట్ జోక్యం: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో నాలుగో వంతు మిర్చి పంటకు మార్కెట్ జోక్యం పథకాన్ని వర్తింపచేయనున్నట్లు ప్రకటించారు. ఆ పథకంలో భాగంగా మిర్చి ధరను రూ.10,374 గా నిర్ధారించినట్లు తెలిపారు. ఆ ధర కంటే మార్కెట్ ధర ఎంత తక్కువైతే అంత మొత్తాన్ని మొదట రాష్ట్రప్రభుత్వం రైతులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తుందని తెలిపారు. ఈ విషయంపై తాను గత నెల 4న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మిర్చిని పండించేందుకు అయిన ఖర్చు కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్నప్పుడు ఈ పథకం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

గాలి జనార్దన్ రెడ్డి శాసనసభ్యత్వం రద్దు

బళ్లారి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డికి నాంపల్లి సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఆయన శాసనసభ్యత్వం రద్దయింది. కొప్పళ జిల్లా గంగావతి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు కర్ణాటక విధాన సభ కార్యదర్శి విశాలాక్షి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

వహ్వా యాసంగి!

» రికార్డు స్థాయిలో 80 లక్షల ఎకరాల్లో పంటల సాగు

» ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయశాఖ తుది నివేదిక

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగిలో విస్తీర్ణం పరంగా వివిధ పంటల సాగు రికార్డు స్థాయిలో నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 79,96,302 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. నిరుడు యాసంగిలో సాగైన విస్తీర్ణంతో పోలిస్తే ఇది 12.25 లక్షల ఎకరాల మేర ఎక్కువ కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ తుది నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. నిరుడు (2023-24) యాసంగిలో 67,70,396 ఎకరాల్లో పంటలు సాగవ్వగా, ఈసారి సుమారు 80 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయటం గమనార్హం. రాష్ట్రంలో యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 63,54,286 ఎకరాలు. దీంతో పోలిస్తే... ఈ ఏడాది 26% మేర ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసినట్లు నివేదికలో వ్యవసాయ శాఖ పేర్కొంది. యాసంగిలో వరి సాధారణ విస్తీర్ణం 47.27 లక్షల ఎకరాలు కాగా ఈసారి 59.84 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ సీజన్‌లో 3.67 లక్షల ఎకరాల్లో జొన్న, 9.13 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 2.23 లక్షల ఎకరాల్లో శనగ, 56 వేల ఎకరాల్లో మినుము, 2.51 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 32 వేల ఎకరాల్లో నువ్వులు, 21 వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. 2024-25లో 30 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు తెలిపింది.

ఆక్రమించుకున్నవారికే..

హైడ్రా అంటే భయం, కోపం

పేదల పట్ల సానుభూతితో.. పెద్దల పట్ల కఠినంగా హైడ్రా.. నదుల ప్రక్షాళన మోదీ చేస్తే గొప్ప.. మేం చేస్తే తప్పా?

» మూసీ పరీవాహకం ప్రజలతో త్వరలో ఆత్మీయ సమ్మేళనం

» యూనివర్సిటీ భూములు తీసుకోలేదు

» ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా ప్రజలకు మేలు జరగకుండా కుట్రలు

» హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

» ప్రత్యేక వాహనాలు, వెబ్‌సైట్ ఆవిష్కరణ



హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి; చిత్రంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, మే8 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహకాన్ని, చెరువులను ఆక్రమించుకున్న వారికే హైడ్రా అంటే భయం, కోపం ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సరైన సమయంలో ఆలోచన చేయకపోవడం, నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాలు నివాసయోగ్యం కాకుండా పోతున్నాయని.. గుణపాఠం నేర్చుకోకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌లో అదే పరిస్థితి నెలకొంటుందన్నారు. అందుకే ఎవరెన్ని విమర్శలు చేసినా ఆక్రమణ నియంత్రణ, నిర్మూలన కోసం హైడ్రాను ఏర్పాటు చేశామని స్పష్టంచేశారు. గురువారం బుద్ధభవన్‌లో హైడ్రా పోలీసుస్టేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 85హైడ్రా ప్రత్యేక వాహనాలు, 37 ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. నగరంలో మునిసిపల్, విద్యుత్, ఇరిగేషన్, పోలీసు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏదైనా సమస్య ఏర్పడితే ముందు ఎవరు వెళ్లాలనే విషయంలో ఇబ్బందులున్నాయని, అందుకే హైడ్రా కు రూపకల్పన చేశామని చెప్పారు.

హైడ్రా కేవలం కూలగొట్టడానికి కాదు..

హైడ్రా అంటే పేదోళ్ల ఇళ్లు కూలగొట్టేందుకే అన్నట్టుగా కొందరు చిత్రీకరిస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. "హైడ్రా కేవలం కూలగొట్టడానికి కాదు.. నిర్మాణాలు చేయడానికి, ఎంతటి గొప్పవారు ఆక్రమణలకు పాల్పడినా చట్టం ముందు సమానులే అని నిరూపించడానికి తీసుకొచ్చాం. దీనిలో విపత్తుల సహాయక చర్యలూ భాగమే. అకాల వర్షాలు, గాలి దుమారానికి చెట్లు, స్తంభాలు విరిగిపడుతున్నాయి. బస్తీల రోడ్లకు గోడలు అడ్డంగా కట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీటన్నింటినీ పరిష్కరించడానికి హైడ్రా ముందుకొచ్చింది"అని సీఎం చెప్పారు. హైడ్రా అధికారులు మానవీయకోణంలో వ్యవహరించాలని... పేదల పట్ల సానుభూతితో, పెద్దల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. "విలాసవంతమైన లేక్‌వ్యూ పేరుతో అపార్ట్‌మెంట్లను చెరువుల్లో కడుతున్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్‌లో ఫామ్‌హౌజ్‌లు కట్టినవారు వాళ్ల డ్రైనేజీ తీసుకెళ్లి తాగునీటిలో కలుపుతున్నారు. నియంత్రించాల్సిన బాధ్యతలేదా? ప్రముఖులు హైటెక్‌సిటీ ప్రాంతంలో చెరువులు ఆక్రమించుకుంటే పునరుద్ధరిస్తున్నాం" అని రేవంత్ తెలిపారు. మూసీ మురికికూపంలో బతుకుతున్న పేదలకు మంచి జీవితం అందజేద్దామనుకుంటే విపక్షాలు కలిసిరావడంలేదని సీఎం మండిపడ్డారు. "మీరేమో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, జన్వాడ, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లలో విశాలమైన భవంతుల్లో బతుకుతారు. పేదలు మురికిలోనే మునిగిచావాలా? గుజరాత్‌లో మోదీ సబర్మతిని కట్టుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లో యోగి గంగానదిని పునరుద్ధరించుకోవచ్చు. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేయొద్దా? మోదీ చేస్తే గొప్ప ఎట్లా? తెలంగాణ ప్రభుత్వం చేస్తే తప్పు ఎట్లా?" అని ప్రశ్నించారు. త్వరలో అధికారులు, ప్రజాప్రతినిధులను పంపి.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్కడి పేదల జీవితాలకు వెలుగునిస్తామని, అవసరమైతే ఫ్యూచర్ సిటీలో ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారు. లేకుంటే ఆ ప్రాంతాల్లోనే ప్రతి 5 కిలోమీటర్లకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి, ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ అపార్ట్‌మెంట్ కట్టి ఫ్లాట్లు ఇస్తామన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగిస్తే నగరం శోభ పెరుగుతుందని, ఇలా ప్రకృతిని కాపాడుతామంటే కొందరికి దుఃఖం వస్తోందని సీఎం విమర్శించారు. "యూనివర్సిటీ భూములు 400 ఎకరాలను ఎవరో ప్రైవేటు కంపెనీకి కట్టబెడితే.. 20ఏళ్ల తర్వాత కొట్లాడి వెనక్కి తీసుకొచ్చి అందులో పెద్ద ఐటీ పార్కును అభివృద్ధి చేద్దామనుకుంటే అడ్డుకున్నారు. చెరువులను కాపాడి, మూసీని ప్రక్షాళన చేసి, నాలాలు, రోడ్ల ఆక్రమణలు తొలగిస్తే ప్రకృతిని కాపాడినట్లుకాదా? అలాచేస్తే రియల్టీ పడిపోతుందంటారు. ఈ 400ఎకరాల్లో ఐటీ పార్కు ఏర్పాటు చేద్దామంటే ప్రకృతి పడిపోతుందంటారు. కడుపు నిండా విషం నింపుకొని ఈ ప్రభుత్వాన్ని ముందుకెళ్లనివ్వొద్దన్న ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది"అని అన్నారు.

నేడు బెంగళూరుకు సీఎం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం బెంగళూరుకు వెళ్లనున్నారు. అక్కడ ఓ ఆంగ్ల పత్రిక నిర్వహించే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.15 గంటల నుంచి 2.45 గంటల వరకు ఆ కార్యక్రమంలో పాల్గొని సామాజిక న్యాయం అనే అంశంపై మాట్లాడతారు. తిరిగి సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటారు. ఆ కార్యక్రమంలో సీఎం రేవంత్, మరికొన్ని రాష్ట్రాల సీఎంలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు..: కమిషనర్ ఏవీ రంగనాథ్

ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపల్, పోలీస్‌శాఖల అధికారాలను హైడ్రాకు పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారని, చాలా సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగకరంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందన్నారు. భూముల ఆక్రమణలు, మోసాలు, ఫోర్జరీలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకునే అవకాశం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉగ్రమూకలకు నూకలు చెల్లినట్లే!

మా ఆడబిడ్డల నుదుటి సిందూరం తొలగించినవారికి 'ఆపరేషన్ సిందూర్'తో సమాధానం చెబుతాం


జవాన్లకు స్ఫూర్తినిచ్చేందుకే సంఘీభావ ర్యాలీ : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించే ప్రసక్తేలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి, దేశాన్ని దెబ్బకొట్టాలని చూసే వారికి, ఉగ్రమూకలకు నూకలు చెల్లినట్లేనని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని తుదిముట్టించే విషయంలో భారత సైన్యానికి 4కోట్ల తెలంగాణ ప్రజలు అండగా నిలుస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను భుజానపెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తినిచ్చేందుకే ఈ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. దేశ భద్రత విషయంలో రాజకీయాలకతీతంగా ప్రజలంతా ఏకమవుతారని తెలిపారు. దేశ ప్రజలు శాంతికాముకులన్నారు. మా ఆడబిడ్డల నుదుటి సిందూరం తుడిచేయాలనుకునే వారికి ఆపరేషన్ సిందూర్‌తో సమాధానం చెబుతామని హెచ్చరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకు వచ్చి.. అమాయక ప్రజల్ని పొట్టనపెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశ భద్రత విషయంలో జెండాలకు, అజెండాలకు అతీతంగా 140 కోట్ల మంది భారతీయులు ఒక్కటవుతారని చెప్పారు. 'పాక్ పాలకులు, ఉగ్రవాదులు సహా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి దాడులు చేయాలనుకునే వారెవరికైనా ఒక్కటే హెచ్చరిక చేస్తున్నాం. మా దేశం వైపు కన్నెత్తి చూస్తే ఎవ్వరినీ వదలం. ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. బతికే అర్హత కోల్పోయినట్లే' అని రేవంత్ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి రాజకీయాలు ఉన్నా.. దేశ రక్షణ విషయంలో ప్రభుత్వానికి అండగా ఉంటామని కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. గాంధీజీ శాంతి సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకున్న భారతీయులు.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ, ప్రపంచదేశాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. మన ఆడబిడ్డల నుదుటి తిలకం తుడిచేసిన ఉగ్రమూకలకు ఆపరేషన్ సిందూర్ ద్వారా మన వీరజవాన్లు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ సంఘీభావ ర్యాలీలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు, ఆర్మీ మాజీ అధికారులు, పోలీసులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న సీఎం.. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సిందూర్ టైటిల్ కోసం 30 మంది పోటీ!

» చిత్ర పరిశ్రమలో నిర్మాతల దరఖాస్తు

» ఆ టైటిల్‌తో సినిమా తీస్తే చాలని..



హైదరాబాద్, మే 8: ఆపరేషన్ సిందూర్.. ఇప్పుడు దేశవ్యాప్తంగా తారక మంత్రంలా వినిపిస్తున్న పేరు. పహల్గాంలో టూరిస్టులపై పాశవికంగా దాడి చేసి హతమార్చిన ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సైనిక చర్య జరిపి గట్టి బుద్ధి చెప్పింది కేంద్రప్రభుత్వం. మహిళలకు సిందూరం ఎంతో పవిత్రం కనుక దానిని దూరం చేసినందుకు ప్రతీకారం తీర్చుకుంది. 'మేమంతా మీ వెంటే' అంటూ భారతీయ చిత్ర పరిశ్రమ సైతం ప్రభుత్వానికి మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' టైటిల్‌కు చిత్ర పరిశ్రమలో మంచి డిమాండ్ ఏర్పడింది. 'ఆపరేషన్ సిందూర్', 'మిషన్ సిందూర్', 'సిందూర్.. ద రివెంజ్'.. ఇలా సిందూర్ అనే పదం వచ్చేలా రకరకాల టైటిల్స్‌తో రెండు రోజుల్లో 30 మంది నిర్మాతలు ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌కు దరఖాస్తులు పెట్టుకోవడం విశేషం. ఈ సంఖ్య శుక్రవారానికి 50 వరకూ పెరగవచ్చని అంటున్నారు. 'ఒక వ్యక్తి ఎన్ని టైటిల్స్‌కి అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ఎవరు ముందు దరఖాస్తు పెట్టారో వారికే ఒక టైటిల్ ఇచ్చే పద్ధతి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ నిర్మాతైనా 'సిందూర్' టైటిల్‌తో సినిమా తీస్తే కచ్చితంగా అది పెద్ద న్యూస్ అవుతుంది' అన్నారు ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ నాగ్రత్. తమకు వచ్చిన దరఖాస్తుల్లో 'హిందుస్థాన్ కా సిందూర్', 'మిషన్ ఆపరేషన్ సిందూర్', 'సిందూర్ కా బద్లా', 'పహల్గాం.. ద టెర్రర్ అటాక్', 'పహల్గాం ఎటాక్' వంటి టైటిల్స్ కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. టీ సిరీస్, జీ స్టూడియోస్ వంటి ప్రముఖ సంస్థలు కూడా 'సిందూర్' టైటిల్ కోసం ఈ మెయిల్ పెట్టడం విశేషం.

'స్లీపర్ సెల్స్' క్రియాశీలం కావచ్చు!

» అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్ర సూచన

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశంలో ఉగ్రవాదుల స్లీపర్ సెల్స్ తిరిగి క్రియాశీలమయ్యే అవకాశాలు ఉండడంతో కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. గతంలో జరిగిన ఉగ్రవాద దాడుల్లో అరెస్టైన వారు, వారికి సహకరించిన వ్యక్తులను గమనిస్తుండాలని కేంద్ర నిఘా విభాగాల నుంచి రాష్ట్రాలకు సూచనలు అందినట్లు సమాచారం. ఈ క్రమంలో కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు పని ప్రారంభించాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌తో పాటు పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం, పలువురు ఉగ్రవాదులు చనిపోయిన నేపథ్యంలో అక్కడ శిక్షణ పొంది దేశంలోకి చాపకింద నీరులా వచ్చి స్లీపర్ సెల్స్‌గా జనంతో కలిసిపోయి ఉంటున్న వారిని గుర్తించడం నిఘా విభాగాల ముందున్న సవాల్. దేశం దృష్టిని మళ్లించడానికి ఉగ్రవాదులు భారీ దాడులకు పాల్పడే అవకాశాలు ఉండడంతో నిఘాను పటిష్ఠం చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు గతం లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడిన సంగతి తెలిసిందే. పాక్‌లోని ఉగ్ర శిబిరాల్లో శిక్షణ పొందడానికి వెళ్తున్న వారిని, శిక్షణ పొంది తిరిగి వచ్చిన పలువుర్ని గతంలో తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాలని ఆదేశాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బృందాలు అప్రమత్తమయ్యాయి.

ఆస్పత్రులపై 'రెడ్ క్రాస్' గుర్తు

» యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ సన్నద్ధత

» జెనీవా ఒప్పందం ప్రకారం రెడ్ క్రాస్ ఉన్న భవనాలపై దాడి చేయొద్దు

» రాష్ట్రంలో 164 ఆస్పత్రి భవనాలపై ఏర్పాటు



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అప్రమత్తమైంది. ఒకవేళ యుద్ధం జరిగే సమయంలో వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా యుద్ధ సమయంలో ఆస్పత్రులపై దాడి జరగకుండా ఉండేందుకు.. ఆస్పత్రి భవనాలపై రెడ్‌క్రాస్ గుర్తును పెద్ద సైజులో పెయింటింగ్ చేయిస్తున్నారు. ఫలితంగా విమానాలు, జెట్‌లు, డ్రోన్ల ద్వారా ఆస్పత్రులను సులభంగా గుర్తించవచ్చు. జెనీవా ఒప్పందం ప్రకారం ఈ రెడ్ క్రాస్ గుర్తు ఉన్న భవనాలపై శత్రు దేశాలు దాడి చేయకూడదు. దేశంలో యుద్ధం జరుగుతున్నప్పటికీ.. పౌరులకు, సైనిక సిబ్బందికి అందే వైద్య సేవలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రపంచ దేశాలు ఈ మానవతా ఒప్పందం చేసుకున్నాయి. 1949లో జరిగిన ఒప్పందాన్ని ఎవరైనా అతిక్రమిస్తే దానిని యుద్ధ నీతుల ఉల్లంఘనగా పరిగణిస్తారు. కాగా, ఇప్పటివరకు రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని 164 ప్రభుత్వ ఆస్పత్రులపై వైద్య, ఆరోగ్య శాఖ రెడ్ క్రాస్ గుర్తును పెయింటింగ్ వేయించింది. అత్యధికంగా హైదరాబాద్‌లో 15 ఆస్పత్రులు, సంగారెడ్డిలో 12 ఆస్పత్రుల్లో పెయింటింగ్ పని పూర్తి చేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన అన్ని ఆస్పత్రుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇక, యుద్ధ సన్నద్ధత చర్యల్లో భాగంగా.. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సెలవులను రద్దు చేసినట్టు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, అన్ని ఆస్పత్రుల్లో మందులు సరిపడా నిల్వ ఉంచుకోవాలని, తెలంగాణ వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా అవుతున్న అత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.


ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటున్నా: సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్(కరీంనగర్), మే 8 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లో తాను పోస్ట్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన వ్యాఖ్యలు ఎవరినీ, ఏ మతాన్ని, సందర్భాన్ని ఉద్దేశించినవి కావని, అవి ఎవరైనా బాధించినా, మనోభావాలు దెబ్బతీసినా క్షమించాలని ఆమె కోరారు. ఒక పరిశోధకురాలుగా యుద్ధం అంటే భయంతో, అందులో మరణించే పసిపిల్లలు గుర్తుకు వచ్చి మాత్రమే ఆ పోస్ట్ చేశానన్నారు. దేశ భద్రత, సైన్యం, ప్రభుత్వంపై ఎటువంటి అగౌరవంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. తాను బాధ్యత కలిగిన పౌరురాలినని, దేశభక్తితోనే స్పందించానని అన్నారు.

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు

హైకోర్టు షాక్

కొత్త కోర్సులు, సీట్ల పెంపుపై సర్కారుదే తుది నిర్ణయమని తేల్చి చెప్పిన ధర్మాసనం



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోర్సుల విలీనం, సీట్ల పెంపు విషయంలో పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీట్ల పెంపునకు అనుమతులు నిరాకరిస్తూ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మూడు సార్లు కోర్టును ఆశ్రయించినా ఆయా కళాశాలలకు ఊరట లభించలేదు. కాలేజీలను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఉందని.. కొత్త కోర్సులు, సీట్ల పెంపు విషయంలో అంతిమ నిర్ణయం సర్కారుదేనని హైకోర్టు స్పష్టం చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి బీటెక్-సీఎస్‌ఈ, వివిధ విభాగాల్లో సీట్లు పెంచుకోవడానికి ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అనుమతినిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులివ్వడం లేదని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, సీఎంఆర్, ఎంఎల్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సహా 14 ఇంజనీరింగ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. తామంతా గత ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నామని ఆరోపిస్తూ రాజకీయ కక్షతోనే అనుమతులివ్వడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నాయి. దీంతో పిటిషనర్ల కేసులను ఒక్కొక్కటి ప్రత్యేకంగా పరిశీలించి అనుమతుల విషయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించాయి. అయితే సీట్ల పెంపునకు సదరు కాలేజీలకు వనరులు, మౌలిక సదుపాయాలు, అర్హతలు లేవని పేర్కొంటూ ఇప్పటికే రెండు సార్లు ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తూ నిర్ణయించింది. దీంతో పిటిషనర్లయిన కాలేజీలు మూడో రౌండ్ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. 'సర్కారు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అన్ని అంశాలను పరిగణనలోకి అనుమతులను తిరస్కరించింది. గత ప్రభుత్వంతో అనుబంధం ఉన్నందుకే సీట్ల పెంపునకు అనుమతులివ్వడం లేదని పిటిషనర్లు ఆరోపిస్తున్నప్పటికీ దానికి ఆధారాలు లేవు. 'సంగం లక్ష్మీబాయి విద్యాపీఠ్' కేసులో కాలేజీలు, కోర్సులు, సీట్లు విచ్చలవిడిగా పెరిగిపోకుండా నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిర్ణయంలో జోక్యానికి నిరాకరిస్తూ పిటిషన్లను కొట్టేస్తున్నాం' అని ధర్మాసనం తీర్పునిచ్చింది.

బతుకమ్మ కుంట భూములపై యథాతథ స్థితి

హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట్‌లోని వివాదాస్పద బతుకమ్మ కుంటకు చెందిన ఏడు ఎకరాల భూమి విషయంలో ప్రభుత్వ ఏజెన్సీలైన హైడ్రా, హెచ్ఎండీఏ.. భూమిని క్లెయిం చేస్తున్న ప్రైవేటు పార్టీలు యథాతథ స్థితి కొనసాగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. సదరు ప్రాంతంలో కుంట పునరుద్ధరణ పనులు చేపట్టకుండా అడ్డుకోవాలని ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో స్టేటస్ కో విధిస్తూ జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ శ్రీనివాస రావు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

త్వరలో టీ కాంగ్రెస్ కోర్ కమిటీ భేటీ

» కేసీ వేణుగోపాల్‌తో సమావేశమైన టీపీసీసీ చీఫ్

న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మంత్రివర్గ విస్తరణతోపాటు ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న టీపీసీసీ కార్యవర్గ కూర్పును ఖరారు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమైంది. ఇందుకోసం రెండు, మూడు రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం జరుగనున్నదని విశ్వసనీయ సమాచారం. ఇక తెలంగాణ కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. టీపీసీసీ కూర్పులో సామాజిక సమతుల్యత, పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై వేణుగోపాల్‌కు మహేశ్ కుమార్ నివేదిక అందజేశారు. కొత్తగా ఏర్పాటయ్యే టీపీసీసీలో నలుగురికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు కల్పించనున్నారని తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.